సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 38
2-6-54


జయ జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి బుధవారం



" ఏడిస్తే నీకళ్ల నీలాలుకారు !

........నీలాలు కారితే నే చూడలేను !"

ఫొటో : ఎ. వి. వి. నరసింగరావు (రాజమండ్రి)



బుధవారం, మే 19:

—రష్యా సమ్మతించినా సమ్మతించక పోయినా ప్రపంచ అణుశక్తినిధి స్థాపనావకాశాలను పరిశీలిస్తున్నట్లు ఐసెన్‌హోవర్ ప్రకటించారు.

—ఇండో-చీనా సమస్యగురించి జినీవాలో రహస్య సమావేశం (మూడో పర్యాయం) జరిగింది.

—ఆగ్నేయాసియా సంరక్షణ వ్యవస్థను బ్రిటన్ చేరకుండానే స్థాపించడం అసంభవం కాదని అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ పత్రికా సమావేశంలో అన్నారు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: జనతావారి "పరివర్తన"లో ఎన్. టి. రామారావు.

—అమెరికా, పాకిస్తాన్ ప్రభుత్వాల 'పరస్పర దేశసంరక్షణ సహాయపు ఒడంబడిక' పైన కరాచీలో సంతకాలు జరిగాయి. పాకిస్తాన్‌లో మిలిటరీ స్థావరాలను అమెరికాకు ఒప్పగించడంలేదని ఈ సందర్భంలో ప్రకటించబడింది.

—ఈజిప్టుప్రభుత్వం కన్సల్టేటివ్ ఎసెంబ్లీని స్థాపించే శాసనాన్ని ప్రకటించింది.

—ఫిల్మ్ ఇంక్వైరీకమిటీ సూచనల ననుసరించి నేషనల్ ఫిల్మ్‌బోర్డు ఒకటి ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యూరో ఒకటి స్థాపించి, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు కార్యకలాపాలను నేషనల్ ఫిల్మ్ బోర్డుకు ఒప్పగించాలని భారతప్రభుత్వం నిర్ణయించినట్లు డా॥ కేస్కర్ లోకసభలో ప్రకటించారు.

—కేంద్రప్రభుత్వం ఆర్థిక వ్యవహార నిర్వహణలో లోపాలవల్ల వచ్చిన నష్టాలను గురించి ఆడిట్ రిపోర్టు వివరాలు పార్లమెంటుకు తెలియచేయబడినాయి.

—సేల్స్‌టాక్స్ అక్టు సవరణ బిల్లును ఆంధ్రశాసనసభ చర్చించి సెలక్టు కమిటీ పరిశీలనకు సమర్పించింది.

—ఆంధ్రరాష్ట్రంలో నిలవున్న పొగాకును సక్రమంగా ఉపయోగించే నిమిత్తం ప్రభుత్వం సిగరెట్ ఫాక్టరీ స్థాపించాలని ఆలోచిస్తున్నట్లు ఆంధ్రశాసనసభలో మంత్రి తిమ్మారెడ్డిగారు ప్రకటించారు.

గురువారం, మే 20:

—లావోస్, కాంబోడియాలలో రాజకీయ సమస్యల చర్చను ప్రస్తుతానికి వాయిదావేసి యుద్ధవిరమణ గురించి మాత్రం చర్చించడానికి జినీవాలో అన్ని పక్షాలవారూ రాజీపడ్డారని జినీవా వార్త.

—ఇండో చీనా యుద్ధంగురించి అమెరికా, ఫ్రాన్సు ప్రభుత్వాల మధ్య నడిచిన సమాలోచనలనుగురించి బ్రిటన్‌కు ముందుగా తెలియచెయ్యలేదని బ్రిటిష్ పార్లమెంటులో సర్ విన్స్‌టన్ చర్చిల్ ప్రకటించారు.

—అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, న్యూజీలండ్ సైనికాధికారులు ఆగ్నేయాసియా రక్షణ వ్యవస్థనుగురించి వాషింగ్‌టన్‌లో త్వరలో చర్చించగలరని లండన్ వార్త.

—ఆసియా దేశాలపట్ల మైత్రిభావమే గాని ఆక్రమించాలనే భావంలేదని చీనా (కమ్యూనిస్టు) ప్రభుత్వ విధానాన్ని జినీవాలో ఒక చీనా ప్రతినిధి వివరించారు.

—నేషనలిస్టు చీనా అధ్యక్షునిగా తనను తాను ప్రకటించుకొంటూ తన అధ్యక్షపదవి కాలం ఆరేళ్లలో చీనాదేశాన్ని తిరిగి ఆక్రమించుకోగలడని చియాంగ్ కైషేక్ ప్రకటించాడు.

—జిబ్రాల్టర్‌ను స్పెయిన్‌కు ఒప్పగించాలనే ఒప్పందం యుద్ధకాలంలో జరిగిందనే మాట నిజంకాదని చర్చిల్ ప్రకటించారు. [అలా ఒప్పందం జరిగిందనీ, కాని బ్రిటిష్ ప్రభుత్వం వాగ్దానభంగం చేసిందనీ ఆరోపిస్తూ జనరల్ ఫ్రాంకో ఒక ఆరోపణచేశారు.]

—ఐరిష్ ఎన్నికలలో డీవెలరా పార్టీ పరాజయం పొందింది.

—నారాయణ గంజ్ (తూర్పు పాకిస్తాన్)లో కల్లోలానికి కమ్యూనిస్టులు కారకులు కారని తూర్పుబెంగాల్ ముఖ్యమంత్రి ఫజ్లుల్‌హక్ కరాచీలో ప్రకటించారు.

—తిరువాన్కూర్-కొచ్చిన్‌లో లెఫ్టిస్ట్ యునైటెడ్ ఫ్రంట్ నుండి చీలిపోడానికి రాడికల్ సోషలిస్టుపార్టీ నిర్ణయించింది.

శుక్రవారం, మే 21:

—ఇండోచీనా సమస్యనుగురించి అయిదు అంశాలు ప్రాతిపదికగా చర్చించడానికి జినీవాలో అన్నిపక్షాలవారూ అంగీకరించారు.

—దక్షిణ కొరియా ఎన్నికలలో సింగ్మన్ రీ పార్టీకి మిగిలిన పార్టీలకంటె ఎక్కువ స్థానాలు లభించినప్పటికీ మెజారిటీ మాత్రం లభించలేదు.

—ఇండియా పాకిస్తాన్ వివాదాలలో టర్కీ తటస్థవిధానం అవలంబిస్తుందని టర్కీ విదేశాంగశాఖ తెలియపరిచింది.

—గోవాపై హక్కులనుగురించి బ్రిటన్‌లోని పోర్చుగీస్ రాయబారి బ్రిటిష్ విదేశాంగ వ్యవహారాల స్టేట్‌మంత్రి సెల్విన్ లాయిడ్‌తో సంభాషించారు.

—ప్రభుత్వోద్యోగులను నిర్బంధంగా ప్రాంతీయ సైన్యాలలో చేర్చే బిల్లు ఒకదానిని భారతప్రభుత్వం లోకసభలో ప్రవేశపెట్టింది.

—సివిల్ మేరేజ్ బిల్లునుగురించి మరొకరోజు లోకసభ చర్చను భారతప్రభుత్వం

అంగీకరించింది. లోకసభ ప్రస్తుత సమావేశం నేటితో ముగిసింది.

—గోదావరి వరదలవల్ల ప్రక్క ప్రాంతాలకు ముప్పు సంభవించకుండా ఇంకేయే చర్య లవసరమో నివేదించడానికి ఆంధ్రప్రభుత్వం ఒక కమిటీ నియమించింది.

శనివారం, మే 22 :

—కొరియా సమస్య పరిష్కారానికి చీనా, దక్షిణ కొరియా ప్రతినిధులు రెండు రకాల ప్రతిపాదనలను జినీవా సమావేశంలో సూచించారు.

—ఆగ్నేయాసియారక్షణవ్యవస్థలో కెనడా చేరబోదని అటావాలో అధికారులు ప్రకటించారు.

—వి. కె. కృష్ణమీనన్ పారిస్‌లో బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్‌తో మూడు గంటలసేపు కొరియా ఇండో చీనా సమస్య చర్చలనుగురించి సంప్రదించారు. (తరవాత ఈడెన్ జినీవా చర్చలనుగురించి బ్రిటిష్ ప్రధానికి నివేదించడానికి లండన్ వెళ్ళారు.)

—ఈజిప్టుదేశంమీదుగా ఇండోచీనాకు సైనికులను గాని ఆయుధసామగ్రిని గాని విమానాలలో తీసుకుపోరాదని ఈజిప్టు ప్రభుత్వం నిషేధించింది.

—అమెరికాలో వోటింగ్ హక్కు ఇచ్చే కనీస వయఃపరిమాణాన్ని 21 నుంచి 18 కి తగ్గించాలని ఐసెన్‌హోవర్ చేసిన సూచనను సెనేట్ నిరాకరించింది.

—భారత రాజ్యాంగంలో ప్రభుత్వాధీనమైన ఆస్తులకు ఇవ్వవలసిన పరిహారం గురించిన నిబంధనలను సవరణ చెయ్యాలనే సూచనలను కాంగ్రెస్ కార్యవర్గం ఆమోదించింది.

—కాంగ్రెస్ కేంద్ర కార్యవర్గం ఢిల్లీలో సమావేశమై మహారాష్ట్ర, కర్ణాటక కాంగ్రెస్‌లుమాత్రం ఇతరపార్టీలతో సమష్టి నివేదికలను రాజ్యపునర్వ్యవస్థీకరణ విచారణసంఘానికి సమర్పించవచ్చునని అనుమతి ఇచ్చింది. జాతీయప్రణాళిక ఋణాలలో విరివిగా పాల్గొనవలసిందని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం చేసింది.

—ఉపాధ్యాయుల వ్యక్తిగత జీవితంలో గాని వారి రాజకీయ కార్యకలాపాలలో గాని ప్రభుత్వాలు నిర్బంధాలు విధించకూడదని అంతర్జాతీయ కార్మికసంస్థ సలహా సంస్థ సూచన చేసింది.

—తిరువాన్కూర్–కొచ్చిన్‌లో ఫస్ట్, సెకండ్ ఫారములలో కూడా విద్యార్థులకు వేతనం చెల్లించ నక్కరలేకుండా విద్యాబోధనకు ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

ఆదివారం, మే 23 :

—జినీవాలో కృష్ణమీనన్ చీనా ప్రధాని చౌ ఎన్‌లేతో మూడుగంటలసేపు చర్చలు జరిపారు.

—ఇండోచీనాలో ఫ్రెంచి సైనిక వ్యూహానికి ప్రధానమైన మార్పులను జనరల్ ఎలీ పారిస్ ప్రభుత్వానికి సూచించారు.

—యానాం నుండి ఫ్రెంచి పోలీసులు సమీప గ్రామాలపై దాడిచేసి కొన్ని ఇళ్ళపైబడి దోచుకున్నారనీ కొంతమందిని కొట్టారనీ కాకినాడ వార్త.

—భారత ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో భారతదేశమందలి ప్రధానోపాధ్యాయుల సభ స్కూల్ ఫైనల్ పరీక్షలను రద్దుచేయాలని సలహా ఇచ్చింది.

—పంచాయతీ పరిపాలనా విధానాన్ని భారతదేశమంతటా ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ కేంద్ర కార్యవర్గం తీర్మానం చేసింది.

—కృష్ణమీనన్ గారు జినీవాలో రష్యన్ ప్రతినిధి మాలటోవ్‌తోను, అమెరికన్ ప్రతినిధి జనరల్ వాల్టర్ బెడెల్‌స్మిత్‌తోను ఇండోచీనా కొరియాలను గురించి చర్చించారు.

—ఇండో చీనా యుద్ధంలో అమెరికన్ నౌకా విమానబలాలు పాల్గొనడానికీ, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ సైన్యాలు పాల్గొనడానికీ అమెరికా ఒక కార్యక్రమాన్ని ఫ్రెంచి ప్రభుత్వానికి అందచేసిందని పారిస్ వార్త.

—ఇండో చీనాసమస్య పరిష్కారానికి మాలటోవ్ ప్రతిపాదించిన అయిదు అంశాలనూ సమన్వయించి ఫ్రెంచి విదేశాంగ మంత్రి ఏడంశాల ప్రణాళిక ఒకటి జినీవా సమావేశంలో ప్రతిపాదించారు.

—ఇండోచీనాలో యుద్ధం నిలుపుదల కోసం ఉభయపక్షాల సైనిక ప్రతినిధులూ చర్చలు జరపాలని జినీవా రహస్య సమావేశంలో రష్యన్ విదేశాంగమంత్రి మాలటోవ్ ప్రతిపాదించారు.

—కొరియాలో ఎన్నికలనుగురించి చీనా ప్రతిపాదనలను జినీవాలో దక్షిణ కొరియా ప్రతినిధి ప్యున్ నిరాకరించారు.


—థాయ్‌లాండ్‌లో సైనిక స్థావరాలను పాశ్చాత్య దేశాలు వినియోగించుకోదలిస్తే థాయ్‌ప్రభుత్వం అభ్యంతర పెట్టదని థాయ్ సైనికాధికారి ప్రకటించారు.

—చీనాకు ఆయుధసామగ్రి పంపడానికి బ్రిటన్ తలపెట్టిందని అమెరికన్ సెనేటర్ మెకార్థి చేసిన ఆరోపణ అసత్యమని బ్రిటిష్ విదేశాంగ శాఖాధికారి ప్రకటించారు.

—తూర్పు జర్మనీ (కమ్యూనిస్టు) ప్రభుత్వాన్ని నిరాకరించబోరనీ, జర్మనీ ఉభయప్రాంతాలమధ్యా రాకపోకలకుగల నిర్బంధాలను తొలగించాలనీ తెలియపరుస్తూ బాన్‌లోని అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి హైకమీషనర్లు రష్యన్ కమీషనర్‌కు లేఖలు పంపారు.

(5౯-వ పేజీ చూడండి)

కాలక్షేపం



"కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మిసోకి - కమలినభంగిన్
దమతమ నెలవులు తప్పిన
దమమిత్రులె శత్రులౌట-తథ్యముసుమతీ."

తా॥ ఓ మంచిబుద్ధిగలవాడా? తామర పూవులు తమ స్వస్థానమైన జలాశయమును విడిచిపెట్టినయెడల, ఆ కమలములకు ఆప్తమిత్రుడైన సూర్యుని కిరణాలు సోకి ఆ కమలములు వాడి కృశించిపోగలవు అదేవిధంగా, తమతమ స్వస్థానములను విడిచిపెట్టి నటువంటివారికి, వారి ఆప్తమిత్రులే వారి పాలిటి శత్రువులగుట నిజము.

స్థానబలిమి అనేది ఒకటిఉంది. గజేంద్ర మోక్షం కథ చదివిచూస్తే యీ విషయం బోధపడుతుంది. నీటిలో బలమైన జంతువు మొసలి. మెట్టమీద జగజెట్టివంటిది గజం ఈ ఏనుగు ఒక కాసారంలోని నీరు త్రాగడానికి వెళ్లింది. నీటిలోఉన్న మొసలి ఆ ఏనుగుయొక్క కాలును పట్టుకొన్నది. మొసలిని విడిపించుకొనుటకున్నూ వీలైతే దానిని ఒడ్డుకు యీడ్చుకొని వచ్చుటకున్నూ గజ పట్టుదలతో గజప్రయత్నంచేసి గజమైనా ఒడ్డుమీదకు యీడ్చుకొని రాలేక ఆ గజరాజు గజగజలాడిపోయినాడు. కాని, జీవనం (అనగా నీరు) తనకు జీవనమాటచేత నీటిలో బ్రతుకుతున్న మొసలి ఆ నీటిలో తాను మేటినని తన ధాటీ అంతా చూపించి ఏనుగుతో పోటీ చేసింది. ఈవిధంగా ఏనుగునకున్నూ మొసలికిన్ని జరిగిన పోరాటము వేయి హాయనంబులు (వేయి సంవత్సరాలు) సాగింది "కరి మకరికి, మకరి కరికిని" యింత దీర్ఘపోరాటం జరిగింది. ఇదంతా నిజంగా జరిగిందా? అబద్ధంగా జరిగిందా? అని మనం శంకించనక్కరలేదు.

గడచిన మహా సంగ్రామంలో రష్యాదేశంమీదకు దండెత్తిన జర్మనుసేనల గతి అంతే అయింది. బ్రహ్మాండమైన మంచుతో నిండిన రష్యను యుద్ధరంగం, యమరంగం, యమనగరం అయింది జర్మను సేనలకు. ఆబలికి బలి అయినాయి జర్మనుసేనలు. లక్ష్యం జర్మనుసైన్యం ప్రాణాలమీద లక్ష్యం లేకుండా స్టాలినుగ్రాడు వద్ద పోరాడింది. పైన ఆకాశంలో వేయి జర్మను విమానాలు ఎడతెగకుండా అగ్నిగోళాలు కురిపించాయి. రణరంగం రక్తప్రవాహం అయింది. వల్గానది రక్తపు వెల్లువలగా ప్రవహించింది' ఆ రష్యనుయుద్ధరంగంలో ఆరువారాలు తాను దండయాత్ర సాగిస్తే రష్యా తనవశం అయిపోతుందని హిట్లరువంటి యుద్ధ ఘటికుడు చిటికలు వేసినాడేగాని, చివరి కది చీకట్లో చిందులాట అయింది. రష్యను యుద్ధరంగంలో ఓడిపోయినాడు. మాసాలకొలది స్టాలినుగ్రాడు నగరమును ముట్టడించి ఎట్టకేలకు తోక ముడచిపెట్టి "బ్రతికిఉంటే బలుసాకు తినవచ్చు" ననే విషయం మననంచేసి తిరోగమనం సాగించాడు. ఆ స్టాలినుగ్రాడు యుద్ధంలో రష్యనులు చూపిన అవక్ర పరాక్రమ విక్రమమునకు బ్రిటిష్ ప్రధానియైన చర్చిలు ముక్కుమీద వేలు వేసికొని, నోటిలోని పొగచుట్ట నోటిలో ఉండగానే "ఆ!" అని ఆవులించి ఆశ్చర్యపోయినాడు. అమెరికా ప్రెసిడెంటయిన రూజువెల్టు రష్యాకు తాను శిష్యుడ నవుతానన్నంత భక్తి ప్రపత్తులతో నొక చక్కని కత్తిచేయించి స్టాలిను మహాశయునకు బహుమానం యివ్వాలని నిశ్చయించాడు. అటువంటి మహావీరుడు "పుట్టలేదు పుట్టబోడు" (నభూతో నభవ్యతి) అని మెచ్చి, స్టాలినుకు అనగా ఆ ఉక్కుమనిషికి ఒక్క చక్కని ఉక్కుకత్తిని చర్చిలున్నూ రూజువెల్టున్నూ కలిసి పరిషియాదేశంలోని టెహరానుకు వెళ్లి అక్కడ బహుమానం చేశారు. "వహావ్వా!" అన్నది లోకం.

ఇంతకూ చెప్పవచ్చిం దేమిటంటే, రష్యాను గెలువలేక జర్మనుసేనలు ఎందుకు ఓడిపోయినాయి? రష్యాయొక్క సైనిక బలం బ్రహ్మాండమైనది గనుక ఓడిపోయింది. అని ఒక్కముక్కలో అనవచ్చు. కాని, రష్యాయొక్క సైనిక బలం అంత అచంచలంగా ఉండుటకు కారణ మేమి? అని తిరిగీ ప్రశ్నించవలసి వస్తుంది. స్టాలినుగ్రాడు నగరాన్ని జర్మను సేనలు ముట్టడించినప్పుడు, ప్రతి యింటిలోను ప్రతి గదిలోను ప్రతి రష్యను పురుషుడు ప్రతి రష్యను స్త్రీ ప్రతి రష్యను బాలుడు, ప్రతి రష్యను బాలిక తుపాకీ చేతబట్టి యుద్ధంచేసింది. అక్కడ పుట్టిన చలిచీమలు కూడా జర్మను నాజీసైనికులతో యుద్ధం చేశాయంటే అబద్ధం ఉండదు. మాటలు వేయు నేల? రష్యాలోని ప్రతి వ్యక్తి శక్తిస్వరూపంగా తయారైంది. ప్రతి వ్యక్తికీ ఆ శక్తి ఎట్లా వచ్చిందంటే, దేశభక్తివల్ల వచ్చిందని కచ్చితంగా చెప్పవలసిందే. "ఇది నా దేశం — నా దేశం నా దేహం ఒకటే" అనే అభిమానం, ఆత్మదేశాభిమానం ఎక్కడైతే హృదయాంతరాళంలో గూఢంగా, గాఢంగా, రూఢంగా ఉంటుందో అటువంటి దేశాన్ని అటువంటి ప్రజలనూ, ఎటువంటి ప్రబలుడైనా జయించలేడు. జయించినా, భరించలేడు. భరించినా, జీర్ణించి హరించుకోలేడు. కాబట్టి ప్రజాశక్తి అనేది ప్రచండమైన శక్తిగా వ్యక్తీకరించగలిగిన మహాశయుడు స్టాలిను అనే విషయమును అంగీకరించినటువంటి అమెరికా ప్రెసిడెంటగు రూజువెల్టున్నూ, బ్రిటిష్ ప్రధానియైన చర్చిలున్నూ స్టాలిను ప్రభుత్వ తత్వ పటుత్వమును ప్రశంసించినారనే విషయం లోకం ప్రశంసించింది. కమ్యూనిష్టు ప్రభుత్వ పీఠమైన రష్యాలోని సామ్యవాదమునకు సామ్యమైన వాదంయింకొకటి లేదనిగానం చేసిన రూజువెల్టు చర్చిలుప్రభృతుల గానం ఒకవిధమైన సామ్యవాద సామగానం అని చెప్పవచ్చు.

ఆ విషయం అట్లా ఉంచండి. చైనాలో చంకైషేకు ప్రభుత్వము తన సేనలను కమ్యూనిస్టు చైనా సేనలపై నడిపించలేకపోయింది. చంకైషేకుగారికి అమెరికా ప్రభుత్వము కోట్లకొలది ద్రవ్యం సహాయం చేసింది. ఆ యుద్ధానికి ఆయుధాలు యిచ్చింది. ద్రవ్యం ఇచ్చిందేకాని ధైర్యం శౌర్యం యివ్వలేదు. విత్తమిచ్చి, కత్తు లిచ్చినదే గాని, చంకైషేకు సేనలకు దేశభక్తి నిచ్చినవారు లేరు. అమెరికా యిచ్చిన ద్రవ్యం చంకైషేకు ప్రభుత్వాధికారులు స్వాహాచేసి హాయిగా అనుభవించారు. యజ్ఞ హోమంకోసం లోకు లిచ్చిన నేతి డబ్బాలు సోమయాజులుగారే స్వాహాచేసి మేడ కట్టుకొని, స్వర్గానికి వెళ్ళకుండానే రంభాపరిరంభ సౌఖ్య మనుభవించినారన్నట్లయింది. ఒకవైపున చైనా కమ్యూ

విస్టు సేనలధాటికి తాళలేక చంకైషేకుగారి సేనలు పారిపోతూ ఉంటే, చంకైషేకు ప్రభుత్వ ప్రధానాద్యోగాధికారులు మంత్రులు వగైరాలు షాంగై నగరం హోటల్సులో జల్సాలు చేసి విలాసంగా విలాస వతులతో ఖులాసా కాలక్షేపం చేశారు. ఎక్కడ ఉంది దేశభక్తి? చంకైషేకుగారి సైనా సేనలలోనా? కమ్యూనిస్టుపక్షు సైనా సేనలలోనా?

దేశభక్తి అనేది ప్రభు భక్తిలోనుంచి ప్రభవిస్తుంది. ప్రజలకు ప్రభుత్వంలో భక్తి ఏర్పడవలెనంటే, ప్రభువులకు ప్రజలలో అనురక్తి ఏర్పడాలి. ఇద్దరికీ మధ్యఉండే భక్తి అనురక్తి అనేది నిర్మలమైన ఉదకమువలె దేశమంతటా నిండి ఉండాలి. అప్పుడు దేశమంతా భక్తిప్రపూరితా కాసారంగా ఉంటుంది. ప్రజాహృదయములన్నియు పద్మములవలె ఆ కాసారంలో వికసిస్తాయి. అటువంటి ప్రభువుయొక్క తేజస్సువల్లగాని, అటువంటి ప్రభుత్వముయొక్క తేజస్సువల్లగాని, ప్రజా హృదయములు ప్రకాశిస్తాయి. శివాజీవంటి చక్రవర్తికి అతని సేనలు రాములవారి వానర సేనలవలె చెక్కు చెదరని ధైర్యంతో "శివాజీ మహారాజ్ కీ జై" అని తల తాకట్టుగ సేవచేశాయి. ఆ శివాజీ మహారాజుకు ఎందుచేత ఆ సేనలు "దాసోహం!" అని ఆహవంలో తమ ప్రభావం చూపించాయి అంటే, "స్త్రీలను గోవులను", రక్షించడానికి, "జై భవానీ!" అని శివాజీ తన కత్తి పైకెత్తినాడు. ధర్మరక్షణార్థం - కర్మభూమి రక్షణార్థం - అటువంటి ఆవేశ తరంగములతో నిండిన కాసారం అయింది ఆనాటి మహారాష్ట్రదేశం. అటువంటి కాసారంలో కమలములు వికసించాయి. అచట బుట్టిన చిగురు కొమ్మయిన చేవ అని అభినందించింది అఖిల భారతదేశం.

ప్రభుత్వ పీఠం అనేదానికి ప్రజాహృదయ వశీకరణశక్తి ఉండాలి. కమలాప్తుడు అనే బిరుదు సూర్యునకు స్థిరంగా ఏర్పడింది. ధర్మచక్రంలాగున గతితప్పక సూర్యుడు సదా ప్రకాశిస్తూఉండాలి. అదే ప్రభుత్వ ధర్మసూత్రం. ఆ సూర్యుడు ప్రకాశించని చోట, కాసారం మంచుగడ్డ కట్టినట్లవుతుంది. అటువంటి కాసారంలో కమలములు తేలవు. కమండలములు ముడుగవు. కమలాప్తుడే ప్రకాశించని చోట కమలములు అభూత కల్పితములు. దేశభక్తిలో ప్రభుభక్తిలో ప్రజలు మునిగి తేలుచున్నంత కాలమూ ప్రజలకు తమదేశంలో ఉన్న స్థానబలం అణుశక్తి బాంబులు వేసినా, అణుమాత్రమైనా చలించదు. ఈ రహస్యం స్టాలిన్‌గ్రాడ్ న్యాయంగా స్టాలిన్ నగరం సర్వలోక విదితం చేసింది.

ఆటంబాంబులు తయారు చేయడం ఎందుకు? గడచిన మహాసంగ్రామంలో ప్రపంచం మొత్తంమీద సాధారణ పౌరజనులు 2 కోట్ల 50 లక్షలు మరణించారు. సైనికులైనవారు అనగా పటాలములలోని జనము 2 కోట్ల 70 లక్షలు మరణించారు. అంటే ఏమిటి? రమారమిగా $2\frac{1}{2}$ కోట్ల సైనికులు మరణిస్తే $2\frac{1}{2}$ కోట్లు సాధారణ జనులు మరణించారు. డాక్టరు ఆరంజ్ అనే జర్మను దేశపండితుడు (బాన్ నగరనివాసి) గుణించి రెండు మొత్తాలూ రెండు మాత్రలుగా లెక్క కట్టి కరతలామలకంగా చూపించాడు. గడచిన సంగ్రామంలో పౌరజనం ఎంత భస్మమైందో పటాల బలం కూడా అంత భస్మమైంది. కాని, యింకో సారి మహాసంగ్రామం వస్తే గిస్తే, అందులో ఆటంబాంబులు వేస్తే గిస్తే, పట్టణాలలోనూ పల్లెలలోనూ ఉండే ప్రజాసామాన్యం హద్దుపద్దు లేకుండా భస్మమై, ఆయుధాలు చేతబట్టిన యోధులలో అణుప్రమాణమైనా అణుశక్తికి ఆహుతి కారని తోస్తుంది. సైనికులకంటె సామాన్య పౌరులే శతాధికంగా హతమవుతారు.

అందువల్ల ఇంటిపట్టున కూర్చుండేవాడు ఖులాసాగా ఉంటాడనేది భ్రమ దుర్భ్రమ. సైన్యంలో చేరినవాడే ఏ భయం లేకుండా బ్రతుకుతాడు. స్వదేశ రక్షణకోసం సైన్యంలో చేరినవానికే స్వదేహరక్షణ అనుటకు సందేహం లేదు. ఇంటికంటె కోట పదిలం.

కాని అసలు సందేహం (అయిక్యరాజ్య సమితికికూడా కలుగవలసిన సందేహం) విడిపోతేనేగాని, యుద్ధదాహం పోదు. యుద్ధం చేసి జయించేది ఎవరిని? ప్రజలను జయించవలెనా? ప్రభుత్వాన్ని జయించవలెనా? ప్రజలూ ప్రభుత్వమూ ఒక్కటే అయినప్పుడు ఉభయులకూ మధ్యఉన్న అయికమత్యధర్మమును జయించాలి.

సీతకూ రామునకూ వియోగం కలుగచేసి, సీతకు తనచేతనైన బాధలుకలుగ చేసి, వశపరచుకోవచ్చునని రావణుడు అభిప్రాయపడ్డాడు. దురభిప్రాయపడ్డాడు. తాను ఎంతచెప్పినా, రామునిమీద రక్తి సీతకు చింతాకు అంతయినా చెదరలేదు. కాని సీతను తన కోసానికి ఆహుతి చేయలేదు. సీతకు రామునియందు అనురక్తి ఉంటేనే సీత సర్వలోక పునీత అయింది. రాముడు బుద్ధిపూర్వకంగా నే సీతను వనవాసానికి పంపించాడు పరీక్షించాడు. ఆమె వాల్మీకాశ్రమంలో ఉంది- కుశలవులు అనే కుమారులు ఆమెకు అక్కడే జన్మించారు. ఆ వనవాసంలోకూడా రామునియందు సీతకు గల అనురక్తిలో ఆవగింజంతయినా మారింది లేదు. అదే రామరాజ్యం. ప్రజలకూ ప్రభుత్వానికీ అనురాగబంధం ఉంటే, ఆటం బాంబుగాని దానికంటె ఘాటైన గాని బాబుబాంబుగాని ఈ అనురాగబంధాన్ని భేదించలేదు. "జై సీతారాం!" అని అటువంటి ప్రభుత్వం అటువంటి ప్రజగల దేశానికొక నమస్కారం చేసి, రాం! రాం! అని యుద్ధం విరమించక తప్పదు.

అయిక్యరాజ్య సమితికి అంతకూ అటువంటి సద్బుద్ధికలుగవలెననే సంకల్పంతోనే గాంధిమహాత్ముడు "సబ్‌కో సన్మతి దే భగవాన్" అని భజనచేశాడు. రఘుపతి రాఘవ రాజారాం! పతిత పావన సీతారాం" అన్నాడు.

అటువంటి సూర్యవంశపు రాజు సద్ధర్మమూర్తియై ప్రవర్తించినప్పుడు ప్రజలు తమ తమ కొలువులు తప్పరు. ప్రభువులు తమ తమ నెనరులు తప్పరు. మిత్రరాజ్యసమితి శత్రురాజ్య సంతతి కాదు. కమలములు కమలవు. లోకులు శోకించరు. "స్వస్తిప్రజాభ్యః పరిపాలయన్తాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః."

ఇదే మన భరతవాక్యంలో ఉన్న రాజనీతి ఇదే మన భారత నీతిరాజం. ప్రభుత్వం అనేది తరించాలంటే యుక్తి మననం చేయడంకంటే మిత్రలాభమంత్రం జపించడం శ్రేయస్కరం అట్టి వసుతిహితపథకం సుమతీశతకం. ★

"మీరు యింత పెద్ద పండితులై వుండి యీ భాషానిఘంటువులో బూతుపదాలు చేర్చటం ఏమీ బాగాలేదండి."

"తమరు యింతమంది బిడ్డల తండ్రి ఐవుండి నిఘంటువులో బూతుమాటలకోసం వెదకటం అంతకంటే బాగులేదండి."

* * *

"ఆ సినిమా సుఖాంతమేనా?"

"ఆహా! సుఖాంతమే. — సినిమా అంతమైనందుకు అందరూ సుఖపడ్డారు. కాబట్టి సుఖాంతమే మరి!"


"స్త్రీ అబల అనేమాట అపవాదు. అది పురుషుడు స్త్రీపట్ల చేసిన అపచారం. పాశవికమైనదే బలం అని భావిస్తే, స్త్రీలకంటే పురుషులే బలవంతులని ఒప్పుకోక తప్పదు. కాని, మానవుడికి నైతికమైన బలమే నిజమైన బలమని భావిస్తేమాత్రం పురుషునికంటే స్త్రీయే బలవంతురాలని ఒప్పుకోవలసి వస్తుంది. ఆత్మవికాసం, స్వార్థత్యాగం, ఓర్పు, ధైర్యం — వీటివిషయంలో స్త్రీకి పురుషునికంటే ఆధిక్యత లేదా? నిజానికి ఆమె లేనిది పురుషునికి అస్తిత్వమెక్కడిది?......"

—దండి సత్యాగ్రహం రోజుల్లో గాంధీజీ.

ఏయుగంలోనైనా, జాతి నాగరికతను సంరక్షించిన వారు స్త్రీలే. విశ్వాసంతోనే గాంధీజీ భారతజాతి స్వాతంత్ర్య సమరంలో స్త్రీలను ప్రబోధించి, వారిచేత అనన్యమైన త్యాగాలు చేయించారు. ఆనాడు ఎందరో భారతవనితలు, నాటి సాంఘిక నిర్బంధాలు సహితం విస్మరించి, దేశ దాస్యవిముక్తికోసం నిర్విరామంగా కృషి చేశారు. ఆరోజులలో వారు కొనసాగించిన కృషికి, ఆంధ్రపత్రిక - సచిత్ర వారపత్రిక 'వనితాలోకము' అనే ప్రత్యేక శీర్షికద్వారా ఇతోధిక ప్రోత్సాహం యిచ్చియున్న విషయం యీనాటికీ మా పాఠక లోకానికి స్మరణలో వుండి వుండవచ్చు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యము సిద్ధించడం భారత జాతి పునరుద్ధరణ కార్యక్రమంలో మొదటి మెట్టుమాత్రమే. ఇంకా సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యాలు సాధించవలసి వున్నాయి. దేశంలో ప్రతిఒక్కరివిషయంలోనూ ఆర్థిక దైన్యం, సాంఘిక హైన్యం పూర్తిగా తొలగినప్పుడుకాని పునరుజ్జీవన కార్యక్రమం నెరవేరినట్లుకాదు. దేశంలోని ప్రతిపౌరునికీ కనీసపు సౌకర్యాలు, అవకాశాలైనా సమకూరేవరకు, స్త్రీ స్వాతంత్ర్యము నేపదానికి పూర్తి అయిన అర్థం అవగాహనలోకి రాదు.

ఆ లక్ష్యంతో యీనాడు కొనసాగే అన్ని కార్యక్రమాలలోనూ స్త్రీలు ఇతోధికమైన ఉత్సాహంతో పాల్గొనాలి. తమలక్ష్యాలను, వాటి సాఫల్యానికై తాము నెరవేర్చవలసిన బాధ్యతలను నిర్ణయించుకోవటం చాలా అవసరం. నానాటికీ అక్షరాస్యత పెరుగుతున్న యీ రోజుల్లో యిటువంటి కార్యక్రమం కొనసాగించటానికి పత్రికలు సరియైన సాధనాలు.

ఆ కారణంచేత ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో "వనితాలోకము' శీర్షిక తిరిగి ప్రారంభిస్తున్నాము. మా పత్రిక అభిమానులైన పాఠకులు ఇదే దృక్పథంతో స్త్రీలకోసం ప్రత్యేకశీర్షికను ప్రారంభించవలసిందిగా చిరకాలంనుండి మమ్మలను కోరుతున్నారు. పాఠకుల ప్రోత్సాహంకూడా మా ఈ నిర్ణయానికి ప్రోద్బలమైనది.



[1935 నాటి ఆంధ్రపత్రిక - సచిత్రవారపత్రికలోని శీర్షిక]

సాంఘిక చైతన్యం ప్రబలంగా వ్యాపిస్తున్న యీ రోజుల్లో, విద్యావతులు, వివేచనా పరులు అయిన వనితలు జాతీయ జీవన వికాసానికి తాము ఇయ్యవలసిన దోహదం ఏమిటో, యీ శీర్షికద్వారా నిర్ణయించుకోగలరని ఆశిస్తున్నాం.—సంపాదకుడు.

(కొత్త సీరియల్)

"స్వయంసిద్ధ"

బెంగాలీ: మణిలాల్ వంద్యోపాధ్యాయ.
అనువాదం: మద్దిపట్ల సూరి.

జాతీయోద్యమం తొలిరోజులలో స్త్రీలలో కలిగిన చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే బెంగాలీ నవల. విద్యావిజ్ఞానాలనార్జించి సంఘానికీ తన గృహానికీ వెలుగుదీపమై జీవితంలో కొత్త వెలుగులు చూపిన యువతిగాథ. వనితాలోకంలో సాంఘికచైతన్యం వ్యాపిస్తున్న ఈ రోజులలో ప్రతి యువతీ యువకుడూ చదువదగిన ఈ నవల తెలుగు అనువాదాన్ని త్వరలో ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు సీరియల్ గా అందజేయగలమని తెలపడానికి ఆనందిస్తున్నాము.

వనితాలోకం

పూర్వకాలంలో స్త్రీలు విజ్ఞానవికాసాలని పెంపొందించుకున్న మార్గాలే వేరు స్త్రీలబాధ్యత లేమిటో, అవి ఎట్లా నిర్వర్తించాలో, ఎవరిమాట ఏవిధంగా శిరసావహించాలో, ఎవరి సమక్షంలో ఎలా వినయవిధేయతలు ప్రదర్శించాలో, పిల్లల ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవాలో, ఇత్యాది విషయాలు ఆడపిల్లలు చిన్నతనంలో నే తెలుసుకుని పెళ్లయాక ఆచరణలో పెట్టేవారు. తాము పెద్దయాక ఈ విషయాలనే తమ కూతుళ్ళకీ, మనుమరాళ్లకి తెలియజెప్పేవారు.

ఆరోజులు పోయాయి ఈ కాలపు స్త్రీలు ఎలాటి సమస్యలను ఎదుర్కోవలసి వచ్చేదీ, ఈనాటి తల్లులూ అమ్మమ్మలూ చాలమంది ఊహించను కూడా లేరు. ఆ తరానికీ ఈ తరానికీ జీవితం గురించిన రాసంతగా మారిపోతోంది సాంఘికంగా ఎన్నో మార్పులు జరుగుతున్నాయి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టబడుతున్నాయి ఈ సంస్కరణల వెంట కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయ ఉదాహరణకి బాల్యవివాహాలు వెనకబడినందువల్ల, కొద్దో గొప్పో ఆడపిల్లలందరికీ విద్య లభిస్తున్నందువల్ల, వరుని ఎంచే విషయంలో తల్లిదండ్రులు ఆడపిల్లల మనసు గూడా కొంత తెలుసుకోవడం అవసరమని క్రమంగా గ్రహిస్తున్నారు. తమ భవిష్యత్తును చాలవరకు తామే తీర్చి దిద్దుకోవలసిన భారం ఈ యువతులు వహించవలసి వస్తోంది.

ఇలాంటిదే విడాకుల చట్టంవల్ల ఏర్పడగల సమస్య. భర్తతో కొంత కాలం కాపురం చేసి, బిడ్డలతల్లి అయాక చట్టరీత్యా ఆధర్మనుండి విడాకులు పుచ్చుకోవలసివస్తే, అప్పుడు తననూ, తన పిల్లలనూ సంరక్షించుకోవలసివస్తుంది. విద్య, ఉద్యోగం వీనితో వైవాహిక జీవితాన్ని సమన్వయించుకోవడం కూడా ఒక ముఖ్య సమస్యగా పరిణమిస్తోంది ఇలాంటి సమస్యలు ఏర్పడతాయనే భయంతో సంస్కరణలనుండి పారిపోవటానికి ప్రయత్నించటం మాత్రం మంచిది కాదు.

ఈనాడు సంఘంలో కలుగుతున్న మార్పులను ఎదుర్కోటానికి స్త్రీలు కొంత వెనుకంజ వేస్తున్నారని చెప్పాలి. చాల కాలంగా స్త్రీలకు సమాజంలో న్యాయమైన స్థానమూ, హక్కులూ లేని కారణం చేత వారు ఒక్కసారిగా పెద్ద మార్పులను ఎదుర్కోవలసి వస్తోంది. దేశకాల పరిస్థితులను చక్కగా అవగాహన చేసుకుని, వాటితో మారటానికి ప్రయత్నిస్తూ, జీవితాన్ని ఆనందమయం చేసుకోగలిగే మన

సిక చైతన్యం స్త్రీలకు లోపిస్తోంది. పాత ఆచారాలమీదా, అలవాట్లమీదా మమకారం పోగొట్టుకోలేక, కొత్త పద్ధతులను అర్థం చేసుకుని వాటిని అవలంబించలేక, ప్రస్తుతావసరాలకు అనుగుణంగా కొత్తపాతలను సమన్వయించుకోలేక నలిగిపోతున్న స్త్రీలను ఎన్నయినా సమస్యలు వేధించటం సహజమే.

ఈ తరుణంలో స్త్రీలకు కావలసింది విజ్ఞాన వికాసాలు ఇవి స్కూళ్ళలో పూర్తిగా లభించే అవకాశం అంతగా కనిపించటం లేదు. ఈ కాలపు పురుషులైనా తమ జ్ఞానాన్ని పూర్తిగా స్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ సంపాదించటం లేదు. విజ్ఞానాభివృద్ధికి పత్రికలు ఎంతయినా తోడ్పడే అవకాశం వుంది తరచూ పత్రికలు చదివేవారు ప్రపంచజ్ఞానం ఎక్కువగా సంపాదిస్తారనటంలో సందేహం లేదు. వెనుకటివాళ్లలాగా మనం మన జీవితాలని లక్ష్యపెట్టి గుణించి ఇదే ప్రపంచం అనుకొనే రోజులు పోయాయి

ఈనాడు మన జీవితానికి ఉపకరించగల విజ్ఞానం అతివేగంగా అభివృద్ధి పొందుతోంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఏయే పద్ధతులను అవలంబించాలో, పిల్లల పెంపకంలో ఎటువంటి సూత్రాలను పాటించాలో తెలుసుకోవటానికి శాస్త్రవేత్తలు మనకి ఎంతో తోడ్పడుతున్నారు. పిల్లల పెంపకం, వారి

కొమ్మూరి ఉషారాణి

మన స్వత్వం, అవసరాలు ఆరోగ్యం గురించి పూర్వపు రోజులలో మన అమ్మమ్మలు బోధించిన అనేక విషయాలు ఈ ఆధునికయుగంలో మన కంత ఉపయోగకరంగా కనిపించటం లేదు.

మహిళల అభ్యున్నతికి ముఖ్యమైనది చర్చ. ఈ కాలపు యువతులు ఎదుర్కొంటున్న స్త్రీవిద్య, ఆర్థికసమస్యలు మొదలైన అనేకరకాలయిన సమస్యలను చర్చద్వారా అవగాహన చేసుకునే అవకాశం వుంది. ఆధునిక యువతులు ఎదుర్కొంటున్న ఇలాంటి వివిధ సమస్యలనుగురించి, పాఠకులు తమ తమ అభిప్రాయాలను సందేహాలను తెలియజేస్తే వీలయినంతవరకు ప్రచురించి చర్చకు అవకాశం యివ్వగలుగుతుంది. చర్చలద్వారా ఆ సమస్యలకు పరిష్కారమార్గాలు వెతకటం సులభమవుతుంది.

స్త్రీలకు సంబంధించిన కార్యకలాపాలను గురించీ, స్త్రీ సమాజాలూ, సమావేశాలూ, సినిమాలూ, రేడియో నాటకాలు, పుస్తకాలు మొదలైన వాటిమీద పాఠకులు తమ అభిప్రాయాలను పంపవచ్చు. ఇవిగాక ప్రత్యేకం స్త్రీల సమస్యలకు సంబంధించిన కథానికలు, నాటికలు, వ్యాసాలు మొదలైనవానికి ఈ శీర్షికలో స్థానం వుంటుంది.

సామాన్యంగా అనేక కుటుంబాలలో, సంసారాన్ని పొదుపుగా నిర్వహించటంలోనో, లేక కుటుంబానికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలను నేర్పుతో పరిష్కరించటంలోనో, కొందరు స్త్రీలు ప్రత్యేకమైన ప్రతిభ, సమర్థత కనపరుస్తారు. అటువంటి స్త్రీలను గురించి తెలిసినవారు, మిగతా ప్రపంచానికి ఆ విషయాలు తెలియచెయ్యటంవల్ల ఎంతో లాభం వుంది. ఇలాంటి స్త్రీలను స్వయంగా ఎరిగినవారు ఆ విషయాలను సంగ్రహంగా వ్రాసి పంపుతే ఈ శీర్షికలో ప్రచురించబడతాయి.

ఈ శీర్షికవల్ల పూర్తి ప్రయోజనం కలగాలంటే రచయితలు పాఠకుల సహకారం ఎంతయినా అవసరం. ఈ ప్రయత్నం కొనసాగటానికి అందరి ఆదరాభిమానాలు, ప్రోత్సాహం అవసరం.

★

నాగరికత

యన్. ఆర్. నంది

ప్రజాప్రతినిధి
అతని భార్య
అతని కుమారుడు
(కొన్ని కంఠాలు.)

[ఓ ఆగర్భ శ్రీమంతుని అత్యాధునికమైన గదిలో ఒకభాగం. అతను ప్రజాప్రతినిధే కావచ్చు, ఆఫ్రికాలో నైనా కావచ్చు, మరే దేశంలో నైనా కావచ్చు. మహాచక్రవర్తే కావచ్చు; ఏమైనా ఆయన ప్రజాపాలకుడు. ఒకపక్క అందమైన రిఫ్రిజిరేటర్. అందుమీద తళతళ మెరిసే ఫ్రేముల్లో ఓ చిత్రం - బాగా రాతియుగం నాటి ఓ మనిషిచిత్రం కావచ్చు మరోపక్క పెద్ద రేడియోగ్రాం. రంగానికి మధ్యగా ఎత్తయిన ఓ స్ప్రింగు మంచం. మంచానికి యిటూ అటూ బుక్ షెల్ఫులు - ఒక షెల్ఫుమీద టేబుల్ లైట్. ఒక పక్క ప్రేక్షకులకు దగ్గరగా ఓ సోఫా. తెరఎత్తగానే పత్రిక చదువుతూ సోఫాలో ప్రజాప్రతినిధి కనిపిస్తాడు. ముట్టుకుంటే ఒంగులు మార్చే ముఖముల్ చొక్కా, సిల్కు పైజామా; తెల్లగా మల్లెపువ్వులా వుంటాడు బట్టతల.

క్షణం సేపయాక తెరలో, ఎంతో దూరంగా వినిపిస్తున్నట్టు కోలాహలం వినిపిస్తుంది. అది రానురాను హెచ్చయి నినాదాలుగా వినిపిస్తుంది.]

ఓ కంఠం: (తెరలో) మానవత్వాన్ని—

కొన్ని కంఠాలు: గుర్తించాలి.

ఓ. కం: మానవులంతా.

కొ. కం: ఒకే జాతి

ఓ. కం: జాతి భేదం—

కొ. కం: నశించిపోవాలి.

కొన్ని అధికార కంఠాలు: ఆగండి, అక్కడే ఆగండి.

కంఠాలు: మా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సిద్ధించేవరకు ఆగం.

అధికార కంఠాలు: ఆగాలి.

ఓ. కం: ఆగం...సోదరులారా! మానవత్వం మాధవం కాదు. స్వేచ్ఛ మన జన్మహక్కు. మనచే ఎన్నుకోబడ్డ ఏ ప్రతినిధైనా ఈ సత్యాన్ని విస్మరించగూడదు.

కం: అవును విస్మరించగూడదు.

ఓ. కం: బోలో స్వతంత్ర, మానవ వుద్యమానికీ—

కం: జై—

అ. కం: ఫైర్...ఒన్...టూ...

[ఇంతవరకూ ఈ నినాదాలని, అధికార స్వరాలని వింటున్న ప్రజాప్రతినిధి చప్పున పత్రిక కింద విసిరేసి బయటకు వెళ్ళిపోతాడు. స్టేజి ఖాళీగానే వుంటుంది. తెర వెనుకనించి ఈ క్రింది సంభాషణ వినిపిస్తుంది.]

ప్ర: ఆగండి...ఏమిటిదంతా?

అ. కం: విప్లవం యువర్ ఎక్సలెన్సీ.

ఒక కం: కాదు. న్యాయాన్ని అర్థించే ప్రజలం. మాకు స్వేచ్ఛకావాలి. కేవలం రంగునిబట్టి, మతాన్నిబట్టి జాతినిబట్టి ఒక వర్గాన్ని శాసనం చెయ్యడం ప్రజాప్రతినిధివైన నీకు తగదు.

కం: అవును తగదు—

ఓ. కం: కొంతమందరం నిన్ను యెన్నుకున్నాం. ఎందుకు? మా సుఖ సౌఖ్యాలని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కాపాడతావనేనా? అధికారం చేజిక్కిన తర్వాత మమ్మల్నిలా అణచివేయడం నీకు తగదు; మేం సహించం.

ప్ర. ప్ర: నోర్ముయ్.

ఓ. కం: నా కంఠాన్ని నొక్కినా, యిన్ని లక్షల కంఠాలని ఒక్కనాటికీ నొక్కలేవు. తెగిన కంఠంనించి గూడా 'స్వేచ్ఛ మానవహక్కు' అనే మాట, నినాదం వినిపిస్తానే వుంటుంది.

అ. కం: వీళ్ళు యిలా వినిపించుకోరు యువర్ ఎక్సలెన్సీ. మీరొక్క అంగీకారంతో ఒక్క క్షణంలో వీళ్ళందర్నీ—

ప్ర. ప్ర: ఫైర్ చేస్తారనుకుంటా?

అ. కం: అవును యువర్ ఎక్సలెన్సీ.

ప్ర. ప్ర: వద్దు—లాఠీ ఛార్జీతో డిస్పర్స్ చేసెయ్ - లాభం లేకపోతే, అప్పుడు—

అ. కం: చిత్తం యువర్ ఎక్సలెన్సీ (గట్టిగా) లాఠీచార్జి చెయ్యండి.

[ప్రజాప్రతినిధి స్టేజిమీదికి రుమాలుతో ముఖం అద్దుకొంటూ వచ్చి, ఉఫ్ అనుకొంటూ సోఫాలో కూలబడతాడు. వెంటనే తెరవెనకనించి లాఠీఛార్జీ, కల్లోలం, ఆర్తనాదాలు, ఏడుపులు - ఒక కంఠం వినబడుతుండా నినాదం చేస్తుంటుంది. మరికొందరు సమాధానంగా జై అంటూవుంటారు. లాఠీఛార్జి చాలక ఫైర్ ఓపెన్ చేస్తారు. కంఠం అరుస్తూనే నేలకి ఒరిగిపోతుంది. మిగతా శబ్దాలు, ఆర్తనాదాలు, ఫైరింగ్ క్రమంగా తగ్గిపోతాయి.]

ప్రజాప్రతినిధి భార్య ప్రవేశం. [అతి సామాన్యంగావున్నా, నడకలో, మాటలో శివి, దయ ఉట్టిపడుతూవుంటాయి.]

భా: ఏమిటండీ ఈ గొడవంతా?

ప్ర.ప్ర: మూర్ఖులు - అగ్గిలో దూకితే ఏమవుతుందో తెలిసుండిగూడా—

భా: అయినా మీరు చేసిన ఈ పని అంత మార్జించతగ్గదికాదు; రేపు పత్రికలన్నీ ఈ వార్తని పెద్దగా ప్రకటిస్తే మిమ్మల్ని లోకం ఏమని నిందిస్తుందో ఆలోచించారా?

ప్ర. ప్ర: అయితే మన కాళ్ళకింద పడుండవలసిన మూర్ఖులు, యిలాంటి విపరీతపుకోర్కెలు కోరుతుంటే తీర్చమనా నీ ఉద్దేశం?

భా: మానవుల్లో మూర్ఖులనే ప్రత్యేక జాతి లేదు. అయినా వాళ్ళని మీరింతగా ఎందుకు ద్వేషించడం?

ప్ర. ప్ర: వానిసలు ఎదిరిస్తే అణచివేయడం ద్వేషించడమా?

భా: ఇది మీ మన ప్రభుత్వానికి కలిగిన అహంకారభావం అంతే......ఇక నేను మీకేం నచ్చచెప్పను, చెప్పదలుచుకోలేదు. కాని ఒక మాట గుర్తుంచుకోండి: ఎవరూ, ఏవిధంగానూ కొందర్ని శాశ్వతంగా అణచిపెట్టి వుంచలేరు. ఒకనాడు ఆ మూర్ఖులే వాళ్ళే అగ్నిపర్వతంలా లేచేసరికి మీరొక్కరేకి మన ప్రభుత్వానికి సంబంధించిన ద్వేషం జాతుల నిర్మూలనకే తోడుపడుతుంది.

కొడుకు: (పరుగెత్తుకొంటూ వచ్చి) నాన్నగారూ, నాన్నగారూ...

ప్ర. ప్ర: ఏమిటేమిటి?

కొ: నేనిప్పుడు యిక్కడున్నట్టు అమర్‌లాండ్ వెళ్ళాలి.

ప్ర. ప్ర: ఎందుకు?

కొ: సాయంకాలం పెద్ద [illegible] మాచ్ వుంది.

ప్ర. ప్ర: తెంతుకుంటూలో [illegible]

★ నాగరికత ★

మైళ్లు ఎలా వెళ్ళగలవు- టెలివిజన్ సెట్‌లో చూడకూడదూ?

కొ: ప్రత్యక్షంగా చూసేదానికీ, టెలివిజన్‌లో చూసేదానికీ భేదంలేదండీ? అయినా కొత్తగా కనిపెట్టిన ఆటమిక్ కామెట్‌లో ఎక్కికూచుంటె ఈ రెండువేలమైళ్ళూ ఓ లెఖ్ఖ అంటారా?

ప్ర. ప్ర: సరే వెళ్లు కాని రాత్రి బాగా చీకటి పడేవరకు వుండకు. తిరిగి త్వరగా రావాలి.

కొ: సరె నాన్నగారు (నిష్క్రమణ)

భా: మీ కొడుకంటే మీ కంత ప్రేమెందుకు?

ప్ర. ప్ర: బాగుంది నీ ప్రశ్న! వాడంటె నీకుమాత్రం ప్రేమ లేదు?

భా: నామాట అలా వుంచండి. మన పిల్లలమీద మనకి ప్రేమవున్నట్టే కాకికి మాత్రం కాకిపిల్లమీద ముద్దూముచ్చటా వుండదు?

ప్ర. ప్ర: ఉండదని నే ననలేదే!

భా: రంగుని, జాతిని, మతాన్ని ఆధారంగా తీసుకొని కొందర్ని మీరు హింసిస్తున్నట్టు మన పిల్లల్ని గూడా మరొకరు హింసిస్తే మన మనస్సు లెంత బాధపడతాయో ఆలోచించారా?

ప్ర. ప్ర: (మాటలు దొరక్క తడబడి) అయితే నువ్వ నేదేమిటి?

భా: నాగరికత అనేది ఒక జాతిగాని, మతంగాని, వర్గంగాని, దేశంగాని వృద్ధి చేసిన ఫలంకాదు. మానవజాతి పరిణామ ఫలితం ఆ టెలివిజన్, ఆ అణుశక్తి అదే నాగరికత అనుకొంటె అది మీరుగాని, నేనుగాని ఒంటరిగా సాధించిన ఫలితం కాదు. కొన్నికోట్ల మానవుల సమిష్టిసాధన ఫలితమే అది.

ప్ర. ప్ర: కావచ్చు; దీనికీ దానికీ సంబంధం లేదు.

భా: ఎందుకు? వీళ్ళంతా అనాగరికుల నేగా వీళ్ళకి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకండా చేశారు!

ప్ర. ప్ర: వాళ్ళకి వాటిని యిచ్చినా వాటి అర్థం వాళ్ళకు తెలీదు.

భా: అనుకుంటున్నారు! అలా వేయి గొంతుకలతో సమిష్టిగా నినాదాలు చెయ్యడం, గుండుదెబ్బకు గుండె నివ్వడం వాళ్ళకి పరాధీనాయం అర్థం కాకనే అంటారా?

ప్ర. ప్ర: నువ్వు చాలా వింతగా మాటాడుతున్నావ్! అసలు నీ కిలాంటి భావం కలగడం మన ప్రతిపత్తికి అప్రతిష్ఠ.

భా: ప్రతిష్ఠలేని ఈ ప్రతిపత్తికంటె, అప్రతిష్ఠే మేలులెండి.

[తెరలో దూరంగా కాల్పుల్లో చావగా మిగిలినవాళ్లు నినాదాలు చేస్తారు. మళ్ళీ కాల్పులు. ఆర్తనాదాలు]

భా: ఏమిటండీ ఈ అన్యాయం? మీరు మనుషులేనా? అంతర్వాణి మీలో చచ్చిపోయిందా?

ప్ర ప్ర: (పకపక నవ్వుతాడు) స్వేచ్ఛకి అర్థం తెలీని మూర్ఖులకి తుపాకీగుండ్లతో నే అర్థం తెలియచేయాలి. కాల్చండి. ఇంకా కాల్చండి. ఈ దేశంలో మూర్ఖత్వం నాశనం అయేవరకు కాల్చండి (టామీగన్‌లు, మెషిన్ గన్‌లు దడదడమంటూ వుంటె పకపక నవ్వుతూ ఒక వేపుకి వెళ్లిపోతాడు.)

[ఆర్తనాదాలు వినలేక చెవులు మూసుకొని భార్య రెండో వేపుకి వెళ్ళిపోతుంది.]

[క్రమంగా అన్ని శబ్దాలు క్షీణించి స్టేజి మీద దీపాలు ఒక్కొక్కటే ఆరిపోతై. ఒక్క బెడ్ లైట్ కాంతి మసకగా మంచం మీద పడుతూవుంటుంది. కొన్ని క్షణాలయాక ప్రజాప్రతినిధి నైట్ డ్రెస్‌లో ఆవలించుకుంటూ వచ్చి పరుపుమీద పడుకుంటాడు కొంతసేపయాక తెరలో ఫైరింగ్.. ఆర్తనాదాలు...ఆ వున్న ఒక్క దీపం ఆరిపోతుంది. భయంకరమైన అంధకారాన్ని సూచించే ధ్వనులు...ఒక మూలగా కొన్ని వికృతకంఠాలు ... నక్కల అరుపులు... సన్నగా అపశ్రుతుల సంగీతం వినిపిస్తుంది.

మళ్ళీ ఒక్క వూపున పెద్ద కోలాహలం.. ఈసారి తుపాకీ శబ్దాలు అంతగా వుండవు. క్రమేపీ అసలే వుండవు. ఒక కంఠం: "సోదరమానవులారా! ముందడుగు వేయండి. భయపడకండి. విజయం మనదే..."కోలాహలం...

జయజయ నాదాలు వినిపిస్తాయి... "మానవత్వానికీ — జై; మానవఉద్యమం — జయించింది"—లాంటివి.

ఒ. కం: మానవ సోదరులారా! విజయం చేకూరింది...నరరూప శత్రుసులు పలాయన మయారు. మానవ రాజ్యాన్ని, మానవ ప్రపంచాన్ని స్థాపిద్దాం: మానవత్వానికీ లక్షకంఠాలు: జై......]

[వెంటనే తెల్లని తెర పడిపోతుంది. ఒక ప్రకాశవంతమైన లైటు తెరవెనుక వెలుగుతుంది. ఇక్కడనించి ఈ క్రింది సంభాషణ నేపథ్యంలో వినిపిస్తుంటె, వారివారి నీడలు తదనుగుణంగా నటించాలి.]

ప్ర.ప్ర. నీడ: ఆ! ఏమిటిది! ఈ వానసలు అధికారాన్ని చేజిక్కించుకొన్నారు! నే నెక్కడ వున్నాను! నా భార్యాపిల్లలేరి? నా భవనమేది, నా సహాయకులేరి?.. ఏరి? (భయంతో అరుస్తాడు. కల్లోలంగా సముద్రపుహోరు వినిపిస్తూ వుంటుంది ఇహనించి చివరివరకూ.)

కొడుకు నీడ: (వస్తూ) నాన్నగారూ... నాన్నగారూ...

ప్ర. ప్ర. నీడ: బాబూ, బాబూ ...మీ అమ్మేది?

భార్య నీడ: (వస్తూ) ఇదుగో నేనూ వచ్చాను.

ప్ర. ప్ర. నీడ: నిన్నూ తరిమేశారా దేశంనించి?

భా. నీ: అవును; మీరు వాళ్ళమీద చూపించిన ద్వేషానికి ఫలితం. చివరి కిది జాతులమధ్య కక్షలకు దారితీసి మంచివాళ్లు చెడ్డవాళ్లూ అనే జ్ఞానాన్నే చంపేసింది.

కొ. నీ: నాన్నగారు, నాకు దాహం వేస్తోంనండీ

ప్ర ప్ర. నీ: వెళ్ళి త్రాగు.

కొ నీ: ఇక్కడ యెటు చూసినా సముద్రమే కనిపిస్తోందండి. మంచినీళ్లు లేవు.

భా.నీ: దాహానికి మంచీ చెడ్డా నీళ్ళేమిటి బాబు? అదుగో అక్కడే చిన్న మడుగు కనిపిస్తోంది—

కొ. నీ: దాన్లోవన్నీ బురదనీళ్ళే- ఎలా తాగాలి?

ప్ర నీ: ఫిల్టరు చేసి త్రాగు.

కొ. నీ: నాకు ఫిల్టరింగ్ చేతకాదండి.

భా. నీ: మన పూర్వులు ఆ బురదనీళ్లే త్రాగేవారు.

కొ. నీ: నాన్సెన్స్! అణుయుగంలో గూడా బురదనీళ్లు తాగాలని బోధిస్తున్నారా?

భా. నీ: అణుయుగానికీ, నీకు ఫిల్టరింగ్ చేతకాకపోవడానికీ సంబంధమేమిటి? అణుయుగం సమిష్టి సాధన ఫలితం. ఫిల్టరింగ్ చేతకాకపోవడం నీ అసమర్థత. రెండిటికీ ముడిపెట్టి నీ బలహీనతకు పొరుషపడట మెందుకు?

కొ. నీ: నేను బురదనీళ్లు తాగేంత బుద్ధిహీనుణ్ణి కాను; తాగనుకూడా. [నిష్క్రమణ]

భా. నీ: (నవ్వుతుంది) చూశారా? వెనకటి అధికారంలో మన అబ్బాయిరక్తంలో జీర్ణించుకపోయిన గర్వం, అహంభావం!

ప్ర.ప్ర.నీ: దాహం అని వాడేడుస్తుంటె గర్వం, అహంభావం అంటా వేమిటే?

భా. నీ: కాదూ? దాహం తీర్చడానికి కావలసింది నీళ్లు కాని మంచీ, చెడ్డా నీళ్లేమిటి?

ప్ర. ప్ర. నీ: అందుకని కొడుకుని బురద

నీళ్లు తాగమని వేదాంతం చెబుతావా?

కొ. నీ: (వస్తూ) నాన్నగారూ దాహాని కింక నేను ఓర్చుకోలేను. నాలిక యెండి పోయింది. చచ్చిపోతున్నాను. మీరు వెళ్ళి కొనిని మంచినీళ్లు తీసుకరండి.

ప్ర ప్ర. నీ: ఈ ఎడారి ద్వీపంలో నీళ్లు సంపాయించడానికి నేనూ నీలాంటి మని షినే బాబు.

కొ. నీ: మనిషి! మనిషి!! అదొక్కటి చేతనవును (విసుగ్గా) ఆ బురదనీళ్లే తాగు తాను రోగాలొస్తే తర్వాత మీరే విచా రిస్తారు. ఆ బురదనీళ్లే తాగుతాను. (పోతాడు)

భా నీ: అదేమిటి మీ కళ్ళనించి నీళ్లు కారుతున్నాయి?

ప్ర ప్ర నీ: అబ్బాయి ఎలా యేడుస్తు న్నాడో చూశావా?

భా. నీ: అందుకని మీరూ యేడుస్తు న్నారా?

ప్ర. ప్ర. నీ: పరిహాసం కాదు.

భా: అవును, పరిహాసం కాదు. మనం సమాజంలో సమిష్టిగా బ్రతికేటప్పుడు ఏ చిన్న విషయాన్ని యింత సీరియస్‌గా తీసుకోలేదు కాని అదే చిన్న విషయాన్ని ఒంటరిగా ఎదుర్కొనేసరికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది మీకూ నాకూ నీళ్ళు కావాలి కాని దానిగురించి మనం ఒక్క నాడూ నాగరికతలో యోచించి ఎరగం, కాని అత్యవసరంలో దాని ఉనికిని చూసే భయపడిపోతున్నాం. ఇదే మన పూర్వుల మీద మన ఆధిక్యతలాగుంది!

[ఉరుములు, మెరుపులు, గాలి హోరు, వినిపిస్తుంది]

ఆ గాలివాన వచ్చేటట్టు వుంది. అలా నడవండి

ప్ర. ప్ర. నీ: ఎక్కడికి నడవాం?

భా నీ: అగ్గివరకు ఆ చెట్టుకింద నిల బడదాం.

ప్ర. నీ: ఇది రెండు మూడురోజులవరకు విడవని తుఫానైతే?

కొ. నీ: (పరుగెత్తుకొంటూ వచ్చి) నాన్న గారూ, నాన్నగారూ! సముద్రంలో కెర టాలు పెద్దవైపోతున్నాయండి బరో మీటరు వుంటే తుఫాను వచ్చేదీ లేనిదీ తెలిసి పోను సుమండీ

భా. నీ: (నవ్వి) ఇప్పుడైతే నేం, ఓ కొత్త బరోమీటరు తయారు చెయ్యి

కొ. నీ: మైగాడ్! కొత్త బరోమీటరే! నా ఆప్షనల్ పొలిటికల్ సైన్సుగా-అందుకే నాన్నగారితో - అయినా పాదరసం, ట్యూబ్‌లు ఎక్కడ దొరుకుతాయి?

ప్ర.ప్ర. నీ: బాబు! అయిందేదో అయిం ది; రేపు మనం చిన్న యిలు కట్టుకోవాలి.

కొ నీ. మీకు కట్టడం తెలుసా?

భా నీ మొదటి మనిషి స్వప్ర యత్నంతో ఈనాటి మహాభవనాలు కట్టు కొన్నాడు.

కొ నీ: అయితే మనకి సిమెంటు, ఇటు కలు, కలప, ఇనపసామానులు, సుత్తి, ఉలి వగైరాలు ఎలా దొరుకుతాయి నాన్నగారు?

ప్ర. ప్ర. నీ: అవన్నీ తయారుచేద్దాం.

భా నీ: ఆఁ ఇప్పుడు వెనకనించి జీవిం చడం నేర్చుకొంటున్నారు! నేర్చుకోండి (పకపక నవ్వుతుంది.)

[వర్షపుహోరు క్రమంగా హెచ్చుతూ వుంటే తెరవెనక లైటు క్రమంగా ఫేడౌట్ అవుతుంది. ఒకనిమిషం లైట్లన్నీ ఆరిపోయి వుంటాయి. తర్వాత క్రమంగా తెరవెనుక లైటు వెలుగుతుంది

తెలటి తెరవెనుక అడ్డదిడ్డంగా కట్టిన ఓ గుడిశనీడ. ప్రజాప్రతినిధి ఓ చెట్టురెమ్మ ఆకులుతీస్తూవుంటాడు. కొడుకు కర్రలు తీసుకొని ప్రవేశిస్తాడు]

కొ. నీ: అబ్బ! స్.. ఇక ఈ కర్రలు మోయలేనండి. ఒక కత్తా, గొడ్డలా! ఏమీ లేకుండా చేత్తో విరుచుకరావడమంటే - చూడండి చేతు లెలా బొబ్బలెత్తి పోయాయో?

ప్ర ప్ర నీ: (నిట్టూర్పు విడుస్తూ) స్!... అలా అంటే ఎలా బాబు? మొన్న వచ్చిన గాలివానలో నాలుగు గంటలు తడిశామా-రోగాలొస్తే యిహ ఈ ఎడారి ద్వీపంలో మనకి చావు తప్ప మరో గత్యంతరం లేదు. ఏదో తల దాచుకోడానికి యింత కొంప నేది కట్టుకొంటె ఆ తర్వాత చూచుకున్నా ఫర్వాలేదు...మీ అమ్మేది?

కొ. నీ: ఏదో ధాన్యం పండిస్తానని బయలుదేరింది - మంచి నేల వెతకడానికి.

ప్ర.ప్ర నీ: తనూ బయలుదేరింది-సరి!

కొ. నీ: కడుపు నకనకలాడిపోతోంది నాన్నగారు - మనదేశంలో ఒకనాడైనా అన్నానికి యిలా దేవుళ్ళాడామా?

ప్ర నీ: నిజమే బాబు ఇక్కడ కడుపు నింపుకోడానికి ఒక్కటైనా కనీసం ఫల వృక్షం కనిపించటం లేదు.

భా నీ: (పకపకా నవ్వుతుంటూ వస్తుంది) అదేమిటి? తండ్రీ కొడుకు లిలా కాళ్లు చాపుకొని కూచున్నారు!

[మాటాడరు.]

[గుడిశను చూపిస్తూ] ఈకొంప మీరు స్వయంగా కట్టిందేనా? ఆహా! ఎంత

(55-వ పేజీ చూడండి)

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపు లను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతో సె చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించ బడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.


నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తు న్నాము.

—సంపాదకులు.



22

గుడ్డల కొట్లో భాస్కర్రావుకి పెద్ద గుమాస్తాగారితో స్నేహం నానాటికీ వృద్ధిపొందింది. అందువల్ల భాస్కర్రావుకి ధైర్యమూ పెరిగింది. డబ్బు సాయం చెయ్యలేకపోయినా సానుభూతి ఇవ్వగలిగే మనిషి కావాలని ప్రతివాళ్ళూ కోరుకుంటారు. భాస్కర్రావు స్థితి అప్పుడు దారం తెగిన గాలిపడగలా వుంది. తండ్రి మతిచెడి పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. మేనత్త చిక్కి సగమైంది. కడుపునిండా తినటానికి చాలిన ఆదాయంలేదు. పుట్టింటికి వెళ్ళిన పిన్ని రెండు రోజులు గడిచినా వుత్తరమైనా వ్రాయలేదు. వూళ్లో కలరా తగిలిందని పేపర్లు ప్రకటించాయి. కృష్ణా గుంటూరు జిల్లాల్లో వైద్య సౌకర్యం కొరతగా వున్న పల్లెల్లో అది వ్యాపిస్తున్నట్టు కనిపించింది. పంచాయతీ బోర్డులవారు శాయశక్తులా వ్యాధి నివారణకు ప్రయత్నిస్తున్నట్టు పత్రికల్లో వ్రాశారు. భాస్కర్రావు నవ్వుకున్నాడు. ఇన్ని సౌకర్యాలున్న విజయవాడలాంటి పట్నంలోనే ఏడాదికి ఏభై మందిని బలి తీసుకొనే అంటువ్యాధుల స్వైరవిహారం పల్లెల్లో ఎంత భీకరంగా వుంటుందో అడగాలా! అతని ఆలోచన లంకపల్లి వేపు మళ్ళింది; అక్కడకూడా కలరా వ్యాపించ లేదుగదా! దిన పత్రిక తిరగేశాడు. అతనిఅనుమానం నిజమే ఐంది; లంకపల్లెలో గూడా కలరా వొచ్చిమూలపల్లిలో షుమారు ఇరవైమంది పోయారని వుంది. వ్యాధి ఇంకా ఊళ్ళోకి రాలేదు అని తేలింది.

ఒక రోజున భద్రయ్యగారికి నీరసం మరీ ఎక్కువైంది. భాస్కర్రావు తనకు తెలిసిన వైద్యుడు ఒకాయన్ని తెచ్చి చూపించాడు. వైద్యుడు పెదవి విరిచాడు. "లాభం లేదు నాయనా. వ్యాధి ముదిరిపోయింది. ఎంత బతికినా నాల్గు రోజులపాటే" అని చెప్పి వెళ్ళాడతను. భాస్కర్రావుకి అతని మేనత్తకీ కొళ్ళాడ్డంలేదు. భద్రయ్యగారు ఆ రోజు రోజంతా, విపరీతంగా సంధిలో పడి ఏదో వాగుతూనే వున్నాడు. గుండెకి నీరుపట్టి వొళ్ళంతా వాచింది. కనురెప్పలు బరువై కళ్ళు తెరిచేట్టు పడటంలేదు. ఎవర్నీ గుర్తుపట్టలేక పోతున్నాడు. జీవితయానం ముగించి, ఏ జ్ఞాపకాలూ బాధలూ అంటని నిశ్శబ్దమయమైన సుషుప్తిలోకి జారి పోతున్నాడాయన. ఆగిపోయే యంత్రంగూడా ఆగే క్షణంవరకూ పని చేసి చప్పున ఆగి వూరుకుంటుంది. పిల్లినోట్లో నలుగుతున్న పిట్ట చివరి క్షణంవరకూ కదుల్తూనే వుంటుంది. వాటికీ మనిషికీ తేడా ఒక్కటే; చచ్చేవరకూ మనిషిని జ్ఞాపకాలు వేధిస్తాయి. కళ్ళు తెరిచిచూస్తే కనపడేవి, కళ్లుమూసినా స్వప్నాలల్లినా అంతరాంతరంలో ప్రత్యక్షమౌతాయి. అచేతనంగావున్నా మానసికంగా అటువంటి దృశ్యాలలో పొల్గొంటూ భద్రయ్యగారు కలవరిస్తున్నాడు. హామేషా అతనికి పద్మ సుదర్శనం కనపడుతున్నారు. ఒకరు మానసిక బాధకు కారకులైతే, రెండోవారు ఆర్థిక బాధలకు కారకులైనారు. ఒకొక్కప్పుడు వాళ్ళిద్దరూ ఆయన చుట్టూ చేరి పెద్దగా నవ్వుతూ చప్పట్లు చరుస్తూ గిరగిరా తిరుగుతున్నారు. వాళ్ళ నవ్వులు, పులుల అరుపుల్లాగా, సడన్ బ్రేక్ బడిన లారీ చప్పుళ్ళలాగా, చెడిపోయిన రేడియో కీచుగొంతులాగా వినిపిస్తున్నాయి. ఈ కలలతో ఆయన ప్రాణం కడపట్టిపోతున్నది. మెలుకువ వచ్చినప్పుడు ఆ మసక కళ్ళకు, మందమైన తెరలోగుండా కనిపించినట్టు, చింపిరి తలతో చిరిగిపోయిన చొక్కా తొడుక్కుని, మొహం వస్నె తగ్గి, వుద్రేకంతో పెదాలు కొరుక్కుంటూ నిలబడివున్న కొడుకూ, శోకాలు పెడ్తున్న చెల్లెలూ కనిపిస్తున్నారు. తిరిగీ ఆయన కళ్లు మూతలు పడిపోతున్నాయి.

భాస్కర్రావు విధిగా కొట్లోకి వెళ్తున్నాడు. గంటకోసారి సైకిలుమీద వచ్చి తండ్రిని చూసిపోతున్నాడు. అతనికి తెలుసు — దిగులుపడీ ఏడ్చీ, ఎవర్నీ మృత్యువునుంచి కాపాడలేమని. ఒక దశ దాటాక, వైద్యం పనిచెయ్యదనీ తెలుసు. ప్రేమలు, పాశాలు, బంధాలు అన్నీ తెంచుకుని జీవశక్తి ఈబాధల్నించి తుదివీడ్కోలు తీసుకునేప్పుడు, దాన్ని ఆపటం అసంభవం — డబ్బు, అధికారం, పలుకుబడి, పరివారం, బంధువులూ ఏవరూ అడ్డుపడలేని స్థితి అది; ఏమీ లేనివాళ్ళను మామూలు ఆకలినించీ, చిన్న చిన్న జబ్బుల్నించే కాపాడ్డం అసంభవం; ఇక మృత్యువునుంచి రక్షించటం సాధ్యమా!

భాస్కరం తెచ్చిన సెలజీతం పది రోజుల్లోనే అయిపోయింది. ఇంట్లో సామానులు నాలుగు రోజులకు సరిపడా వున్న మాట నిజమే. కాని నాలుగురోజులు ఎంతసేపట్లో దొర్లిపోతాయిం

పుప్పు పప్పు లేనిదీ అణాదీ కొనుక్కువచ్చి కాలం గడిపారు ఒక రోజు. భద్రయ్యగారికి ఆరాత్రి మగత ముదిరి మాట పడిపోయింది. భాస్కరరావు గడపమీద కూర్చున్నాడు. అంతా అంధకారం ఆ చీకట్లో వీధుల్లోనూ ఇళ్ళలోనూ కొట్లలోనూ మూయూలుగా జలిగే దీపాలు వెలుగుతూనే వున్నాయి. వానతుంపర్లు గాలిహోరు కలిసాయి తడికలమీద చిటపట వాన చినుకులు పడుతున్నాయి. అతనింతర్యాత్మ కూడా అంధకారమయంగా వుంది ఆ చీకట్లో దేనికోసమో వెతుకుతున్నాడు , మానవుడు తన తెలివితేటలతో జీవితాన్ని స్వర్గధామంగా చేసుకోవాల్సింది పోయి, రాళ్లు రప్పలు ముళ్లూ కంప—యివన్నీ తనముందు పోసుకుని వృధాగా బాధపడుతున్నాడు ఈ బాధలన్నీ చేతులారా తెచ్చిపెట్టుకున్నవి కదా!

భద్రయ్యగారు ఆరాత్రి పదకొండు గంటలకి ఇహలోకం విడిచిపెట్టాడు మేనత్త గొల్లుమంది; భాస్కరరావు కూడా గుండె ధైర్యం, తన వేదాంతాన్నీ మర్చిపోయి తండ్రిమీదపడి పసిపిల్లాడిలా గిలగిల్లాడాడు. చిన్నప్పణ్ణించి పెంచి, పెద్దచేసి పరిపూర్ణ ప్రేమాభిమానాలు వర్షించిన తండ్రిని ఒక్కసారిగా, శాశ్వతంగా కోల్పోవటం అంటే ఎంత దారుణం! ఆ రాత్రి రాత్రంతా శోకంతో గడిచింది ఆ యిద్దర్నీ, ఆ కాసేపు మిగతా దిగుళ్ళన్నీ 'పాపం' అని దయదల్చినట్టు. వొదిలిపోయాయి—

తెల్లారగానే, భద్రయ్యగారి దహనసంస్కారాల నిమిత్తం జరగవల్సిన ఏర్పాట్లకోసం, భాస్కరరావు తప్పనిసరిగా బజారు వెళ్ళవల్సివచ్చింది శవం తలాపున ప్రమిదదీపం నిశ్చలంగా వెలుగుతోంది అక్కడి కొద్దిపాటి సామానమీదా, శవంమీద కప్పిన పాత దుప్పటిమీద గుడ్డివెలుగులు పడుతున్నాయి మేనత్త, ఏడ్చి ఏడ్చిఅలిసిపోయి, వెక్కుతూ ఒకమూల కూర్చునివుంది; భాస్కరం ఆమెతో చెప్పి బజారుకు బైల్దేరాడు. ఈ క్లిష్ట సమయాన గుడ్డల కొట్టు షావుకారు, పెద్దగుమాస్తా ఇద్దరూ ఏమైనా సాయం చేస్తారేమోనని అతని ఆశ పాండురంగను ఇంతవరకు ఎప్పుడూ సాయం అడగలేదు రాత్రల్లా కురిసిన వర్షానికే కాబోలు, బజార్లన్నీ జలమయంగా వున్నాయి అప్పుడే మనుషులు లేచి తల వొంచుకుని ఎవరి 'రొటీన్'లోకి వాళ్లు వెళ్ళిపోతున్నారు కొట్లు తీస్తున్నారు. సందులు వీధులు నిర్మానుష్యంగా వున్నాయి వాన తుంపర యింకా పడుతూనేవున్నది దూరాన కృష్ణ హోరు వినిపిస్తోంది ఆకాశం మబ్బుకమ్మి ప్రకృతి మగతగా వుంది భాస్కరరావు ఏదీ గమనించలేని స్థితిలో వున్నాడు అతను పూలబజారు-శివాలయంవీధి చౌకులో కొచ్చేసరికి ఏదోఒక రిక్షా అతనిపక్కనే ఆగింది; "భాస్కరం! ఏమిటి అట్లా పరిగెత్తుతున్నావు!" అంది పద్మ, రిక్షాలోనుంచే ఆమె గొంతు బొంగురుపోయివుంది. ఆ రిక్షా వెనక ఇంకో రిక్షా [illegible] సామాన్లున్నాయి. భాస్కరరావు తలెత్తి చూశాడు; రెండు [illegible]లకిగాని ఆమెను గుర్తుపట్టలేకపోయాడు; అతని కేమీ తోచటంలేదు, వెర్రిగా గుడ్లు అప్పజెప్పి చూస్తున్నాడంతే; అది నలుగురు నడిచే రస్తా. ఎవరో ఇద్దరు వీళ్లి వేపే చూస్తూ మొహంపుల్ల నములుతూ నుంచున్నారు పద్మ రిక్షా దిగి కొంగు తలమీదికి లాక్కుంటూ "ఏమిటి భాస్కరం! ఎందుకట్లా వున్నావు! చెప్పు" అంది దగ్గరకొస్తూ.

భాస్కరం ఏమీ చెప్పలేని అయోమయంలో పడ్డాడు—"ఇంటికి పో పిన్నీ" అనిమాత్రం చెప్పి చకచక ముందుకు వెళ్ళిపోయాడు.

అతనా అయోమయావస్థలోనే తలవంచుకుని నడిచిపోతున్నాడు. గంటలో పనులన్నీ నెరవేర్చాలి. తన షావుకారుగాని ఇవ్వనంటే?...ముందుగా పాండురంగ దగ్గర కెళ్దాం—అనిపించింది. ఈ మధ్యలో—ఆలోచనల ప్రవాహంలో పిన్ని గుర్తుకొచ్చింది అకస్మాత్తుగా. అన్నివిధాలా అన్యాయమైపోయిందామె ఆమెని ఎట్లా వోదార్చగలడు తను! విచిత్రం! తనకు వోదార్పుటానికి ఎవరూ లేరు! తను ఇంకొకర్ని వోదార్చాలి! ఏం లోకం—ఏం మనుషులు—ఏం సమాజం! ఏం నీతులు! తన పిన్నికి నిండా ఇరవైఏళ్ళుంటాయో వుండవో! నూరేళ్ల అనుభవం అప్పుడే ఆమెకి. .

భాస్కరం ఆలోచించలేని శూన్యస్థితికి వచ్చేశాడు. సమస్యలు విమమించి పరిష్కరించలేని క్లిష్టస్థితిలో మెదడు కొడిబారిపోతుంది. అలవాటయిన గొర్రె దారితీసినట్టు అతను కాశేశ్వర్రావు మార్కెట్టుదాటి రైలుబ్రిడ్జి కిందగా గవర్నర్ పేటవేపు సాగిపోయాడు. కాలవనిండా నీళ్ళు పొర్లిపోతూ జలజల ప్రవహిస్తున్నాయి. ఏదో రైలు కృష్ణబ్రిడ్జిమీద పోతూ దడదడ మోగుతోంది వర్షం కన్నీళ్ళల్లే మెల్లగా వొక్కొక్క చినుకే రాలుతోంది. బాగా తెల్లారిపోయింది. ప్రజలు బజార్లలో నిండుతున్నారు. భాస్కరరావు సాధ్యమైనంత వేగంగా నడిచి ముప్పావు గంటకి మొగల్రాజపురంలో పాండురంగ ఇంటికి జేరుకున్నాడు. ఆదుర్దావల్లా, దుఃఖాతిరేకంవల్లా, నిద్రలేమివల్లా అతని మొహం తెల్లగా పాలిపోయింది. అంత చల్లని వాతావరణంలో కూడా నొసట చెమటపట్టింది. వొణుకుతున్న చేత్తో తలుపుతట్టాడతను. మూడో పిలుపుకి పాండు లేచివచ్చాడు కళ్ళు నులుముకుంటూ. భాస్కరరావు స్థితి చూసేసరికి మొగాన చన్నీళ్లు కొట్టినట్టు నిద్ర, బద్ధకం వొదిలిపోయింది.

"ఏమిటి? భాస్కరం?..."

"నాన్న..." మాట తడబడుతోంది భాస్కరానికి

"నాన్న.. ఏమిటి? ..చెప్పు" చేతులు పట్టుకుని అతి ఆదుర్దాగా ప్రశ్నించాడు స్నేహితుడు

"పోయారు .." భాస్కరం ఏడవలేదు కాని—ఏడుపు స్ఫురించే గొంతుతో మెల్లిగా బైటపెట్టాడు

"అరెరె ..ఎప్పుడు? చెప్పరా..."

"రాత్రి ... జరగాల్సినవన్నీ అట్లాగే మిగిలివున్నాయి.. నీకోసం వచ్చేశా. నా కింకెవరున్నారు చెప్పు" భాస్కరరావు కళ్లవెంట నీళ్ళు జొటజొట కారుతున్నాయి

"పద—పద—దిగులుపడకు ఇదిగో వస్తున్నా." అంటూ పాండురంగ లోపలికి వెళ్ళి రెండునిమిషాల్లో బైటికి వచ్చాడు. "పద తొందరగా రిక్షామీద వెళ్దాం ఇంకా ఎంతసేపుంచుతాం శవాన్ని?..." అంటూ అతను నడకా పరుగూ కాకుండా నడక సాగాడు

వాళ్లు రిక్షామీద ఇల్లు చేరేసరికి, పద్మ భర్త శవంమీద పడిపోయివుంది—మాటా పలుకూ లేకుండా. రిక్షావాళ్ళు సామాన్లు గడపదగ్గర దింపేసి ఈ ఘోరదృశ్యం చూడలేక బాడిగైనా తీసుకోకుండా వెళ్ళిపోయారు; మానవత్వం నశించని పదిమంది అమ్మలక్కలు పోగై, పద్మని వోదారుస్తున్నారు ముసలమ్మ ఏడ్చి ఏడ్చి శోకాలు పెట్టి ఎగశ్వాస దిగశ్వాస పరిస్థితిలో, పద్మవెనక కూర్చుని మూలుగుతోంది. శవం తలాపున ప్రమిదమాత్రం నిశ్చలంగా వెలుగుతున్నది.

దారిపొడుగునా పాండురంగ చేసిన వుపదేశ ఫలితంగా భాస్కరరావు గుండె దిటవు చేసుకున్నాడు కాబోలు—ఇంటికి పోయీ, పోవటంతోటే మేనత్తనూ పిన్నిని లాలనగా పలకరించాడు. మేనత్త అతన్ని చూడగానే స్థాయి హెచ్చించి ఏడవసాగింది పద్మని భుజాలు పట్టుకుని అతను లేవదీసాడు; పద్మ తల విరబోసుకునివుంది. ఎర్రబడిన ఆమె కళ్లు దేన్నీ చూడడంలేదు. ఒక్క నిమిషం ఆమె దేహం పట్టుతప్పి వట్టి తోలుబొమ్మలా వేళ్ళాడిపోయింది. మరుక్షణం ఆమె మేలుకొంది—హృదయ

(4-వ పేజీ చూడండి)

ఓడిందెవరు?

రావు : గృహయజమాని.
శర్మ :
మూర్తి :
శాస్త్రి :
ప్రభాకరం : } ఆయనమిత్రులు
కమల : రావుగారిభార్య.
విమల : ఆమెస్నేహితురాలు.
వెంకయ్య : జీతగాడు.

(రావుగారి ఇంట్లో)

మూర్తి : ఆట.
శాస్త్రి : అడ్డు.
మూ : మరతు.
శర్మ : పైమరతు.
మూ : దస్తా.

రా : ఆట చెప్పటం, పాట పాడటమే గాని ఒక్కసారైనా గెల్చిన పాపాన పోలేనా. పేకమాత్రం ఎక్కుతున్నది దస్తాలకు దస్తాలు.

మూ : మీచేతిలో ఆట కలియకపోతే నేనేంచేస్తాను?

రా : గాలిలో దీపంపెట్టి దేవుడా నీ మహిమన్నట్లు జాకీలుగోలాలు లేకుండా ఆటచెప్పి, అదేమిటయ్యా అంటే నీకే అంతా అనటం చాలా బాగుందండి మూర్తిగారు. ఇంతకూ మనం ఓడిపోవాలనే ఉంది.

మూ : మీకు అంటే కోపం వస్తుంది గాని పేక ఎక్కినంతమాత్రాన రోషపడటం ఎందుకు? మీకు ఏకోశానా స్పోర్ట్సుమన్ స్పిరిట్ లేదండి.

శర్మ : ఎందుకు అనవసరంగా గొడవ పోనీయండి. కాలక్షేపానికి కూర్చున్నాం గాని డబ్బు పెట్టేమైనా ఆడుతున్నామా!

శా : ఇక ఇంతటితో ఈ చతుర్ముఖ పారాయణం కట్టిపెట్టేస్తే మంచిది. బీచికివెళ్ళి కొంచెంసేపు చల్లగాలి పీలుద్దాం లేవండి. అప్పుడుగాని ఈ ఉద్రేకం చల్లారదు.

రా : బీచీ ఏమిటి, సినిమా ప్రోగ్రాం పెట్టుకొని. ప్రభాకరం ఏడీ, అయిదింటి కల్లా వస్తానన్నాడు కదూ. ఆ...అప్పుడే అయిదున్నరయిందే. ఇటువంటివాళ్ళను చూస్తే నాకు చెడ్డకోపం వస్తుంది. ఫలానా టైముకు వస్తానని చెప్పి రాకపోవటంలో అర్థం ఏమిటి? చదవంగానే సరా!...

శా : ఇప్పుడు మాత్రం పోయిందేమిటి! ఇంకా గంట టైముంది. ఈలోగా ఊడి పడడూ.

[ప్రభాకరం ప్రవేశిస్తాడు.]

శర్మ : అదిగో రానేవచ్చాడు. నీకు నూరేళ్ళు ఆయుష్షు ప్రభాకరం.

ప్ర : ఈ పాతికేళ్ళకే జీవితంమీద రోత పుట్టింది. ఇంకా 975 సంవత్సరాలు బ్రతకమంటారా బాబూ. మీకో నమస్కారం. మీ దీవెన ఉపసంహరించుకోండి.

రా : పాపం జీవితంమీద అంత విరక్తి పుట్టిందా ప్రభాకరం!

ప్ర : ఇంకా మెల్లగా అంటారేమిటండి రావుగారూ...ఏమిటో ఈ లోకాన్ని

'రామచంద్'

చూస్తుంటే, ఎందుకొచ్చిన జీవితమా అని అసహ్యమేస్తున్నది.

శ : ప్చ్ ప్చ్. తింటానికి, ఉంటానికి వున్నవాడివి నీకే ఇట్లా అంటే ఇక మిగిలినవాళ్ళేమనాలి?

రా : సరేగాని ప్రభాకరం, ఇంత ఆలస్యంగా వచ్చావేం?

ప్ర : అదంతా పెద్ద కథలే.

శ : ఏమిటి మమ్మల్ని పెద్ద సస్పెన్సులో పెట్టేస్తున్నావు. చటుక అదేదో త్వరగా చెప్పగదూ బాబూ. సినిమా టైమవుతున్నది.

ప్ర : ఇది ఓ సినిమాకథే. లక్ష్మీపతి మీకు తెలుసుగా?

శా : లక్ష్మీపతి, తెలియకేం. (అదుర్దాగా) ఏమైంది? అతని కేమైనా...

ప్ర : అతని కేంకాలేదు. నిక్షేపంలా వున్నాడు. ఆయన భార్యామణి వుంది చూశారూ...

రా : (అదుర్దాగా) ఆయన భార్యామణికా! ..నిన్న కేగా మా ఇంటికొచ్చి కమలతో మాట్లాడివెళ్ళింది. ఇంతలోనే ఏమైంది?

ప్ర : (తాపీగా) ఏమౌతుంది...ఏమవ్వాలో అదే అయింది.

మూ : అంటే, పోయిందా...

ప్ర : ఆహా...పోయింది. భర్తను, మూడేళ్ళ కొడుకును విడిచిఎదురింటి అబ్బాయితో చక్కగా లేచిపోయింది.

రా : అంతవరకూ ఎందుకొచ్చింది వ్యవహారం?

ప్ర : ఎందుకొచ్చిందంటే ఏంచెప్తాం. చాలాకాలంనుంచి వాళ్ళిద్దరిమధ్య ప్రణయం సాగుతూనే ఉంది.

రా : లక్ష్మీపతి తెలిసీ ఊరుకున్నాడా?

శా : ఊరుకోక ఏంచేస్తాడు, ఉరిపెట్టుకొని చస్తాడా? ఏంచేసినా తానేగా గోలయ్యేది.

రా : అట్లా అనుకోబట్టే సంసారాన్ని నాశనం చేసుకున్నాడు. ఇప్పుడు మాత్రం ఆ గోలేదో అయిందా లేదా!

ప్ర : ఓ ప్రశ్న అడుగుతాను రావుగారు. మీరేమనుకోరుగదా?

రా : నిస్సందేహంగా అడగొచ్చు.

ప్ర : లక్ష్మీపతి స్థితిలో మీరే ఉన్నారనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు?

రా : తెలివైన ప్రశ్నే అడిగావు.

శా : మాకు కావలసింది జవాబు.

రా : సిద్ధంగా వుంది. ఏ రోజైతే నా భార్య నన్ను ప్రేమించటంలేదని తెలుసుకుంటానో, ఆనాడే ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చి తనిష్టంవచ్చిన చోటుకు వెళ్ళిపొమ్మంటాను.

మూ : అంటే!

శా : అంటే, ఆనాటితో ఆమెకు నాకు మధ్య ఎటువంటి సంబంధ బాంధవ్యాలు ఉండవన్నమాట.

శ : అయితే భార్యలేని లోటు మిమ్మల్ని బాధించదా?

రా : (నవ్వుతూ) ఒక భార్య పోతే మరో భార్య. లోకం గొడ్డుపోలేదుగా. నిర్విచారంగా రెండోపెళ్ళి చేసుకుంటాను.

శ : ఈ విషయం తెలిస్తే, రెండోపెళ్ళికి మీకు పిల్లనెవరిస్తారు?

రా : (హేళనగా నవ్వుతూ) మనం మగవాళ్ళం. మగవాడికేం మచ్చయ్యా!

శా : ఈ జవాబే మీ భార్య వింటే ఏమౌతుందో తెలుసుకునే మాట్లాడుతున్నారా?

రా : ఏమీ అవదు. మాలో ఒకరిపై ఒకరికి విశ్వాసముంది.

శా : మీరు విడిచిపెట్టినంత మాత్రాన ఆమె మీ భార్య కాకుండా పోతుందా! లోకం ఏమంటుందో ఆలోచించండి.

రా : లోకం, శాస్త్రం అనుకుంటే నాకేం.

అంతగా అనుకునేవాళ్లు కూలిపోతున్న సంసారాల్ని బాగుచేయలేం ?

మూ: మానవుడై పుట్టింతర్వాత చచ్చేంత వరకూ లోకంతో సంబంధం తప్పదు. రావుగారూ, లోకాన్ని కాదని మీరు చేయ కల్గిం దేమీలేదు.

రా: అయితే ఏం చేయమంటారు! అభిప్రాయ భేదాల్తో ఒకరిపై ఒకరికి అనురాగం లేశంగూడా లేకుండా, సంసారం చేయమనేనా మీ అభిప్రాయం ?

శ: చేతైతే భార్యను అదుపులో పెట్టుకోవాలి.

రా: మాటల్తో గాబట్టి అనేశారు మీరంతా అక్కడే పొరబడ్తున్నారు. ఇది మనస్సుల్తో కూడిన పని ఒక స్త్రీ, తన భర్తను ప్రేమించటం లేదంటే, అతనిలో ఏదో లోటు కనిపెట్టిందన్నమాట ఆమె.

శా: మరి ఆలోటు పూర్తి చేసుకోవచ్చుగా.

రా: అది అనుకున్నంత సులభంకాదు. ఒకసారి స్త్రీకి పురుషునిపై విహ్యభావం కల్గిందంటే, అది మారటం ఎంత కష్టమనుకున్నారు శాస్త్రీజీ.

ప్ర: విడిచిపెట్టినంత మాత్రాన ఆమెను మీరు మరువగలరా?

రా: మరిచిపోలేనివా డెవడూ అటువంటి పరిస్థితులు రానివ్వడనుకో. ఏనాడైతే ఆమె నాది కాదనుకుంటానో ఆనాడే ఆమెను పూర్తిగా నా మనస్సులోనుండి తొలగించుతా నన్నమాట. జరిగినదంతా ఓ పీడకల అనుకొని ఎటువంటి విచారం లేకుండా హాయిగా జీవిస్తాను.

శా: మాటలు చెప్పటానికేంలే. నిజంగా అంత పనే జరిగితే మీ హృదయం ముక్కలై పోదూ. రావుగారూ మనం మానవులం...

రా: మానవులం గాబట్టే నేనూ చెప్పగల్గాను. జంతువులమే అయితే ఇంతవరకూ రాదు.

శ: మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారు రావుగారూ. మానవుడన్న తర్వాత కోపం, ద్వేషం, రోషం సహజం. ఒక స్త్రీ, అందులో మీరు అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య, మీతో కొంతకాలం సంసారం సాగించిన అర్ధాంగి, మిమ్మల్ని కాదని వెళ్ళిపోతుంటే, మానవ సహజమైన ఈర్ష్య, కక్ష, మీ హృదయాంతరాళంలో రిల్లి, ప్రళయరూపాన్ని ధరిస్తాయని నమ్మండి. వీటన్నిటిని మీరు జయించగల్గిననాడే, మీ సిద్ధాంతానికి అక్షరాలా విజయం సిద్ధించేది.

శా: మహామహా ఋషులే వీటిని జయించలేకపోయ్యారు, ఇహామనం!

రా: మీ రైన్నైనా చెప్పండి. నాపై నాకు సంపూర్ణ విశ్వాసముంది. ప్రతి విషయాన్నీ అర్థంచేసుకొని ప్రవర్తించగల సుజ్ఞానముంది. కేవలం ఊహాగానమనే చీకటి కోణంనుండి గాక, సత్యమనే వెలుగు బాటలో విషయాల్ని పరిశీలించగల మేథస్సువుంది. నేను మానవుణ్ణి.

ప్ర: పందెం వేస్తాను. ఇదే పరిస్థితి ఏనాడైనా మీకు తటస్థించే పక్షంలో ఓటమి ముమ్మాటికీ మీదే. అప్పుడు మీ అపురూప మానవత్వం ఏం మాతుందో చూద్దాం.

రా: సరే చూద్దాం.

శా: ప్రభాకరం, ఏమిటోయ్ దరిద్రపు కోరికలు. ఇటువంటి పరిస్థితులు మనకు తటస్థించాలని కోరుకుంటున్నావా? పగవాడికి గూడా వద్దుబాబూ ఇటువంటి మనః క్లేశాలు.

శ: పోనీయండి గొడవ. ఎవరి పెళ్ళాలూ

★ ఓడిందెవరు? ★

లేచిపోవటం, అందుకు మనం వాగ్వివాదంతో కాలం పుచ్చుకోవటం, ఇదంతా ఎందుకు, కదండి సినిమాకు వెళ్దాం.

రా: ఇహ ఇప్పుడేం సినిమా, అట్లా బీచికి వెళ్లొచ్చి, భోంచేసి రెండో ఆటకు వెళ్దాం. వెంకయ్యా!...

వెం: (ప్రవేశిస్తూనే) ఏంటి బాబు గారూ?

రా: మేమట్లా బయటికి వెళ్తున్నాం, ఓ అరగంటలో తిరిగొస్తాం. వీళ్ళంతా ఇక్కడే భోంచేస్తారని వంటామెకు చెప్పు.

ప్ర: నాకొక్కంచెం పనుంది. మీరు తిరిగొచ్చేటప్పటికి వస్తాను.

రా: ఆలస్యంగావస్తే క్షమించేది లేదు. త్వరగారా. నీకోసం ఎదురు చూస్తుంటాం.

[నిష్క్రమణ]

* * *

కమల: (ప్రవేశిస్తూనే) వెంకయ్యా,... వెంకయ్యా,...

వెం: (బయటనుండొచ్చి) ఏమిటమ్మగారూ?

క: మీ అయ్యగారేరీ?

వెం: వారంతా కలిసి బయటకు వెళ్ళారండి.

(కారు వచ్చిన ధ్వని)

క: వచ్చినట్టున్నారు చూడు.

వెం: అది మన కారు మోతగా లేదండి.

క: ఎవరిదో?... ఓహో విమలా ఎప్పుడూ రావటం?

వి: ఉదయం మెయిల్లో. అంతా కులాసేనా?

క: 'ఆ...'

వి: ఏం, ముక్త సరిగా 'ఆ' అన్నావు. మీవారేరీ?

క: ఆయనకేం,... స్నేహితులు, సినిమాలు, బీచి షికార్లు...

వి: ఏమిటే అంతపుల్ల విరుపుగా మాట్లాడుతున్నావు?

క: (రుద్ధకంఠంతో) ఏం చెప్పమంటావే, నా బ్రతుకు అడివికాచిన వెన్నెలే అయింది.

వి: (నవ్వుతూ) ఏమైనా నాటకం రిహార్సిలు చేస్తున్నావా?

క: నీకంతా నవ్వుగావుందే.

వి: కాక, నీకేంలోటో చెప్పు. అటు కోరింది తెచ్చిచ్చేభర్త; ఇటు అత్తపోరు, ఆడబడుచు పోరు లేదాయె.

క: అత్తపోరు, ఆడబడుచు పోరు లేని మాత్రాన ఏమైంది!

వి: అయితే ఆయన నిన్ను సరిగా చూడటం లేదంటావా! కోరి చేసుకుంటివిగా.

క: కోరి చేసుకున్నందుకే ఈ అగచాట్లు. నా జీవితం వ్యర్థమైంది వారు నన్నొక్క పిసరుగూడా లెక్కచేయటం లేదు.

వి: ఆశ్చర్యంగానే వుంది. నీదంతా వట్టి అనుమానం.

క: నా పరిస్థితిలో నీవే వుంటే నీకే తెలుస్తుంది. ఆఫీసు, బీచి షికార్లు, స్నేహితులు, సినిమాలు, పేకాటలు ఇవి తప్ప ఆయనకు భార్య విషయం జ్ఞాపకం వున్నట్లు లేదు. నాలుగు మెతుకులు కొరకటానికీ, రాత్రిళ్లు ఆ నాల్గు గంటలు నిద్ర పోవటానికీ ఇంటికి వస్తున్నట్లు కన్పిస్తున్నది. నే నెక్కడికి పొయ్యేది ఆయనకు అనవసరం. నేను ఇంట్లో ఉన్నానో లేదో అంతకంటే అనవసరం. ఆయున కేదైనా పనిబడితే పిలుస్తారు. లేకపోతే లేదు. అంతే. ఆయన కసలు నాతో అవసరం వున్నట్లు కన్పించదు. ఏమిటో ఈ మౌనం అర్థంగాకుండా వుంది.

వి: ఏమిటో, నీవు అనవసరంగా బాధపడుతున్నావని నాకు అన్పిస్తున్నది. నాలుగు సంవత్సరాలైంది మనంకలుసుకొని. అప్పుడు నీవేమన్నావో మరచావా?

* * *

క: అంతలోనే మరుస్తాననుకున్నావా? ఆనాడు నే నాయనను దేవతను. ఒక్క క్షణం కన్పించకపోతే చాలు—

* * *

రా: కమలా...ఓ కమలా...

క: (లోపల్నుండి) ఆ, వస్తున్నానండీ.

రా: త్వరగా రా.

క: (ప్రవేశించి) ఏమిటండీ, అంత ఆదుర్దా!

రా: నా పుస్తకం తీశావా?

క: ఏ పుస్తకం?

రా: ఏ పుస్తకం,...నా డైరీ.

క: మీ డైరీతో నాకేంపని!

రా: సరే, నా చొక్కా గుండీలు?

క: చొక్కాని లేవు!

రా: ఊహూ...

క: ఇవిగో అలమారులో వున్నాయి.

రా: ఏం చేస్తున్నావు?

క: వంట...

రా: తర్వాత చేసుకోవచ్చులే, ఇట్లారా

క: అబ్బ...ఉండండి..అవతల పొయ్యి



రా : ఎప్పుడూ వంట, ఇల్లు...క్షణం కూడా తీరికుండదు నీకు. రేపటినుంచి వంటమనిషిని పెట్టా వుండు.

క : ఎందుకు అదో ఖర్చు.

రా : ఉన్న డబ్బంతా కట్టకట్టుకొని వెళ్తామా. చూడు కమలా, నిజం చెప్తున్నాను నీవు ఒక్క క్షణం ఎదురుగా లేకపోతే చాలు ఏదో దిగులుగా ఉంటుంది. ఆఫీసులో కూర్చునే ఆ కొద్దిగంటలూ ముళ్ళమీద కూర్చున్నట్లుంటుందంటే నమ్మతావో లేదో...

*   *   *

వి: అంతగా ప్రేమించి నాయన, ఇంతిగా ఎట్లా మారిపొయ్యాడే.

క: నా రాత.

ప్ర: (ప్రవేశించి) ఏమిటే రాతంటున్నారు.

క: (ఉలిక్కిపడి) ఎవరు! ప్రభాకరం గారా,...ఏమీ లేదు.

ప్ర: ఆప్తమిత్రుణ్ణి నావద్ద దాస్తున్నారా?

క: దాచటానికేముంది - ఏమీ లేదు.

ప్ర: మీరు చెప్పకపోయినా, నాకు తెలుసు. క్షమించాలి, మీ రిద్దరూ మాట్లాడుకుంటుంటే, బయట నిల్చొని అంతా విన్నాను.

క: (ఆదుర్దాగా) నిజంగానా?

ప్ర: (నవ్వుతూ) ఇంకా అబద్ధమాడటం నేర్చుకోలేదండి. ఈరోజు మా స్నేహితుల మధ్య చిన్న వాగ్వివాదం జరిగింది రావుగారు ఏవో ఆదర్శాలు మాట్లాడారు. నేను పందెంకట్టాను. వారిని పరీక్షించటానికి సమయం ఎప్పుడు వస్తుందా అని ఆలోచిస్తున్నాను. సమయం దొరికింది.

క: ఏమిటి?

ప్ర. తర్వాత చెప్తాను. ఓ చిన్న నాటకం ఆడాలి మనం.

క. మనం అంటే.

ప్ర: అంటే మీరు...

క: నేనా! నాకేం తెలియదు బాబూ.

ప్ర: మీ కన్నీ తెలియచెప్తాగా ఇట్లా రండి.

[గుసగుసలు]

క: ఏమిటో భయంగా వుంది. పర్యవసానం ఏమవుతుందో!

ప్ర: నే నుండగా మీకొచ్చిన భయమేమీ లేదు. చూడండి ఈ ఉత్తరాన్ని వెంకయ్య చేతికివ్వండి, రావుగారి కిమ్మని. వాళ్ళు వచ్చేటైమయింది. నే నట్లా వెళ్తాను. (నిష్క్రమణ)

క: సమయానికి నీవుగూడా వున్నావు విమలా. ఈరోజు వారి నిజస్వరూపాన్ని కళ్ళారా చూద్దువుగాని. ఈ నాటకంలో నీవుగూడా ఓ పాత్ర.

వి : నాకా! సరే...నీ సుఖానికి నే నేం చేయటానికైనా సిద్ధం.

క : వెంకయ్యా...

(వెంకయ్య ప్రవేశం)

వెం : ఏమిటమ్మగోరూ.

క : ఈ ఉత్తరం, తాళపుచెవులు బాబుగారికివ్వు నేను పైకి వెళ్తున్నాను ఎక్కడికో వెళ్తున్నారట అని చెప్పు.

వెం : (కుతూహలంగా) ఎక్కడి కమ్మగోరూ?

క : నీకెందుకు, చొప్పదంటు ప్రశ్నలు వేయక నే చెప్పినట్లు చెయ్. రావే విమలా పైకి వెళ్దాం.

[కమల విమల పైకి వెళ్తారు.]

ఒక్క క్షణం విరామం.

*   *   *

[ప్రవేశం—రావు, శర్మ, శాస్త్రి, మూర్తి...నవ్వుకుంటూ.]

రా : ప్రభాకరం వచ్చినట్లులేదే?

శ : వచ్చి ఎటైనా వెళ్ళాడేమో.

రా : వెంకయ్యా—

వెం: (ప్రవేశించి) ఏమి టయ్యగోరూ.

రా: ప్రభాకరం గారు రాలేదురా.

వెం: వచ్చారండీ.

రా: ఏడీ?

శ: అదుగో తోటలోనుండి వస్తున్నాడు.

[ప్రభాకరం ప్రవేశిస్తాడు.]

రా: ఎక్కడికెళ్ళావోయ్?

ప్ర: అటు తోటలోకి వెళ్ళాలే.

వెం: బాబుగోరూ...

రా: ఏమిట్రా?

వెం : అమ్మగారు ఈ ఉత్తరం తాళపు చెవులు ఇచ్చారండి.

శ : ఎక్కడికైనా వెళ్ళారేమిట్రా.

వెం: తెలియదండి. పైన ఉన్నారు, అరున్నా ఇంకేవరో.

రావు : (ఉత్తరం చదువుతూ) ఆహా... ఆ...సరే.. బాగానే వుంది.

శ : ఏమిటి?

మూ. ఉత్తరం చూడగానే మీ ముఖలక్షణాలు మారిపొయ్యాయే! రావుగారూ, ఏమిటి, ఏమైంది?

రా : నా ముఖమా? మారిపోవటమా! (నవ్వుతూ) అది కల్ల

[కమల మెట్లు దిగివస్తుంది]

రా : కమలా! (పొడి గొంతుతో) ఈ ఉత్తరం నీవే వ్రాశావా?

క : (భయంభయంగా) ఆ...

రా. నేను నమ్మలేకపోయాను మొదట. అయితే ఉత్తరం వ్రాయట మెందుకు, ముఖాముఖి చెప్పొచ్చుగా.

★ ఓడిందెవరు? ★

క: చెప్పలేకనే.

రా: చెప్పలేనిదానివి, ఎట్లా చేయ ఎవరూ. గలవా అని నా అనుమానం.

యా: అసలు సంగతేమిటో చెప్పరేం.

క: ఏమీ లేదు.

రా: ఏమీ లేదన్నంతమాత్రాన సరా. ఇవాళ గాకపోయినా రేపైనా బట్టబయలయ్యేదేగా. మూర్తిగారూ, నేను కమలను సరిగా చూడటంలేదట. అందుకని ఆమె...

ప్ర: వెళ్ళిపోతానంటున్నదా? ఎక్కడికి?

రా: సరిగ్గా గ్రహించారు. ఎక్కడికంటే తనిష్టమెచ్చిన చోటుకు.

ప్ర: మరెవర్నైనా ప్రేమిస్తున్నారా కమలాదేవిగారూ. ఇంతకుముందు నే వచ్చినప్పుడు మీతో మాట్లాడుతున్నది ఎవరు?

క: ఎవరైతే మీకేం, వారినే నేను ప్రేమిస్తున్నది.

శా: ఏదో ఆ మహాపురుషుల దర్శనం ఇప్పిస్తే ధన్యులవుతాం.

రా: శాస్త్రీజీ, అదంతా మన కనవసరం.

శా: మీ ఉద్దేశం?

రా: (హేళనగా) తన ఇష్టమెచ్చిన చోటకు ఆమె వెళ్ళిపోతుంది. ఇష్టమైన వారిని ప్రేమిస్తుంది. వాళ్ళెవరో, ఏమిటో మనకెందుకు! ఆమె సుఖంగా వుండటమే మనకు కావలసిందల్లా.

క: ఇంకేం ఆలోచన. ఇంతకాలం ఆలోచిస్తూనే ఉన్నా. మీరంతా వింటూనే వున్నారుగా. ఆయనకు నేనంటే ఆవగింజంతైనా అభిమానంలేదు. నే నిక ఈ ఇంట్లో ఉండలేను.

మూ: రావుగారూ, సంఘంలో మీ కున్న పలుకుబడిని, గౌరవాన్ని పునః స్మరించండి. మీ భార్య వెళ్ళిపోయిన తర్వాత సంఘంలో మీ స్థానం ఏమిటో తెలుసుకోండి

రా: అయితే ఏంచేయమంటారు! వెళ్ళిపోతానంటున్న వాళ్లను, ఆపితేమాత్రం ఆగుతారా? ఓవేళ ఆపినా, ఈ సంసారంలో సుఖం ఏముంటుంది. ఇహ సంఘమంటారా! నాకు పోయిందేమీ లేదు. సంఘమంటే ఎవరు? నేనూ, మీరూ, మూర్తిగారు, మన చుట్టూ వున్న ఇతర్లు. వీళ్ళందరినీ డబ్బుతో నోరు మూయించటం ఏ మంత పనికాదు.

క: మూర్తిగారూ, మీ దంతా శుద్ధ కంఠశోష. ఆయనకు నామీద ఇసుమంతైనా అనురాగం, ప్రేమ లేదు.

శా: నేను నమ్మను. రావుగారు మీ విషయంలో అశ్రద్ధ వహిస్తున్నారంటే నవ్వాలో, ఏడ్వాలో తెలియకుండా వుంది. మీ కాయన తక్కువచేసిం దేమిటి? కోటంత ఇల్లు, లంకంత దొడ్డి, కారు, రేడియో, నగలు, దాసదాసీలు... కావలసినంత డబ్బు... ఇంక మీకు తక్కువైందేమిటి?

క: మీరు పొరపడ్డారు శాస్త్రీగారూ.. స్త్రీ అన్న తర్వాత కావలసింది నగలు నాణ్యాలూ కాదు మహాశయా... ముందట ఆమె కోరుకునేది భర్త హృదయంలో చిర స్థానం.

మూ: ఇంతకాలం కాపురంచేసి కూడా పాపం, ఆయన మనస్సును అర్థం చేసుకోలేక పోయ్యారేం?...

క: ఊహూ... ఆయనకు మనస్సనేదే వుంటే ఆ ఉత్తరం చూచిన తక్షణమే తెలిసేది. మీ భార్య ఆ ఉత్తరం వ్రాసిందనుకోండి, మీ రేం చేస్తారు?

మూ: నేనా! (హేళనగా), చీల్చి, చెండాడి, ఉప్పుపాతర్లు పెట్టాను. రావుగారు ఋషి గనుక కిమ్ అనకుండా వూరుకున్నారు.

ప్ర: రావుగారూ, మీరేం మాట్లాడరేం..

రా: ఇది నా కుటుంబ వ్యవహారం. మీరంతా జోక్యం కలుగజేసుకోవద్దు. అయితే కమలా, నీవు వెళ్ళిపోతాననేగా అనేది?

క: అదే మీ ప్రశ్నైతే, నే వెళ్ళిపోవటం ఖాయం.

రా: సరే. నీ యిష్టం.

క: విమలా, ఇటు రా.

[విమల దిగివస్తుంది.]

రావు, శాస్త్రి, శర్మ, మూర్తి: (ఒక్కసారిగా) ఎవరూ విమలా!

వి: ఔను విమలనే. కమల ఏదో చెప్పకోని వాపోతే ఏమిటో అనుకున్నాను. ఇప్పుడంతా అర్థమైంది. రావే కమలా, నాతో వచ్చెయ్. చదువుకున్న దానివి... పంతులమ్మ ఉద్యోగమైనా దొరక్కపోదు.

రా: పంతులమ్మ ఉద్యోగం చేసే కర్మ దేనికి కమలా? నాకున్నదంతా నీదే. నీ ఇష్టం వచ్చింది తీసుకెళ్లు. నీవు సుఖంగా వుండటమే, నే కోరేది

క: నాకేం అక్కరలేదు. నన్ను నే పోషించుకోగల శక్తి నాకుంది. పద విమలా.

రా: ఒక్క క్షణం ఆగు... లోపలికి వెళ్లి వస్తాను.

[ఒక్క క్షణం విరామం. రావు లోపలికి వెళ్ళివస్తాడు.]

రా: సరే... సెలవు కమలా...

[కమల వెళ్ళబోతుంటుంది. తుపాకీ మ్రోగుతుంది.]

క: ఏమిటి? అయ్యో......తుపాకితో కాల్చుకున్నారు. (ఏడుస్తుంది)

ప్ర: ఆత్మహత్య! రావుగారూ ఎంత పనిచేశారు! మీరు పిరికిపందలండీ నిజంగా.

శా: నోరుమూయ్ ప్రభాకరం...

క: ప్రభాకరంగారూ ఏమైందో చూశారా? పర్యవసాన మేమవుతుందో కూడా ఆలోచించకుండా ఆడిన ఈ నాటకానికి ఇదేనా మంగళం? నేను పాపిష్ఠి దాన్ని. ఆయన లేని నే నెందుకు...(తల

రా: (లేచి) ఆగు కమలా... నేను చనిపోలేదు. మీరాడిన నాటకంలో అంతర్నాటకం ఆడాను నేను. నేను కాల్చింది బొమ్మతుపాకి.

క: (ఆశ్చర్యంగా) ఆ నిజమా?

రా: నిజం... ఎందుకు తెల్లబోతావు కమలా. నీవే గెల్చావు. (నవ్వుతూ) నేనే ఓడిపోయ్యాను.

ప్ర: ఓడింది మీ రెవరూ కాదు, నేను. తిట్లు తినేవాడెవ్రా అంటే దారినిపొయ్యే వాడన్నారట. అట్లానా మా నాన్న నేను పోక, అనవసరంగా మీ వ్యవహారాల్లో తల దూర్చటం నాది బుద్ధి తప్పు. బుద్ధి వచ్చింది బాబూ లెంపలేసుకుంటున్నాను. రావుగారు చనిపోలేదు గాబట్టి సరిపోయింది. నిజంగా ఆయనే చనిపోయినట్లైతే నా గతి ఏమయ్యేదో?

శా: అమంగళం ప్రతిహతమగుగాక.

[అంతా నవ్వు]

ప్ర: ఇక సెలవు పుచ్చుకుంటాను రావుగారూ.

రా: ఉండవోయ్ భోంచేసి నిమ్మళంగా వెళ్దామనుకున్నాంగా.

ప్ర: ఇప్పుడు జరిగిన సినిమా వాలకూ.. ఓ ట్రాజీ కామెడీ.

[అంతా నవ్వు.]

వెం: (ఆదుర్దాగా ప్రవేశించి) ఏమిటండీ అమ్మగారూ, తుపాకీ మోత వినిపించింది. అంతా కులాసానే.

[మరీ నవ్వుతారు]

వెం: ఏమిటో బాబులు! తుపాకీ మోత విని, గుండెల్లో రైళ్లు పరుగెత్తుతా వుంటే, పరుగెత్తు కొచ్చాను ఏమైందో అని. తీరా వస్తే, అంతా తగలబడి నవ్వుతున్నారూ. పిచ్చి కేమైనా పిచ్చా! లేక నాకా?...

[తనూ నవ్వుతాడు.] ★



ఆద్యంతాలు

వి. యస్. అవధాని


ఎంత దీర్ఘకాలపు ప్రమాదకరమయిన రోగాన్నయినా, మూడు డోసులంటే మూడే డోసులలో అతి సులభంగా నయం చేస్తాడని డాక్టరు సుధీర్ ఇ. ఎఫ్. జి. హెచ్ (లండన్) గారి కీర్తి ఊరంతా వ్యాపించింది.

అటు ఆడవాళ్ళు గాని, ఇటు మగవాళ్ళు గాని, అటు న్యాయవాదుల దగ్గరనుంచి చదువుకొన్న విద్యావంతులూ ఇటు అక్షరం ముక్క రాని రైతులూ సుధీర్ పేరును రామనామంగా కీర్తిస్తున్నారు. ఇంతకూ సుధీర్ మా వూళ్ళో వైద్యం మొదలుపెట్టి అయిదువారాలయింది. హోమియో వైద్యం. మిత్రుడు దాసు పారిభాషికంలో బల్లిగుడ్ల వైద్యం. అయితే మాత్రమేం!

పెద్ద బజార్లో వ్యాపారం కిటకిటలాడే చోట రెండంతస్థుల మేడను సుధీర్ అస్పత్రికి అద్దెకు తీసుకున్నాడు. కింది అంతస్థంతా నర్సింగ్ హోమ్ అందులో రెండు గదులూ ఒక పెద్ద హాలూ. గదులలో ఏమున్నదో గాని హాలులో మాత్రం రెండు పెద్ద పెద్ద అపరేషన్ టేబుల్సూ, ఒక అరడజను కుర్చీలూ ఉన్నవి. గోడలకు సుప్రసిద్ధ హోమియో డాక్టర్ల బొమ్మలున్నవి. ఇక పై అంతస్తులో డాక్టరు సుధీర్ ఇ. ఎఫ్. జి. హెచ్. (లండన్) గారి కాపురం.

పై అంతస్తులో ఒక పెద్ద హాలూ మూడు గదులూ కొంత ఖాళీస్థలమూ ఉన్నవి. ఖాళీస్థలంలో పూలకుండీలున్నవి. హాలులో ఒక డజను కుర్చీలూ రెండు పుస్తకాల బీరువాలూ, రెండు మందుల బీరువాలూ ఉన్నవి. ఒక బీరువాలో సర్జరీ సామాన్లు, స్టవులూ ఉన్నవి. ఒక గోడకు రెండు స్టెతస్కోపులూ ఎప్పుడూ వేలాడుతూ ఉంటవి.

ఇక ఆ యింటి చుట్టూ ఒక చిన్న తోట. తోట అంటే చిన్న చిన్న పూలమొక్కలన్నమాట. సుధీర్ మా వూళ్లో వైద్యం



"చల్లని చూపుల ఇలవేల్పులు"
గజపతిరాజు (శ్రీకాకుళం)

కలయిక చిహ్నం
—ఫొటో : ఎస్. రామకృష్ణ (నారాయణవరం)

★ ఆద్యంతాలు ★

ప్రారంభించిన ఆరవ వారంలో ప్లీడరు సుబ్బారావుగారికి వైద్యంచేశాడు. సుబ్బారావుగారికి చిన్నతనంనుంచీ కడుపులో నొప్పి. ఆ నొప్పి వచ్చినప్పుడు ఆయనపడే బాధ ఇంతా అంతా కాదు. చాలా భాగ్యవంతుడు కావడంవల్ల సుబ్బారావుగారు చాలా వైద్యాలు చేయించి ఇక నయంకాదన్న నిరాశతో వైద్యంచేయించడం మానివేశాడు. అటువంటి నొప్పిని సుధీర్ నాలుగు రోజులలో నయం చేయడంతో సుధీర్ గారి పేరు ప్రఖ్యాతులు మా వూరు పొలిమేరలు దాటి చుట్టుప్రక్కల వూళ్లకు కూడా పాకినయి.

ప్లీడరు సుబ్బారావుగారి వ్యాధి నయం కావడంతో ఆయన వైద్యం జిల్లా జడ్జిగారి ఇంటికీ, డిప్యూటీ కలెక్టరుగారింటికీ పాకింది.

సుధీర్ గారు ఇచ్చేది మామూలే డోసులు కాని తీసుకునేది మాత్రం వందరూపాయలు. అట్లా అని ఆయన మనస్సంతా ధనార్జనమీదనే అనుకోకేరు! పేదవాళ్లకు కూడా ఉచితంగా వైద్యం చేస్తాడు. వాళ్ళదగ్గర యేమీ తీసుకోడు.

ఇంతకూ ముప్ఫయ్యేండ్ల వయస్సువాడైన డాక్టరు సుధీర్ ఇ. ఎఫ్. జి. హెచ్. (లండన్) గారి సంపాదనంతా తినడానికి మాత్రం ఎవరున్నారు కనుక! ఇంట్లో ఎవరున్నదీ సాధారణంగా యెవరికీ తెలిసే అవకాశం లేదు. ముందుకు వెళ్ళేవాళ్ళు చెప్పే మాటలనుబట్టి పిల్లలు మాత్రం లేరు. మేడ మీద ఎవరో ఒక ఇరవైయేండ్ల యువతి ఉన్నదంటారు. బహుశా ఆమె డాక్టరుగారి భార్య అయిఉంటుందని కొందరు అంటారు.

2

డాక్టరు సుధీర్ గారు మావూళ్లో ప్రాక్టీస్ పెట్టినతరువాత హోమియో షాపులో పుస్తకాలకు గిరాకీ ఎక్కువయింది. నూటయాభై రూపాయలు పెట్టి కొన్న మెటీరియా మెడికా కొనే సాధువు డెవడని కొట్టు యజమాని దిగులుపడుతున్న రోజులలో సుధీర్ గారు అయిదువందల రూపాయల పుస్తకాలు ఇట్టే కొనుక్కుపోయినాడు.

సుధీర్ గారి వైద్యం దినదినాభివృద్ధి చెందుతూండడంచూసి శేషగిరిరావు ఆయన వైద్యంలో వాటా కలిశాడు. శేషగిరిరావంటే మా వూరు షావుకారు కోటయ్యగారి ఏకైక పుత్రుడు. బెనారెస్ మెట్రిక్ మూడేండ్లు తప్పి, సినిమా హాళ్ళల్లోనూ, పార్కులోనూ, కాఫీ హోటల్సులోనూ ఏకచ్ఛత్రాధిపత్యంసాగిస్తున్నాడు. అయితే ఏదైనా వ్యాపారంలో వాటా కుదరవచ్చు కాని వైద్యంలో భాగస్వామి ఏమిటని అడిగితే అసలు విషయం బయటపడ్డది.

శేషగిరిరావు సుధీర్ గారి ప్రాక్టీసుకు రెండువేల రూపాయలు పెట్టుబడి పెట్టాడు.

అందుకుగాను సుధీర్ గారికి వైద్యంలో వచ్చే ప్రతి వంద రూపాయలలోను సగం శేషగిరిరావుకు ముడుతున్నది. రెండు నెలల్లో సుధీర్ గారికి వూళ్ళో పలుకుబడి ఎట్లా ఉన్నా శేషగిరిరావుతో స్నేహం ఎక్కువయింది.

మూడో నెలలో సుధీర్ గారి వైద్యం మంచిదే గాని అందరికీ అందుబాటులో లేదన్న ప్రతీతి బయలుదేరింది. రోజూ కిటకిటలాడుతూవుండే ఆస్పత్రి నాలుగో నెలలో పల్చబడింది.

అంతటితో సుధీర్ గారు ఆ స్పత్రిని సినిమాహాలు దగ్గరకు మార్చారు. అప్పుడప్పుడు ఆయనవెంట షికారు వెళుతూ కనిపించుతూ వచ్చిన ఆ అమ్మాయి అంతర్ధానమయింది. ఆమెతోపాటు శేషగిరిరావు కూడా కనిపించకుండా పోయినాడు.

అయిదో నెలలో సుధీర్ గారి ఆస్పత్రికి ఎవరో శీలు వేయించారు. ఒక శుభోదయాన ఆ యింటికి సర్కిల్ ఇన్ స్పెక్టరూ ముగ్గురు పోలీసులూ దర్యాప్తుకు వెళ్ళగా ఆ యింటి

నిన్నటి క్లాసులో 'విదుర నీతి'లోని పద్యాలకి అర్థాలు చెప్పిన తెలుగు మాష్టారు, ఈవాళ క్లాసుకొచ్చి, ఒక విద్యార్థిని:

"కాపురుషగుణము లంటె ఏమిటి?" అనడిగారు.

"కాపులు చేసేపని, అంటె. వ్యవసాయం" అన్నాడా విద్యార్థి.

"బెంచీ ఎక్కు—నువ్వు రాము—కౌరవనాథా అంటె అర్థమేమిటి ?"

రాము తడుముకోకండా సమాధానం చెప్పేశాడు.

"కౌరవులకు మొగుడు వంటి వాడా"

—ఎస్. ఆర్. నంది. (కరగ్ పూర్)

యజమాని సుధీర్ గారు తనకు కనిపించి వారం రోజులయిందన్నాడు. ముందుగానే తనకు రెండు నెలల అద్దె ఇచ్చాడన్నాడు.

నిజంగా డాక్టరు సుధీర్ ఇ.ఎఫ్.జి. హెచ్ (లండన్)గారి వైద్యంవల్ల ప్రయోజనం పొందిన వాళ్లందరూ ఇది చూచి చాలా బాధపడ్డారు. ఆయనవంటి యువకుడికి, అంత వివేకశాలి అయిన డాక్టరుకు రాదగ్గ బాధలు కావని వూరు వూరంతా అనుకొన్నా పోలీసు శాఖవారు మాత్రం ఒకనాడు ఆ యింటి తాళాలు బద్దలుకొట్టి సోదా చెయ్యక తప్పలేదు. సోదాచేస్తే ఏం కనిపించింది? ఇంటినిండా కుర్చీలూ, డ్రాయర్లూ, హోమియో పుస్తకాలూ, రెండు ట్రంకుపెట్టెలనిండా గుడ్డలూ. పోలీసువాళ్ళు అవన్నీ స్వాధీనం చేసుకున్నారు.

అంతటితో ఆగిందా? ఆగలేదు. శేషగిరిరావు పేరట పోలీసు వారంటూ పుట్టిందని అంటట. కాని, షావుకారు కోటయ్య సామాన్యుడు కాకపోవడంవల్ల దాన్ని మాఫీ చేయించాడు.


ఆ తరువాత డాక్టరు సుధీర్ ఇ. ఎఫ్. జి. హెచ్. (లండన్) గారి పేరటకూడా ఒక వారంటూ పుట్టింది. పుడితే యేంలాభం! అసలు మనిషి దొరకందే!!!

3

ఇది జరిగి రెండేండ్లయింది హోమియో స్టోర్సుకేసి వెళ్ళినప్పుడల్లా డాక్టరు సుధీర్ మాట మాకందరికీ గుర్తు వచ్చేది. నిజంగా హోమియో వైద్యానికి దేశంలో గౌరవం లేకపోయినందుకు మేము చాలా బాధపడే వాళ్లం! మెడికల్ స్టోర్సులో కొందరు స్నేహితులం రోజూ కొంచెంసేపు ఇదే విషయం మాట్లాడుకొంటూవుండేవాళ్లం.

ఒకనాడు సుబ్బారావు అన్నాడుకదా "అసలు ఇ.ఎఫ్.జి హెచ్(లండన్) అనే డిగ్రీ ఉన్నదంటావా?"

ఇంటిలోని ఆహారమే విషముగా మారవచ్చును!



"నా పిల్లల జబ్బుకు నేనే కారణమైయుండ వచ్చునని డాక్టరుగారు అన్నప్పుడు నాకు ఎంతో విచారము గలిగినది.

గడచిన ఆరు నెలలలో నా పిల్లలు రెండు సారులు కడుపు నొప్పితో బాధపడ్డారు. ఇంతేగాకుండ పోయిన నెలలో మా ఆయన జబ్బుతో పడుకున్నారు. ఈ జబ్బులకు కారణమేమి టాయని తెలుసుకొందామని నేను డాక్టరుగారివద్దకు వెళ్లగా ఆయన ఈలా ఆడిగారు:

'ఏమండి, మీరు వంట విషయములో జాగ్రత్తగా నుంటున్నారా?'

'నేను ఆ విషయములో చాల జాగ్రత్తగా నుంటానండి' అని నే నన్నాను.

'అయితే మీరు వంటకు వాడే క్రొవ్వుపదార్థమును ఏలాగ కొంటారు?' అని ఆయన అడిగారు.


'మూత తీయబడిన డబ్బాలో అమ్మబడు దానిని కొంటానండి' అని అన్నాను నేను.

'మూత తీయబడిన డబ్బాలో అమ్మబడు క్రొవ్వుపదార్థము లలో అన్ని విధములైన క్రిములుండవచ్చును. మరియు అవి కల్తీ జేయబడుటవలననో, మలినమైన చేతులవలననో, లేక బజారులోని ఈగలవలననో పాడైయుండవచ్చును — బహుశః మీ కుటుంబములో అనారోగ్యమునకు ఇదే కారణమైయుండ వచ్చును' అని ఆయన అన్నారు.

వంట క్రొవ్వుపదార్థమును మూత తీయబడిన డబ్బానుండి కొనుటవలన నేను డబ్బు మిగుల్చుచున్నానని అనుకొనేదాన్ని. అయితే అందువలన ఆరోగ్యము చెడుటను చూచిన తరువాత అటువంటి విధముగా కొనుట లాభకరము గాదని తెలిసింది. అందుచే ఇప్పుడు నేను గాలికూడ చొరవకుండ సీలుచేయ బడిన డబ్బాలోనుండు డాల్డా వనస్పతినే కొంటాను. డాల్డా వనస్పతి మా ఆహారమును ఎక్కువ రుచికరముగా నుండేటట్లు చేస్తుందికూడా!"

డాల్డా వనస్పతిని మీరు కొనుచున్నారంటే దాని అర్థమేమి టంటే మీరు క్రొత్తదైనటువంటియు, శుద్ధమైనటువంటియు, అత్యున్నత రకమైనటువంటియునైన శాక క్రొవ్వుపదార్థమును కొనుచున్నారన్న మాట. మీ కుటుంబముయొక్క ఆరోగ్య విషయములో మాత్రము అజాగ్రత్తగా నుండకండి. డాల్డా వనస్పతి యున్నప్పుడు మీకేమి భయము? డాల్డా వనస్పతిలో ఇప్పుడు విటమినులు ఏ, డి కూడ యున్నవి. మరియు అందరు కొనుటకు వీలుగా అది 10 పౌనులు, 5 పౌనులు, 2 పౌనులు మరియు 1 పౌను డబ్బాలలో అమ్మబడుచున్నది.

మీ పిల్లల ఆరోగ్యమును ఏలాగ అభివృద్ధిచేయుట? ఉచిత సలహాకు ఈవేళే క్రింది అడ్రసుకు వ్రాయండి:
ది డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్టు బాక్సు నంబరు 353,
బొంబాయి 1



చెట్టుతోనున్న డబ్బాకై చూడండి

మీ ఆరోగ్యమునకై
డాల్డా వనస్పతితో వండండి

వంటకు దివ్యమైనది — ఖర్చు తక్కువ

HVM. 212-X52 TL

★ ఆద్యంతాలు ★

నాకు నిజంగా వళ్లు మండిపోయింది. ఆ డిగ్రీ లేకపోవడమేమిటి? హోమియో వైద్యమంటే నమ్మకంలేక దాన్ని ఎగతాళిచేద్దామనే సుబ్బారావు ఇలా అన్నాడనుకొని

"మనకు తెలియనంత మాత్రాన డిగ్రీలు లేకుండా పోతయ్యా?"

"అవున్రా. ఒప్పుకుంటాను. ఉన్నా దనుకో. ఇ. ఎఫ్. జి. హెచ్. అంటే యేమిటో చెప్పు" అన్నాడు రాఘవరావు.

అదేమిటో నాకూ తెలియదు మరి!! హెచ్. డి. అనే డిగ్రీ విన్నాను. ఎమ్. హెచ్. డి లాంటి మరికొన్ని డిగ్రీలు విన్నాను. కాని, ఇ. ఎఫ్. జి హెచ్. (లండన్) అనే డిగ్రీ గురించి ఎక్కడా వినలేదు. కనుక నేను చెప్పిన సూత్రాన్ని నాకే అన్వయంగా చేసుకుని.

"అదే మనకు తెలియక పోయినంత మాత్రాన ఆ డిగ్రీ లేనే లేదనడం బాగుంటుందా" అన్నాను. అందరూ నవ్వారు. నాకు చాలా కోపంవచ్చింది. బాధకలిగింది. నేను స్వయంగా చూస్తున్నాను. హోమియో వైద్యులలో ఎంతోమంది గొప్పవాళ్ళున్నారు. వాళ్ళను ఆదరించే వాళ్ళేరీ? ఏదో పని ఉన్నదని చెప్పి సినిమాహాలు వేపు నడక సాగించాను.

ఈ రెండేండ్లలో సుధీర్ గురించి వూళ్లో అనేక పుకార్లు బయలుదేరినవి ఏనోటివిన్నా అంత గొప్పవైద్యుడు లేడని ఒకప్పుడు పొగిడారో ఆ నోటితోనే వూళ్ళో వాళ్ళందరూ ఈనాడు ఆ డాక్టరును దుయ్యబడుతున్నారు. వట్టి మోసగాడంటున్నారు. ఇంతకూ అతను చేసిన మోసమేమిటో నాకు అర్థంకాలేదు. ఇదేవింగా ఆలోచిస్తూ సినిమాహాలు దాటిపోయాను. దాదాపు పొలాలలో నడుస్తున్నాను. అంతలో వెనకనుంచి ఎవరో పిలుస్తున్నట్లు వినిపించి వెనక్కు తిరిగిచూచాను. ప్రొద్దుపోయి చాలా సేపయింది. కొంచెం చీకటిగా ఉన్నది. నన్ను కాదేమో ననుకుని మళ్ళీ నడకసాగించాను.

మళ్ళీ పిలుపు వినిపించింది. మళ్ళీ వెనక్కు తిరిగిచూశాను.

ఎవరో ఆడమనిషి దగ్గరికి వస్తున్నది.

"మిమ్మల్నే...కొంచెం సేపు ఇటు వస్తారా" అన్నది.

నన్ను ఈ పొలాల్లో ఇంత చీకట్లో పిలిచే ఆడవాళ్ళు కాని, పిలవవలసిన అవసరమున్న ఆడవాళ్లుగాని లేరు.

అయినా ఎందుకోసమని అక్కడే నుంచున్నాను.

ఆ మనిషి దగ్గరకు వచ్చింది. ఎక్కడా చూచిన గుర్తు లేదు.

"ఇక్కడ కాదు. నావెంట రండి. మీతో కొంచెం మాట్లాడాలి" అన్నది. రోడ్డున ఇంకా యెవరో వస్తున్నారు. పోతున్నారు. ఏమయినా అక్కడనుంచుని మాట్లాడడం మంచిది కాదని ఆమెవెంట వెళ్ళడానికే నిశ్చయించుకుని నడిచాను.

సినిమా లైట్ల వెలుగులో ఆమెను పరకాయించి చూచాను. తెల్లటి చీర కట్టుకొన్నది. అంత అందంగలది కాదు. అందవిహీనురాలూ కాదు.

ఊళ్ళో ఈ మనిషివెంట నడుస్తుంటే స్నేహితులలో ఎవరన్నా చూచి ఏమనుకుంటారో ఖర్మ అనుకొంటూండగానే సినిమాహాలు ప్రక్కసందులోకి ఆమె నడక ప్రారంభించింది. సందు మొదట్లోనే ఒక గుడిసెదగ్గర ఆగి "ఫరవాలేదు. లోపలికి రండి" అన్నది.

అక్కడి వేమీ మంచి కొంపలు కావుత కనుక నే రోడ్డుమీద నిలబడడంకూడా అం. మంచిది కాదు. నెమ్మదిగా ఆమెవెంట ఆగుడిసెలోకి వెళ్లాను. అందులో చెప్పుకో దగ్గ సామాను నేమీ లేదు. ఆమె ఒక బుడ్డి వెలిగించి గోనెపట్టా ఒకటి దులిపి వేసి "కూచోండి" అన్నది.

తప్పేదేమిటని కూచున్నాను.

ఆమెకూడా కొంచెం దూరంగా కూచుని మీరునన్ను ఎరగరు. కాని, మిమ్మల్ని నేను ఎరుగుదును. మీరు హైస్కూలులో పనిచేస్తున్నారు కదూ?? ఆనాడు వార్షికోత్సవానికి సుధీర్ గారితో నేనుకూడా వచ్చానులెండి."

"అట్లాగా. సుధీర్ గారిప్పుడు ఎక్కడ ఉంటున్నారు" అన్నాను కొంచెం తెప్పరిల్లి.

"సుధీర్ ఏమయినాడో నాకు తెలియదు. ఉత్త దగాకోరు. లుచ్ఛా" అన్నది ఆమె.

"ఏం. ఏంచేశాడూ" అన్నాను. "ఇంకా ఏం చెయ్యాలి! ఈ వూళ్ళోలాగానే వైజాగ్‌లో కూడా ప్రాక్టీసు పెట్టాడు. మా నాన్నతో స్నేహంచేసి నన్ను వలలో వేసుకున్నాడు. సుమారు పదివేల రూపాయల నగలతో ఆయనతో ఈ వూరుతేచి వచ్చాను. నా దగ్గర నగలన్నీ అయిపోయాయి. అందుకని నన్ను ఆ శేషగిరి రావుకి అంటగట్టాడు. ఆ తరువాత ఆ శేషగిరిరావు నన్ను బొంబాయి తీసుకువెళ్ళి మోజుతీరిన తరువాత చెప్పాపెట్టకుండా ఇక్కడికి తేచివచ్చాడు."

"ఇంతకూ మీరు చెప్పేదేమిటి? నన్ను దేనికి పిలిచారూ? మీరు చెప్పిందంతా నిజమే నన్నా నమ్మకమేమిటి?" అన్నాను.

"నమ్మకం కావాలా...ఇవిగో ఈ ఫొటోలు చూడండి. ఈ వూళ్ళో మేము ఉండగా తీయించుకున్నవి. ఇవి నేనూ శేషగిరీ తీయించుకున్నవి." అన్నది.

ఆ బుడ్డి దీపందగ్గర ఆ ఫొటోలు ఏమిటో ఎట్లా తెలుస్తుందీ? అని అనుమానిస్తుండగా ఆమె ఇట్లా అన్నది

"మీరు నా కొక్క సహాయం చేసి పెట్టాలి"

"నాకేమీ చేతకాదు."

"అవును. చేతకాదు. ప్రయత్నించి చూడండి. శేషగిరిరావు వూళ్ళోకి వస్తే ఈ ఫొటో అతనికి చూపించండి."

"చూపించితే యేమిటి లాభం?"

"నన్ను ఇంత అన్యాయం చేసినవాణ్ణి రోడ్డుమీదకు ఈడ్చి..."

"మీ ఆలోచన ఏడ్చినట్లుంది. ఇంతవరకు జరిగింది చాలదా?" అన్నాను.

"చాలదు. నేను ఇంకా పాడయిపోయేదేమున్నదీ? తల్లిదండ్రులకు దూరమయినాను. మానం అమ్ముకొని బ్రతకవలసిన దుర్దశ పట్టింది. ఇదంతా నాఖర్మం. సరే మీరు వెళ్ళండి. నా తంటాలు నేను పడతాను. కాని, శేషగిరిని మాత్రం వదలను."

"శేషగిరి నీకు చేసిన అపకారం గొప్పదా? సుధీర్ కంటే ఎక్కువ అన్యాయం చేశాడా" అన్నాను.

"అసలు వాడు దొరకడు. ఇప్పటికి ఎంతమంది ఆడవాళ్లనో ఈవిధంగా వాడు పాడుచేశాడు. వాడి సంగతి పోలీసువాళ్లు చూస్తారు. సరే ఇక మీరు వెళ్లండి. నేనే శేషగిరి ఆరా తీసి పగ తీర్చుకుంటాను. ఇంతసేపు మిమ్మల్ని అవస్థ పెట్టినందుకు క్షమించండి" అన్నది.

గుడిసెనుంచి బయటపడి రోడ్డున బడ్డాను. ఇదంతా నిజమా??...... ★

"రెండు రూపాయిలు"

కామేశం: పక్కింటావిడ్ని అడిగి రెండు రూపాయిలు పట్రా. సాయంత్రం బజారు వెళ్ళాలి.

కాంతం: పక్కింటావిడంటే, మీ ఉద్దేశం ఆవిడ ఇనప్పెట్టనుకున్నారేవిటి తెలియక అడుగుతాను. నే వెళ్లను సుమండీ! చీటికీ మాటికీ చేతులు చాపటం అంటే చచ్చే అభిమానం నాకు.

కామేశం: సరే బాగుంది! ఏం చేస్తాం? ఒకసారి కాకపోతే - పదిసార్లు తిరగాలి. మన అవసరం. నేను పుట్టించటంలా పాలికో పరకో - నిన్నమటుకు నిన్న, ఆ వెధవ గోవిందంగాడ్ని - ఎవడు? కానీకి కక్కుర్తిపడే రకం; అటువంటి వాడ్ని, ఆ ఏబ్రాసిని మాటలతో ములగ చెట్టెక్కించేశాను. అబ్బే! అంతలో లొంగే ఘటంగా కనిపించలేదు. జేబులో ఉన్న అర్థరూపాయి పెట్టుబడితో కాఫీ హోటల్లో మెక్కబెడితేగాని ఆ యిదు రూపాయిలివ్వటానికి హడిలి ఆకాశం చూశాడు! అదే నేనైతే విసిరి అవతల పారేసేవాడ్ని. అటువంటివాడ్ని అభిమానం చంపుకోగా లేంది... ఏది? నలుగురుమధ్య తిరిగేవాడ్ని, ఇంట్లో పడుండేదానివి నీకెందుకే పాడు అభిమానం. దాన్ని చంపెయ్యి అటువంటివి పెట్టుకుంటే సుఖం ఆమడ దూరానికి తప్పుకుంటుంది జీవితంలో. జాగ్రత్త! (గొణుక్కుంటూ) అభిమానంట అభిమానం! ప్రపంచజ్ఞానం బొత్తిగా శూన్యం. జీవితం అంటే అమ్మ నాన్నతో గారాలు పోవటం అనుకుంటోంది, ఏమున్నా లేకపోయినా ఇది మాత్రం పోవదు!

కాం: ఇదిగో ఆ గొణుగుడు వింటే నే ఒళ్లు రగులుకుపోతుంది. మనసులో లేదో ముఖాన్ని అనెయ్యరాదూ!

కా: ఏం, అవసరముంది అడిగానో, ఎందుకడిగానో అని ఆలోచించటం పోయింది. 'ఒళ్లు మండుకుపోతుందిట!' వెళ్లి పట్రావన్నందుకు వాగిస్తావు అనవసరంగా.

కాం: నే పట్రాను. నిన్ననే రూపాయివ్వటానికి గునిసిందావిడ. ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ వెళ్లటం?

కా: నిన్న ఈ ముఖం పెట్టుకునే వెళ్ళివట్టున్నావు అందుకనే గునిసింది. ఇవాళ కోటింగుమీద కోటింగు పౌడరు కొట్టి మరీ వెళ్ళు. పెట్టెలో పెద్దాపురం పట్టుచీర కట్టుకువెళ్లు.

అసలు అప్పుచెయ్యటానికి ఓ పద్ధతి విధానం అంటూ ఏడిశాయి. నీకవి బొత్తిగా తెలియవు. ఓ చిన్న రహస్యం చెబుతాను చూడు. ఉదయం పూట అప్పుకంటూ వెళ్లకూడదు. ఎందుకల్లంటే అది ఆవిడ వంట చేసుకునే సమయం. ఓ పక్కనించి స్కూళ్ళకెళ్ళేవాళ్ళూ, ఆఫీసుల కెళ్ళే వాళ్ళు కంగారు పెట్టే సమయం అది. ఆవిడా క్షణంలో మహాంకాళిలా ఏనుగంత బలం తెచ్చుకుని, ఓపిగ్గా ఎంత విసుగుపాటు అతి ప్రయత్నం మీద అణచుకుంటూ ఎక్కడి వాళ్ళనక్కడికి సాగనంపే సమయం అది.

పురాణం సూర్యప్రకాశరావ్

ఏ ఒంటిగంటకో ఇంటిల్లిపాదీ భోంచేసిం తర్వాత తను నాలుగు మెతుకులు కతికి ఎంగిళ్లు ఏమార్లు ఎత్తుకుని ఓ నిద్ర తీసిం తర్వాతగాని ఆమె కుదుటబడదు.

కాం: (చిరాగ్గా) ఏవిటీ ఉపోద్ఘాతం.

కా: చెప్తాను విను మరి. ఉపోద్ఘాతం ఏంఖర్మం పెద్ద గ్రంథం రాయాలనుకుంటున్నాను.

కాం: దేన్ని గురించి? అప్పెలా చెయ్యాలన్న దాన్ని గురించేనా?

కా: ఆఁ! ఆఁ! దాన్ని గురించే. రెండొందల పేజీల గ్రంథం తయారవుతుంది. ఖరీదు చాలా అందుబాటులో ఉండాలి లేకుంటే నలుగురూ చదువుకునే అవకాశం ఉండదు. వెధవది రొడ్డావునే ఉంది కాని తీరికెక్కడేడిసింది.

కాం: రాయండి! రాయండి! దేశసేవ చేసినట్టవుతుంది.

కా: ఇంకా సెటైరిగా అంటావేవిటి? దేశసేవ కాదు మరి. ఎంతసేపు పేదవాళ్లను ఉద్రేకపరిచి ఊహాలోకాల్లో తిప్పి పారేసిన రచయితలున్నారు గాని వాళ్ళకో మార్గం చూపించిన వాళ్లేరీ? ఇన్నాళ్ళకీ లోకోద్ధారకుడు ఉద్భవించాడు గాని.

కాం: అవునవును ఇంతవరకెవ్వరూ లేరనే చెప్పాలి.

కా: లేరు కాబట్టే మనం కలం పట్టాల్సిన అవసరం ఒచ్చింది. అవసరం ఒచ్చింది కాబట్టే మనం పేరు ప్రతిష్ఠలు సంపాదించుకునే అవకాశం లభించింది.

కాం: ఆలస్యం అమృతం విషం అన్నారు. కాబట్టి వెంటనే రచన ఉపక్రమించండి.

కా: అవును. లేకుంటే కొంప మునిగిపోతుంది. వెధవ ప్రపంచం రోజురోజుకీ మారిపోతోంది. రోజుకో కొత్త రకం సాహిత్యం దిగుతోంది ఏ కుంకాక్షికన్నా తనకు తట్టిన ఐడియాయే బుర్రలో మెరిస్తే కాగితాలన్నీ గిలికి పారేస్తాడు. అప్పుడు మన వీక ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలి. ఏమంటావు.


కాం: అదే నేనూ అనబోతున్నాను. దానివల్ల కొంత రాబడికూడా ఉంటుంది.

కా: నువ్వు పొరబడుతున్నావ్, ఈ ప్రయత్నంలో ఆర్థికంగా నష్టపోయినా నేను విచారించేది లేదు. దేశానికి అందులో ముఖ్యంగా పేదజనానికి ఎంత ఉపయోగిస్తుందో చూడు. మనక్కావల్సింది అదే.

కాం: పెట్టుబడిదార్ల స్వలాభాలూ, స్వార్థాలూ, వాళ్ల నిరంకుశత్వం మీకు బాగా అనుభవం కాబట్టి మీ రచన అద్భుతంగా ఉంటుంది. చాలా ఉపయోగిస్తుంది.

కా: వాళ్ల స్వార్థం, స్వలాభం గురించి వర్ణించటం కాదు నా రచనోద్దేశం. విభిన్న తత్వాలుగల వ్యక్తులదగ్గిర ఎలా మసులుకోవాలి? ఎలా మసులుకుంటే మన అవసరం గడుస్తుంది. ఇంతవరకే ఆపైన మనకి అనవసరం. వాళ్లెలా ఏడుస్తే ఎవరికి కావాలి?

కాం: ఉదాహరణకి ఒక రకం మనస్తత్వం గల వ్యక్తులతో ఎలా మసులుకోవాలో టూకీగా చెప్పండి. వింటాను.



అగ్నిదేవుడు (భువనేశ్వర్)
—ఫొటో : సుబ్బేశ్వరరావు, (అగ్రహార్)

★ "రెండు రూపాయిలు" ★

కా: ఇప్పుడు మన పక్కింటావిడ్ని తీసుకో.

కాం: (హఠాత్తుగా) కొంపదీసి ఆవిడతోనే మొదలుపెడతారేవిటి గ్రంథం. ఆవిడ పూర్వసువాసిని. అమంగళం!

కా: నీ ముఖం. ఆవిడ పునిస్త్రీ అయితే ఎవరికి కావాలి. పూర్వసువాసిని అయితే ఎవరికి కావాలి. ఆవిడ మన సర్వం ఎలాంటిదో తెలియచెయ్యటానికే మన కథ. ఆవిడకి తెల్లవారి లేచింది లాగాయతు రాత్రి నిద్ర పోయేంతవరకూ క్షణం తీరికుండదు. ఏ నిముషంలో చూసినా శ్రమిస్తూనే వుంటుంది. మహా కష్టజీవి. అయితే ఆవిడదగ్గర చచ్చేటంత డబ్బు ఇనప్పెట్టెలో మూలుగుతోంది. సాయంత్రం ఏ అయిదింటికో పొయ్యిమీద బియ్యంపడేసి నీబోటివారితో పిచ్చాపాటీ వేసుకుంటే సాయకాలాన్ని గడ్పించుకుంటుంది. ఇంతగా ఆవిడ కష్టపడుతున్నా ఆ కుటుంబంలో ఆమె కివ్వాల్సినంత గౌరవం వాళ్లు ఇవ్వటంలేదు. ఆ విషయం ఆవిడకు తెలుసు. అప్పుడప్పుడు ఆవిడ దీనచరిత్ర నీదగ్గర వెళ్లబోసుకుంటుంది కూడాను. అటువంటి సమయం ఏది? ఆవిడ వ్యథిత హృదయం నీముందు విప్పుతుంది చూశావూ. ఆ సమయం ఎంత అమూల్యమయింది మనబోటివారికి. అటువంటి అమూల్యావకాశాన్ని వినియోగించుకునే తెలివితేటలు ఈ నెంబరు టూ (2) నిర్భాగ్యుడికి అవసరం. ఆ సందర్భంలో ఆ హృదయవిదారకమైన దీన చరిత్రకు తనెంతో కలత చెందినట్టు, తన హృదయమంతా సానుభూతితో నిండిపోయినట్టు, సాధ్యమైనంతవరకూ జాలి నటిస్తూ, అవసరంకొద్దీ అడపా తడపా కళ్లు తడి చేసుకుంటూ ఆమెను అనునయించాలి. ఈ ఉపశమన వాక్యాలూ, మనం చూపే సానుభూతితో ఆమెలో మనం కాంక్షించే ఆదరాభిమానాల్ని పొందగలుగుతాం. ఈవిధంగా కొంత సన్నిహితత్వం పెరుగుతుంది. సాధారణంగా అటువంటి వాళ్లు ఎదుటివాళ్ళకి చేతనయినంత సహాయాన్ని చెయ్యటానికి వెనకాడరు. ఎందువల్లనంటే సానుభూతికీ, ఆప్యాయతకీ ముఖం వాచిపోయినవాళ్లు మనకి అర్థంచేదానికన్న మనం చూపే బూటకపు నటనకే ఎక్కువ విలువిస్తారు. కాబట్టి ఆమాత్రం సహాయానికి వాళ్లు విముఖత ప్రదర్శించరు.

కాం: అబ్బ! మీకెంత లోకానుభవం ఉందండీ. నాకు తెలియనే తెలియదు. అయితే నాకొక సందేహం పట్టుకుంది. అలా నటించటం లేనిపోని సానుభూతిని ప్రదర్శించటం పాపం కదండీ.

కా: పాపమేమిటి ఒక విధంగా ఆత్మవంచన కూడాను. అయినా సరే గత్యంతరం లేనప్పుడు ఎన్ని బురఖాలన్నా తగిలించుకోవాలి. ఇదేమిటి? ప్రపంచం! అందులో నవీన ప్రపంచం. మునుపట్లా ఇప్పుడు నైతిక విలువలు లేవు. ధర్మం నశించింది. పూర్వం అసత్యమాడటానికి అంతరాత్మ ఎదురు తిరుగుతే హరిశ్చంద్రుడు భార్యాబిడ్డల్ని సహితం దూరం చేసుకోడానికి వెనకాడలేదు! పితృవాక్య పరిపాలనార్థం రాముడు పధ్నాలుగేళ్లు వనవాసం చేశాడు! ఆ సత్యసంధత, పితృవాక్య పరిపాలన నిజానికి మెచ్చుకోదగినవే అనుకో. అయితే ఆ రోజులు వేరు. ఇది కలియుగం. ఈ యుగధర్మాలే వేరు. తప్పులేదు. ముందు కడుపునిండాలి. నువ్వు స్వార్థం అను సంకుచితత్వం అను. గత్యంతరం లేనప్పుడు స్వార్థానికీ, సంకుచితత్వానికీ పరిధులు పెంచించుకు పోతాం. వాటి నిర్వచనాలే

మారిపోతాయి. తెలుసా! ఏవిటను కున్నావో.

కాం: మీ ధోరణి చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తోంది.

కా. అవును మరి కాబోయే మొగుడంటే వీ డెవడో భవ్యాగాడు కాబోలురా అని విచారించి ఉంటావు మనపెళ్లి జరగక ముందు. నే నెవరనుకున్నావు. నివురు గప్పిన నెఋసును, మసిపూసిన మాణిక్యాన్ని, పేటి కాంతర్గత రత్నాన్ని నేను ప్రకాశిస్తే లోకం కళ్లు మిరిమిట్లు గొలుపుతాయి. ఎందుకు అనవసరంగా అని ఊరుకుంటున్నాను. నా నిజస్వరూపం ఇప్పుడు నీకు బోధపడిఉంటుంది. నువ్వు ఆశ్చర్యపడ్డంలో ఆశ్చర్యం ఏమీలేదు. (క్షణం ఆగి) ఇప్పుడు చెప్పిందంతా ఒక తరహా వ్యక్తుల్ని గురించి. ఇలా అనేక రకాల మనస్తత్వాలు గల వ్యక్తులుంటారు. మనిషికి మేధస్సుండాలి గాని ప్రపంచాన్ని గుప్పిట్లో అమర్చుకో లేక పోతాడా?

కాం: ఇవ్వాళ మంచిరోజు. ఇవ్వాళే మొదలు పెట్టండి రాయటం.

కా: మంచిరోజేవిటి? ఏరోజు మంచిది కాదు? ఇటువంటి ముసలమ్మ కబుర్లు నా దగ్గిర చెప్పకు. మంచి చెడుగు అన్నది మన మనసుకు సంబంధించినవిషయం. అది కాలానికి ఆపాదించటం మానవుడి దుర్బలత.

కాం: మాటవరసకి అలా అంటారు గాని నిజంగా కాలం మంచిది కాదనా?

కా: కాదు. కాదు. ఇలాటి అభిప్రాయాలు పెట్టుకుని మొక్కుబడులూ, పూజలూ, పునస్కారాలూ, చేస్తూంటే వాళ్ళు అనేకమంది ఉన్నారు. మాధనమ్మ కాలున్న వ్యక్తులు ఇలాటి బూజుపట్టిన సిద్ధాంతాలతో ఏదో హంగామా చేసి తృప్తి పడుతూంటారు. కాదంటే మీదపడి కరుస్తారు. ఇలా తప్పదారి తొక్కి ఎంత భారీ రక మానసిక శ్రమకన్నా ఓర్చి ఎంతెంత డబ్బుని బూడిదలో పొయ్యటానికైనా వెన కాడరు. ఈ ప్రపంచం ఎప్పటికి మారుతుందో కదా?

కాం: ఇంకెంత కాలమో పట్టదులెండి. మీబోటి వ్యక్తులు రంగంలోకి దూకింతర్వాత ప్రపంచం రంగు మార్చుకుంటుంది.

కా: అధవా మారకపోతే సమాజంలో మానవుడికి సృజనాత్మక శక్తి, స్వయం భరితత్వం లేవన్నమాట. అతడ్ని అగోచరమైన శక్తికి కీలుబొమ్మగా అంగీకరించాల్సి వస్తుంది. అలా ఒప్పుకోను. మానవుడు సాధించలేని దేవిటి? ఈ ప్రపంచంలో ఈ నాగరికత, ఈ హృద్యమయిన సౌందర్యాన్నీ ఎవరు సృష్టించారు. ఈ మేడలూ, మిద్దెలూ...ఇదంతా సృష్టిలో మానవత్వానికున్న ఆధిక్యతని బుజువు చేస్తాయి. కొన్ని కోట్లమంది ప్రాణుల్ని తెగలు తెగలుగా విభజించి వీరందరికీ కూడూగుడ్డా సుఖం, శాంతిలభించటంకోసం పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, సంస్కృతి దృష్ట్యా రాజ్యాంగా చట్టాలు ఏర్పాటు చేసుకునే మేధాశక్తి మానవుడిలో సృజనాత్మక శక్తికి మనకు కనుపించే ప్రత్యక్ష నిదర్శనం. ఓహో! అటువంటి శక్తి సంపన్నుడికి ఈ చిన్నమార్పు అసాధ్యమవుతుందా? అలా ఎప్పటికీ కాదు.

కాం: అయితే మరెప్పుడు ఆరంభిస్తారు?

కా: (ఆవేశంగా) రాస్తాను. వీలైనంత త్వరలో రాయాలని ఉంది. నా జీవితాన్ని పేదలకి అంకితం చేశాను. నా రచనలు కూడా వారికే అంకితం చేస్తాను. శ్లేష్మంలో ఈగల్లా కొట్టుకుంటున్న వారికి మార్గం చూపిస్తాను.

కాం: ఇంతకీ గ్రంధానికి ఏం పేరుపెడతారు? అది చెప్పారు కాదు.

కా: నిజమే నువ్వు చెప్పింది. గ్రంధ రచనంతా ఓ ఎత్తు. పేరుపెట్టటం ఓ ఎత్తు. రచయిత సామర్థ్యం అంతా అక్కడే తేలిపోతుంది; కాబట్టి బాగా ఆలోచించాలి.

కాం: 'శ్లేష్మంలో ఈగలు'ని పెట్టండి.

కా: ఛా! ఛా! అసహ్యం! సందర్భం ఉండొద్దూ? ఔచిత్యం గమనించాలి. ఈనాడు రచయితల్ని అనేకమందిని చూస్తున్నాను. చెప్పేవిషయం దారివేరూ; దానికి పెట్టేపేరూ వేరు. రెంటికీ అతకటం లేదు. పేరుపెట్టటం అంటే మాటలా? ఇందాక చెప్పలా రచయిత సామర్థ్యం అంతా అక్కడే తేలిపోతుందని. సరే ప్రస్తుతానికి మన గ్రంధానికి నామకరణం చెయ్యటం విషయం ఆలోచిద్దాం. మన గ్రంధం ద్వారా ప్రపంచానికి కలిగే ప్రయోజనం ఏవిటి? బుణాలు చెయ్యటంలో ప్రదర్శించవలసిన బుద్ధికుశలత, నేర్పు. అందులో విభిన్నతత్వాలుగల వ్యక్తులనిబట్టి ఈ నటన ఎలా మార్చుకోవాలి? ఇదీ విషయం.

కాం: (అడ్డువస్తూ) అడగటం మరిచాను. అప్పు లెలా పుట్టించాలో రాస్తానన్నారు. బాగానే వుంది. చేసిన అప్పుల్ని తీర్చటం ఎలాగో సెలవిచ్చారు కాదు. అప్పుడుగాని మీ కృషి పూర్తిగా సఫలం కాదు.

కా: అని పిచ్చిదానా! అయితే నన్ను త్రిదద్దమ్మకింద కట్టేశావన్నమాట! గ్రంధం పూర్తిచేసి అడుగున రెండవభాగం త్వరలో రానున్నది. మీ కాపీ రిజర్వు చేసుకోండి! అని బ్లాక్ లెటర్సులో రాసెయ్యటమే. అప్పటికి గాని ఈ రచనోద్దేశంయొక్క పూర్తిప్రయోజనం ఉండదు. ఇప్పుడు మనం రాసేది మొదటి భాగం మటుకే.

కాం: ఓహో అలాగా! అక్కడితో మీరు బుజం దులుపుకోవచ్చు.

కా: కాదు మరి! సమయం చిక్కాలి. తీరికుండాలి. కాగితంమీద కలం పెట్టానంటే దాని దారి దానిదే. మరింక ఆగమన్నా ఆగదు. అన్నట్టు మరిచాను. ఆరు దాటిందే. ఇప్పుడింకేం బజారు గాని అలా షికారు వెళ్ళొస్తాను. ఇప్పుడే పక్కింటావిడ తీరిగ్గా ఉంటుంది వెళ్లి పట్రా. ఇందాక నే చెప్పిందంతా విన్నావుగా. జ్ఞాపకం ఉంచుకో. బజారు రేపు ఉదయం వెళ్తాలే. * * *

కా: ఏం? అడిగావా?

కాం: ఆ! మీరు చెప్పినట్టే తు. చ. తప్పకుండా నా సొంత తెలివి కూడా జోడించి మరీ నటించాను ఆవిడ కష్టసుఖాలు వెళ్లబోసుకుంటుంటే ఎప్పుడూ లేంది. కళ్లనీళ్లు కూడా కార్చాను. అబ్బ! పేగులు తెగిపోయాయి సుమండీ...ఇదిగో ఈ చీర చూడండి.

కా: ఆఁ!! అదేవిటి దాన్నిండా ఆ మరక లేవిటి?

కాం: ఆవిడ మనవడు ఏడుస్తుంటే ఎత్తుకుని ఆడించబోయాను చందమామ వేపు చూస్తూ చేతులాడిస్తూనే ఉచ్చ పోసేశాడు భడవ. పట్టుచీర తడపటానికి వీల్లేదు. లేకుంటే పాడు దుర్వాసన.

కా: (ఆదుర్దాగా) ఇంతకీ పర్యవసానం ఏమయింది?

కాం: ఏముంది. బావిదగ్గర్నుంచి రెండు బిందెల నీళ్లు కూడా మోసుకొచ్చాను. ఆ వెధవ బావి ఓమూల ఏడవకపోతే అందు బాటులో తీయించుకోరూ? ఆ లంకంత పెరడు ఊడ్చేసరికి రెక్కలు ముక్కలయిపోయాయి

కా: అయితే చాలా మెలుకువగా వ్యవహరించావన్న మాట. ఇంతకీ మన పాచిక పారిందందూ.

కాం: (విసుగ్గా) ఆఁ! పారాలి. ఏవిటి పారేది!

కా: ఆఁ! ఆఁ! అదేవిటి అలా చప్పరించేశావ్.

కాం: కాకపోతే?


కా: ఇంతకీ అవి తేమంకొ త్వరగా విడు.

కాం: చీటికీ మాటికీ ఇలా చేబదుళ్ళకంటూ ఓ స్త్రీ మర్యాద దక్కదంటి.


కా: అని దీని కడుపుడక!

కాం: ఇదివరకు తీసుకున్న బాపతు పాతబాకీ పదిహేను రూపాయిలూ రెండురోజుల గడువులో తీర్చకపోతే నానా అల్లరి చేస్తానంది.


కా: దిబ్బ్రైనా బాబు! రేపటికి బియ్యం నిండుకున్నాయి. ఎలాగరా దేవుడా?! ★



ఫొటో : వి. వి. యస్. శంకరబాబు (మద్రాసు)



మరుగుల పరుగులు



ఫోటో : ఏ. శివరామరాజు (మద్రాసు)

★ పెద్దలమాట ★

శ్రీనివాస కాశ్యప

పేటేరను ఒక
గ్రామంలో
పేరయ్యను వా
డున్నాడూ -
బల్లకట్టుపై
దాటిస్తూ
చిల్లర సం
పాదిస్తాడూ!
కొంతకాల
మిట్లు గడువగ
కొడుకుతో అత
డిట్లన్నాడు:
"ముసలితనము
నన్నావరించె ఇక
చేయలేనురా
ఈవృత్తి! -
కావున నీవి
బాధ్యతలన్ని
కడకంటా వహిం
చాలి -
బుద్ధిగలిగి ఈ
వృత్తిని నీవూ
శ్రద్ధతో సార
చేర్చాలిసుమా!
బల్లకట్టు దా
టించేటప్పుడు
బ్రాహ్మడు, కోతి
చీపురుకట్టలు
పాములబుట్టా
ఒక్కమారుగా
ఎక్కించకురా
అబ్బాయీ!!"
అని అతడు తన
పుత్రకుమారున
కప్పగింత పెట్టేశాడూ!

* * *

అట్లేయని కొడు
కానందముతో
తండ్రిమాట తల
దాల్చాడూ!

* *

ఒక్కరోజునా
ఏరుదాటుటకు
బ్రాహ్మణయువకుడు
వచ్చాడూ!
కోతితో ఆడే
గారడివాడూ
పాములబుట్టతో
వచ్చాడూ!!
కొంతసేపటికి
చీపురుకట్టలు
అమ్మే ఎరుకది
వచ్చిందీ! -
అందరినీ ఎక్కిం
చక తప్పక
పోని లెమ్మని
ఎక్కించాడూ!
బల్లకట్టు నది
నట్టనడానికి
కొంతసేపటికి
చేరిందీ! -
ఉబుసుపోక ఆ
బ్రాహ్మణ యువకుడు
చీపురుకట్టతో
పుల్లను లాగి
కోతిని పొల్లగ
పొడిచాడూ!!
కోపముతో కో
తొక్కగంతునా
పాముల బుట్టను
తన్నిందీ!! -
బుట్ట తెరచుకొని
బుసలు కొట్టుతూ
పాము బయటకు
వచ్చిందీ!!!
పామును చూచీ
పరుగున అందరు
ఒక్కచోటుకే
చేరేరూ!
బరువు అంత ఒక
చోట చేరగా
బల్లకట్టు మున
గేసిందీ!!

* * *

ఆదిలో తండ్రి
అన్నమాటలను
అతడు తలచుచు
మునిగేడూ!
పెద్దలమాటను
పెడచెవిబెట్టి
మరణమునకు
గురి అయ్యాడూ!!



కర్పూరద్వీపయాత్ర

(బొమ్మరిల్లు సీరియల్) నోరి నరసింహశాస్త్రి

37

ఉపన్యాసము విసుగైందా? ముందు కథకోసము చెప్పక తప్పలేదు.

మనవాళ్ళకు తెలిసిన ఈ సూత్రం ఇతరదేశాలవాళ్లకు తెలియలేదు. వాళ్లు అర్థాలూ కామాలూ పెంచుకొని పెంచుకొని దుక్క బలిశారు. యవనకులు శకులు హూణులు మనదేశంమీద పడ్డారు. సరిగ్గా అప్పుడు మనదేశంలోకూడా ధర్మంమీద అభిమానము కుంటువడ్డది. దాన్ని రక్షించుకోటానికి కావలసిన అర్థము సిద్ధం చేసుకోలేదు. ధర్మాభిమానము పోగానే పిరికిదనం ఎక్కువయింది. విజాతీయులు మనలను జయించేశారు.

ఒక్క దేశాన్నే జయించినా ఫరవాలేకపోను. నెమ్మదినెమ్మదిగా దేశంలో ధర్మంమీద ఉన్న శాస్త్ర అభిమానమూ తగ్గితగ్గిపోయేట్లు చేశారు. ఋషుల ధర్మసూత్రాలమీద విశ్వాసం పెకలించారు. తమకువలెనే అర్థకామాలమీద వ్యామోహం పెంచేశారు.

అందువల్ల మన కోరికలు పెరిగినై. అవి తీర్చుకునే డబ్బూ లేదు. పండించిన పంట శాస్త్రా సంపాదించిన శాస్త్ర డబ్బూ, విదేశాలకు వాళ్లు ఒడుక్కుపోవడం సాగించారు. మాకు కోరిక లెక్కువ లేవనే ధీమా మనకు పోయింది. ఇంకొకరికి ఇది ఉన్నది అది ఉన్నది—మనకు ఇదిలేదు అదిలేదు—అని కుళ్లు మోతుతనంతో ఏడ్చుకొనే పిల్లల గతి పట్టింది.

తల్లిదండ్రులంటే ప్రేమా గౌరవమూ పోయినై. గురువులంటే గురిపోయింది. పెద్దల ఆచారాలంటే కట్టంటే జుట్టంటే బొట్టంటే ఏవగింపు బలిసింది.

ఇట్లా కొంతకాలం కుళ్లి కుమిలిపోగాపోగా మనదేశంలో జనానికి మొండితనం పుట్టుకు వచ్చింది. దానికి ముఖ్యమైన కారణము, భారతధర్మం మళ్ళా స్థాపించి మనదేశంలోనూ భూలోకమంతటా మళ్ళా శాంతి నెలకొనేట్లు చేయవలె నని దీక్షపట్టి ఆశ్రమాలలోనో మారుమూలలలోనో కొండలమీదనో ఏ కొద్దిమందో చేసినతపస్సే, మూలకారణమునుమా !

ఈ మొండితనం ఆవేశించిన దెబ్బను కలగూరగంప జనమొకటి పోగైంది. ఈ కలగూరగంప జనమంటే, అందులో ఏ కొద్దిమందో తప్ప, ఎక్కువభాగము అర్థమూ కామమూ కావలెననేవాళ్లే. వాళుం విదేశీయులను నానాతంటాలూ పెట్టారు. అల్లరులు చేశారు. ఆగాలు చేశారు. విదేశీయుల కిక ఇక్కడఉండడమ్ము లాభసాటికాకుండా చేసేశారు.

అదృష్టవశాత్తుగా దానికితోడు ఇంకొకటికూడా కలిసి వచ్చింది. ఇక్కడఉన్న విదేశీయులకు ఇతర విదేశీయులతో కొట్లాటలైనవి. అక్కడ తన్నులు తిన్నారు. బలం తగ్గింది. ఇక భరించలేక మనకెందుకు

★ కర్పూరద్వీపయాత్ర ★

వచ్చింది ఈ గొడవ అనుకుంటూ, ఒకనాటి అమావాస్య చీకటిరాత్రివేళ, మన దేశం వదిలేసి తలనిండా ముసుగుకప్పుకొని, బతుకు జీవుడా అంటూ, బయట పడ్డారు. అయితే పోతూపోతూ మన దేశాన్ని ముక్కలు ముక్కలు చేసి మరీ పోయినారు.

మన దేశం కోలాహలంగా పండగ చేసుకొన్నది.

ఇన్నాళ్లూ అల్లరి చేస్తున్న కలగూరగంప జనము ఇప్పుడు మన దేశంలో అధికారం చేయడ మారంభించారు. వీళ్లలో ధర్మముమీద నిష్ఠ ఉన్నవాళ్ళదగ్గరనుంచీ కామమే పరమ పురుషార్థము అనే వాళ్లదాకా అన్నిరకాలవాళ్లూ ఉన్నారు. అందుకనే కలగూర గంప మనుష్యులన్నాను. అందరికీ విదేశీయులను పంపేసివేయుడము కావలసిందే కనుక ఒక్కమాటమీద నిలబడగలిగారు.

విదేశీయులు వెళ్లంగానే ఒక చిక్కు ప్రారంభించింది. ఈ కలగూరగంపలో ధర్మము ప్రధానమని విశ్వాసమున్నవాళ్లు కొద్దిమందేగా! వాళ్ళ కిప్పుడు పలుకుబడి తగ్గిపోయింది. చివరకు వాళ్ళే అందులోనుంచి తప్పుకొని దూరంగా ఉండవలసిన అవస్థ వచ్చింది.

అర్థమూ కామమూ ప్రధానమనేవాళ్ళే హెచ్చుపెరిగి పోయినారు. పైగా వాళ్లు తాము తెస్తున్న అభివృద్ధికి, ఈ ధర్మము ప్రధానమనే తాతలూ అవ్వలూ, నిరోధం కలిగిస్తున్నారని తెగడడంకూడా ఆరంభించారు. వాళ్ళను అణచివేయాలెనని నానాహింసలూ పెట్టసాగినారు. ధర్మం ప్రధానమనే వాళ్లకు, దూరంగా ఇంట్లో ఉన్నా, వాళ్లకు అక్కడకూడా స్వాతంత్ర్యం లేకుండా పోయింది. పెళ్ళిచేసుకుంటే ఒక తప్పు. దేవుడికి నైవేద్యం పెడితే ఒకతప్పు. విదేశీయులు రాజ్యం చేసినప్పుడుకూడా వాళ్లకింత కడగండ్లు లేవు. అంత బాధపడుతున్నా వాళ్ళకు కోపం రాలేదు. పిల్లలుచేసేతప్పులుచూసి తల్లీ తండ్రీ ఏమనగలరు? ఎప్పుడో బాగుపడకపోతారా, బుద్ధిరాదా, అని మంచికాలంకోసము వాళ్లు ఎదురుచూస్తున్నారు. స్వర్గంలో నుంచి మరి కొంతమంది ఎప్పుడు దిగివస్తారా అని కాచుకొని ఉన్నారు.

భారతదేశంలో అర్థబల మెక్కువైంది. కోరికలు పెరిగినై. అంటే జీవనప్రమాణము పెరిగింది. కోరికలు పెరిగినకొద్దీ విజాతీయులప్రవృత్తే మనకూ పెరిగింది

ధర్మమనేది ఒకసూత్రము, ఒకతాడు, ఒక కట్టుబాటు! అది వదలిన అర్థమూ కామమూ ఏమవుతవి? కళ్లాలు వదలిన రెండు అడవిగుర్రాలవంటివవి. ఒకటి ఈకోటికి లాగితే, ఇంకోటి ఆకోటికి లాగుతుంది.

లోకం నిలవడానికి ధర్మము ప్రధానమని మొత్తుకున్న మహర్షులు పుట్టినదేశమైన మన దేశంలోనే ధర్మసూత్రము పట్టు సడలిపోతే, ఇక మిగిలిన దేశాల గతి ఏమనాలె?

పాపము పెరిగినట్లు అర్థమూ కామమూ పెరిగి లోకము దశదిక్కులకూ పరుగెత్తి పాకినై. రైళ్లు, మోటార్లు, స్టీమర్లు, జలాంతర్గాములు, ఆకాశవిమానాలు, ఫాక్టరీలు, ఫిరంగులు, బాంబులు పెరిగిపోయినై. ప్రపంచమే ఒక పెద్ద ఆటంబాంబు అనండి, హైడ్రోజను బాంబు అనండి,—ఐ కూచుంది.

మనిషికీ మనిషికీ, దేశానికీ దేశానికీ, జాతికీ జాతికీ, స్పర్థలు ద్వేషాలు పెరిగినై. అబద్ధమాడడము సర్వసామాన్యమైంది. అంతేకాదు. ఎంత బాగా అబద్ధమాడినానో చూచావా అని గప్పాలు కొట్టుకునేవాళ్లు ఎక్కువై పోయినారు. ఏమి కోరిక పుడితే అది తీర్చుకోవడమే స్వాతంత్ర్యమన్నారు. పులులకువలె, తోడేళ్ళకువలె, పొట్టేళ్ళకువలె, కోడిపుంజులకువలె—చివరకు ఎండిన ఎముకకోసము కొట్లాడే కుక్కలకువలె—పోట్లాటలు సాగినై.

ఏమున్నదీ?

బాంబుగా తయారైన లోకంలో క్రోధజ్వాల రగులుకొన్నది. ఇంకా ఏమున్నదీ?

బాంబు పేలింది.

ఢాం!

38

అయ్యయ్యో! ఇంతా ఏమనుకొని ఏమి లాభము? అనుకునేవాళ్ళే అరుదైనారు. లోకమంతా మహా శ్మశానమైనది. చెదురుగాతప్ప మనుష్యులే లేరు. బాంబుదెబ్బ సూటిగా తగలనివాళ్లుకూడా దాని విషపుగాలి తగిలి చచ్చిపోయినారు.

ఎక్కడో కొండలమీద ఉన్నవాళ్లూ మారుమూల అడవులలో తపస్సు చేసుకుంటూ దాక్కున్నవాళ్లూ చెదురుగా దూరపు లంకలలో ఉన్నవాళ్లూ మిగిలిపోయినారు.

పట్టణాలు తగలబడ్డవి. విమానాల రెక్కలు విరిగి కూలినై. స్టీమర్లు పగిలినై. రైళ్ళూ మోటార్లూ మూలపడ్డై. ఫాక్టరీలు పాడుపడ్డవి. ఆనకట్టలు తెగినై. దేశానికీ దేశానికీ సంబంధాలు విడిపోయినై. ఇటువంటి దాన్నే అవాంతరప్రళయమంటారు.

లోకంలో ఏడవనివాళ్లూ ఒక్కరన్నా లేరు. మనస్సులు కుంగిపోయినై. మనుష్యులకు ఉత్సాహం లేదు; ధైర్యంలేదు; సంతోషంలేదు. ప్రేమకూడా లేదు. లోకమే ఎండుకునిపోయింది

అన్నం లేకుండా, పోషించే తల్లీ తండ్రీ లేక, కట్టుకునేందుకు బట్టలేక, తలదాచుకునే ఇల్లులేక, నా అనే బంధుమిత్రులులేక, ఎముకల కంటుకొనిపోయినచర్మంతో, క్షీణించి మూలిగే ఓపికకూడా లేక, వీధిలోపడిఉన్న అనాథుడైన పిల్లవాణ్ణి ఎప్పుడన్నా చూశారా? అట్లా ఉన్నది ఈ లోకపుస్థితి!

మన దేశపుస్థితిమాత్రము?—అంతే.

మీకు జాలి కలగదూ? గుండె కరగదూ?

ఇదే చూసి ఆ కొండమీదఉన్న గోవు లెనిమిదింటికీ జాలి కలిగింది. వెంటనే అట్లా మనుష్య లోకంలోకి దిగేసినై.


భరతఖండంలో ఆ రాత్రి ఎనిమిది దిక్కులా ఎనిమిది పెద్ద చుక్కలు రాలినవని జనము ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. ఈ జ్యోతులు బాంబులలోనుంచి పడ్డ జ్యోతులవలె ఎర్రగా రూక్షంగా లేవు. ఇవి ఆర్ద్రంగా చంద్రమండలపు ముక్కలవలె పడ్డవి. వెన్నముద్దలు రాలినట్లు ఉన్నవి. అమృతపు తరకలు జారినట్లు ఉన్నవి. అవి పడుతుంటే దిక్కులన్నీ హాయిగా చల్లగా ఉన్నట్లయింది.

చూసినవాళ్ళకు గుండెలలో ఆశలు పుట్టుకు వచ్చినై. ఏమిఆశ? వాళ్ళకే తెలియదు. ధైర్యము పుట్టుకు వచ్చింది. ఉత్సాహం పుట్టుకువచ్చింది—ఐతే ఏమి చేయవలె?

మరోచిత్రంకూడా విన్నారా? ఆ రాత్రే కాదు. ఆమర్నాటినుంచీ రోజురోజూ రాత్రిళ్లు ఆకాశం వంక చూసినవాళ్ళకు చుక్కలు గుంపులు గుంపులుగా కిందికి రావడం కనిపించింది. చుక్కలు రాలడము కాదు, రావడమే. చక్కని చుక్కలు. చల్లని చుక్కలు. పాలపుంతలోనుంచి, పసిపాపలు నిచ్చెన మెట్లు దిగివస్తున్నట్లు దిగివస్తున్నవి. తెల్లటి చుక్కలు. ఎర్రటి చుక్కలు. పచ్చటి చుక్కలు. నీలపు చుక్కలు. రంగు రంగుల చుక్కలు. రకరకాల చుక్కలు. ముద్దుల చుక్కలు. మురిపాలచుక్కలు.

వాళ్లంతా ఎవరో తెలుసా? స్వర్గంలోనుంచి దిగివస్తున్నారు. ఈ భూదేవి చిన్నబోవడంచూసి జాలిపడి స్వర్గంలోనుంచి దిగివస్తున్నారు ఆ పుణ్యాత్ములు. వెనక విదేహ రాజు నరకంలో పాపిష్ఠులు బాధ పడుతుంటేనే చూసి జాలిపడ్డది జ్ఞాపకమున్నదిగా. ఆ విదేహ రాజువంటివాళ్ళే స్వర్గంలో ఇంకా ఎంగరెందరో ఉన్నారు. వాళ్ళకు మన భూలోకంలో ఉన్న జనులదైన్యంచూస్తే జాలి కలిగింది. వాళ్ళ మనస్సులు కరిగి నీరై, వెనక భగీరథుడు బతిమాలుకుంటే ఆకాశగంగ ఈలోకము ఉద్ధరించడానికి దిగివచ్చినట్లుగానే, వాళ్ళూ ఒక ఆకాశగంగాప్రవాహంగా దిగి వచ్చేస్తున్నారు.

అయితే, వాళ్లు ఎక్కడివాళ్లో గుర్తుపట్టారా? మన కథ మొదలు జ్ఞాపకముందా? కర్పూరద్వీపానికి



అందాలరాణి—1954   ఫోటో : వీరపనేని కుటుంబరావు (మద్రాసు)

★ కర్పూరద్వీపయాత్ర ★

నావ వచ్చినప్పుడు అక్కడి పిల్లలు అందులో చాలామంది ఎక్కివచ్చారు కాదూ ? వాళ్లలో ఎనిమిదిమంది కథేగా ఇంతవరకూ మనము చెప్పుకుంటూవచ్చింది! మరి మిగిలినవాళ్లో ?

వాళ్లూ ఈ లోకంలో ఎన్నో పుణ్యకార్యాలు చేశారు. కొద్దిగా పాపమంటే నరకం చూసుకొని స్వర్గానికి వెళ్లారు. ఇప్పుడు వాళ్లకు స్వర్గసుఖం చాలలేదనిపిస్తున్నది. ఎందుకంటే మళ్ళీ కర్పూరద్వీపము కొంచె కొంచెమే జ్ఞాపకానికి వస్తున్నది. స్వర్గంలో ప్రభుత్వము చేసే ఇంద్రుణ్ణీ ఇంద్రాణినీ చూడగా చూడగా వాళ్ళలో కర్పూరద్వీపంలో తమ అమ్మానాన్న పోలిక కొంత పొడకట్టింది.

వెంటనే వాళ్లు ఆ లోకపు తండ్రికీ తల్లికీ ప్రదక్షిణంచేసి మొక్కి— ఉత్సవంలో దూరుపడ్డ పిల్లవాడు దగ్గరకు తీసిన ధర్మాత్ములైన దంపతులను వేడుకొన్నట్లే— మా అమ్మా నాన్నా దగ్గరికి పంపండని ప్రార్థించారు.

ఇంద్రుడూ ఇంద్రాణీ వాళ్లను బుజ్జగించి ఇట్లా అన్నారు !

"నాయనలారా, అమ్మాయిల్లారా, మీకు కర్పూరద్వీపానికి తిరిగి పోవాలనని బుద్ధిపుట్టినందువల్ల ధన్యులైనారు. ఇక్కడినుంచి కర్పూరద్వీపానికి సరాసరి దారిలేదు. ఆ భూలోకంలో పుణ్యాత్ములైన అమ్మానాన్నల కడుపునపుట్టి లోకాన్ని ఉద్ధరించి జాగ్రత్తగా ప్రవర్తిస్తే, కొన్నాళ్లకు మీకే అక్కడినుంచి కర్పూరద్వీపానికి రెండే రెండు దారులు కనబడతై. మీకు ఏదిక ఉన్న దారిన చేరుకోవచ్చు !"

ఈ మాటలంటూ ఆ పురాణదంపతులు వాళ్లను ఆపేక్షతో దీవించి ఒక్కొక్కరికీ ఈ భూలోకంలో పుణ్యదంపతులను చూపిస్తున్నారు. ఆ చూపిన దారినే పాలపుంత మబ్బులోనుంచి బయటపడి వాళ్లు వచ్చేస్తున్నారు.

కర్పూరద్వీపం చేరుకోవలెనని వాళ్లకు తొందరగా ఉన్నది!

[ఇంకా వుంది]



మణిప్రాస జగన్నాధుడు

పూర్వం షాజహాన్ చక్రవర్తి భారతదేశాన్ని ఏలుతూన్న రోజుల్లో ఆంధ్రదేశంలో జగన్నాధుడు అనే సంస్కృత పండితుడు వుండేవాడు. అప్పట్లో పేరుపొందిన పండితుల్లో ఇతను ఒకడు. తన పాండిత్యాన్ని నోటితో వెల్లడించడమే గాక అనేక ఉద్గ్రంథాలు కూడా వ్రాశాడు. రసగంగాధరం, శృంగార శతకం, అనన్య శతకం మొదలైనవి ఆయన రచించినవే! ఇంతటి గొప్ప కవీశ్వరుడు ఆంధ్రుడు కావడం గొప్ప అదృష్టం!

జగన్నాధుడు ఎంతటి పండితుడో అంతజ్ఞాపక శక్తి కూడా అతనికి కలదు. ఎంత విషయాన్ని అయినా ఇట్టె గుర్తుంచుకునే వాడు.

షాజహాన్ చక్రవర్తికి సంస్కృతం అంటే బహుప్రీతి. సంస్కృత కవులను, పండితులను తన ఆస్థానమునకు పిలిపించి గౌరవించే వాడుట. ఆయన ఆస్థానంలో ఎల్లపుడూ సంస్కృత కవిసమ్మేళనం జరుగుతుండేది.

షాజహాన్ గురించి విన్న జగన్నాధుడు ఆయన్ను దర్శించాలని

ఇందిరాదేవి

ఢిల్లీకి బయల్దేరాడు ఒకరోజున అలవాటు ప్రకారం తలనిండా స్నానం చేయటానికిగాను యమునా నదికి వెళ్ళాడు. స్నానం చేస్తూ ఒడ్డున ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకోవడం చూశాడు. ఆ ఇద్దరు మహమ్మదీయులు. తురక భాషలో తిట్టుకుంటున్నారు తురక భాష జగన్నాధునికి తెలీదు. అయినా వింటూ తన పని తాను పూర్తిచేసుకున్నాడు.

షాజహాన్ ఆస్థానమునకు వెళ్లగానే అక్కడ మళ్ళీ ఆ ఇద్దర్ని చూశాడు. వాళ్ళిద్దరు రాజుతో ఫిర్యాదు చేసుకునేందుకు వచ్చారు. జగన్నాధుడు ఒక పక్కగా నిల్చుని అంతా చూస్తున్నాడు.

ఆ ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు జగన్నాధుణ్ణి చూసి, "నాకు సాక్ష్యం ఈ బ్రాహ్మణుడు" అన్నాడు తురక భాషలో.

షాజహాన్ చక్రవర్తి ఆ బ్రాహ్మణుని - అంటే జగన్నాధుని ముందుకు పిలిపించాడు. జగన్నాధునికి ఏమీ అర్థం కాలేదు. అంతా అగమ్యగోచరంగా వుంది.

"మీరు అనేది ఏమిటో నాకు అర్థం కాలేదు మహా ప్రభూ" అన్నాడు తెలుగు భాషలో.

అంతా గొల్లున నవ్వారు. పరిస్థితి అర్థంచేసుకున్నాడు చక్రవర్తి.

ఆస్థానంలో వున్న సంస్కృత పండితులకేగాని అందరకూ తెలీదుగా సంస్కృతం! షాజహాన్ సంస్కృతాభిలాషి అయినా ఆయనకుకూడ ఆ భాష బాగా తెలీదు.

సంస్కృతమూ, తురకమూ వచ్చిన ఒక పండితుని పిలిపించాడు.

"అసలుసంగతి ఏమిటి మహా ప్రభూ!" అన్నాడు జగన్నాధం.

"ఈ ఇద్దరూ క్రితం రోజు యమునానది ఒడ్డున పోట్లాడుకొంటూంటే మీరు చూశారుట! నిజమేనా?" అని అడిగాడు తర్జుమా వ్యక్తి, రాజుపక్షం వహించి

జగన్నాధుడు ఆ ఇద్దరువ్యక్తుల వైపు పరీక్షగా చూసి 'అవును' అన్నాడు "ఇతడు నిన్ను సాక్షిగా వేసుకున్నాడు! నీకు సమ్మతమేనా?"

"సమ్మతమే!" అన్నాడు జగన్నాధం.

"అయితే ఎవరు ఏమితిట్టారో, ముందు ఎవరుతిట్టారో చెప్పమంటున్నారు చక్రవర్తిగారు. ఉన్నది ఉన్నట్టుగా నివేదించు" అన్నాడు. తర్జుమా చేసే వ్యక్తి.


జగన్నాథునికి ఆశ్చర్యంవేసి ఒక చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు. "నవ్వుతా వెందుకూ?" అడిగాడు రాజు తరఫున.

"వాళ్లిద్దరి పోట్లాట, తిట్లూ విన్నాను గానీ, వాటి అర్థాలు నాకు తెలీవు! నాకు వచ్చినభాషలు తెలుగూ, సంస్కృతం మాత్రమే! ఎవరు ఏ మి తి ట్టిం ది ఎలా చెప్ప గలను?" అన్నాడు.

చక్రవర్తి చిక్కులో పడ్డాడు. "అయితే సాక్ష్యంలేని ఫిర్యాదు..." అంటూ ఏదో అనబోతుండగా, జగన్నాథుడు చటుక్కున అడ్డు వచ్చి "క్షమించాలి. భాష అర్థం గాకపోయినా, వాళ్ళు తిట్టుకున్న సంభాషణ చెప్తాను. దాన్నిబట్టి మీరు ఎవరు దోషో, ఎవరు నిర్దోషో నిర్ణయించండి!" అన్నాడు.

అందరకు ఆశ్చర్యంవేసింది. భాష రాకపోయినా సంభాషణ ఎలా గుర్తుంటుందా అనుకుని వింత పడ్డారు.

"సరే చెప్పు"అని ఆజ్ఞ రాగానే, జగన్నాథుడు ఎవరుముందు ఏం మాట్లాడారో, తరువాత రెండో



స్నానంచేస్తూ ఇద్దరు వ్యక్తులు ఒడ్డున పోట్లాడుకోడం చూశాడు జగన్నాథుడు.

వ్యక్తి ఏమి మాట్లాడాడో కంఠో పాఠం చేసినట్టు ఒప్పచెప్పాడు.

వింటున్న ప్రతివారికి నోటంట మాటరాలేదు. పోట్లాడుకున్న ఇద్దరూ నోరుతెరుచుకుని ఆశ్చర్యంగా వింటున్నారు!

ఒకటికి పదిసార్లు పాఠాలు రుబ్బే మనకు రెండు వాక్యాలయినా గుర్తుండదు కదా! అందులో పోట్లాటసంభాషణ అంత గొప్పగా గుర్తుపెట్టుకున్నాడూ అంటే ఆ జగన్నాథుడు ఎంత గొప్పవ్యక్తో ఆలోచించండి. జగన్నాథుడు వినాలని ఆ ఇద్దరూ తిట్టుకోలేదుకదా.

ఫోనురికార్డు పెట్టినట్టు తమ సంభాషణ ఒప్పచెప్పాంటే ఇద్దరూ సిగ్గుతో తలొంచుకుని వాళ్లలో వాళ్లు రాజీపడ్డారు తరువాత.

షాజహాన్ తను పాలిస్తూన్న రాజ్యంలో అలాంటి గొప్ప పండితుడు వున్నందుకు ఆనందభరితుడై తన కొలువులో వుండమని అభ్యర్థించాడు. "వచ్చిందే మీ దర్శనానికి!" అన్నాడు జగన్నాథుడు. ఆయన్ను సకల విధాల గౌరవించాడు చక్రవర్తి షాజహాన్!

ఇలాంటి జగన్నాథుడు తెలుగుతల్లి కంఠహారంలో మణిపూస.

టాయిలెట్ సోప్

దొంతంసెట్టి వీరభద్రరావు

సాయంత్రం స్కూలునుండి యింటికి వచ్చేసరికి లోపలి నుండి అమ్మ కేకలు వినిపిస్తున్నాయి.

"అబ్బబ్బ! యింకెలాగ వేగేది బాబూ యీ యింట్లో వాళ్ళతో. ఇప్పుడు కనిపించిన వస్తువు మళ్ళీ క్షణాని కేమవుతుందో తెలియదు. అయినా మిమ్మల్ని అనవలసిన పనే ముంది. ఇదంతా నా కర్మ. ఆ రేళ్లు వచ్చినా, ఆ కిష్టిగాడికి కొంచెం భయం చెప్పి బడికి పంపించమంటే ఆయనకు చీమ కుట్టినంతైనా లేదు. ఆ పార్వతి మరీ 'రాలుగాయ' అయింది. కొంచెం 'అంట్లు పట్టుకెళ్ళి కుళాయిదగ్గర పెయ్యవే' అంటే నసేమిరా వినకుండా ఆ కిష్టిగాడి వెనక్కి పోయి దాక్కుంటుంది, మహా వాడేదో రక్షించేలాగున... అబ్బబ్బ! ఈ కొంపలో నేను కాబట్టి ఎలాగో నెట్టుకొస్తున్నానుగాని మరొకరైతే....."

పుస్తకాలు డ్రాయర్లో పడేసి నేను, దగ్గరకెళ్ళి "ఏమిటే అమ్మా అసలేం జరిగింది? అయినా యీ మధ్య నీవు మరీ..." అంటూపోయే సరికి.

"ఆఁ, అంతా చెప్పొచ్చావ్లే! ఏం, నువ్వు మాత్రం తక్కువ తిన్నావా నాయనా? అయ్యో! యిప్పుడైతే హైస్కూల్లో చేరి బుద్ధిమంతుడివయ్యావనుకుని గర్వపడుతున్నావేమో, మొన్నటిదాకా జాడీలూ - కుండలూ బద్దలు కొట్టినవాడివేగా." అంటూ నాకే ఎసరు పెట్టింది.

ఇక ఆ స్టేషన్లో ఉంటే గౌరవం దక్కదని (అసలాటకొస్తే మా అమ్మ నాకు, ఆ స్థాయిలో వున్న మరెవరైనా నాగరే పలుకరిస్తే, ఆ స్థాయిని మరీ ఉచ్చదశలోనికి మార్చడానికి తోడ్పడుతుందే కాని, తేకపైనా ప్రశమింపచేయదు) కుళాయిదగ్గర కెళ్ళి కాళ్లు, చేతులు - ముఖం శుభ్రంగా కడుక్కొని, తువాలు చేతబట్టి, అసలు విషయ మేమిటో తెలుసుకుందామని అక్కయ్యదగ్గరకు వెళ్లాను.

ఇటువంటి సమయాల్లో ఎలా ప్రవర్తించాలో నాకంటె మా అక్కయ్యకు బాగా తెలుసు. మా అమ్మ తరుగుదామని కత్తిపీట ముందు పడేసుకున్న బంగాళా దుంపలన్నిటిని, మా అక్కయ్య నిశ్శబ్దంగా తలెత్తకుండా ఒకటొకటే తరిగేస్తుంది. అక్కయ్య బుర్ర వంచుకుందేగాని నాకై వచ్చేనన్నది అర్థంచేసుకుంటుందని గ్రహించాను నా





ప్రతాపరుద్రు ప్రతిమావశేషం (వరంగల్లు కోటలోనిది)

—ఫోటో: జి. వి. యస్. చారి (వరంగల్లు)

అనుమానం పటాపంచలై పోయింది అంటే కొంపమునిగే పనేమీ జరుగలేదన్నమాట

"అసలేం జరిగిందక్కయ్యా?" అంటూ నెమ్మదిగా అడిగాను

"ఉండరా బాబూ, ఆవిడను కొంచెం శాంతపడనీ" అంది నవ్వుతూ అక్కయ్య

దుంపలన్నీ తరిగేసిన తరువాత ముక్కలను దాకలోవున్న నీళ్లలో వేసి, అమ్మచేతి కిచ్చి వచ్చింది దాక నందుకొని ఉరిమి నట్టుగా ఒక చూపు చూచి, శుభ్రంగా ముక్కలను కడుక్కు రావడానికి కుళ్ళాయిదగ్గర కెళ్ళింది అమ్మ

అక్కయ్య చెప్పింది ఆవేళ మొదటి ఆటకు సినిమా ప్రోగ్రాం అట త్వరగా స్నానముగించి నాన్నగారు వచ్చేలోగా అందరికంటె ముందే సిద్ధమవుదామనే వుద్దేశంతో సబ్బుకోసమని సబ్బు పెట్టెలోచూస్తే అది కాస్తా మాయమైందట ప్రొద్దుటే తెచ్చారు నాన్నగారు కాగితమైనా విప్పకుండ ఆ బిళ్ళను అలాగే పెట్టెలో పెట్టిందట క్రొత్తబిళ్ళ కదా, పోనీ అమ్మతీసి మరెక్కడైనా దాచిందేమోనని అడిగి చూస్తే ఫలితం ఊహాతీతంగా తయారయింది

మా అమ్మ ఎప్పుడూ అంతే ఏమైనా కనిపించకపోతే, అమ్మ కదా, ఆమెను కాక మరెవరిని అడుగుతాం చెప్పండి? అక్కడ చూడు —అక్కడ చూడు అనేమైనా చెప్పుతుందేమోననుకుంటే మొదలు పెడుతుంది, "నాకేమైనా చెప్పి పెడ తారా? అంటూనా, ఒక్కొకటి బాబూ, ప్రతివస్తువూ మాయమవుతూ ఈ ఇంట్లో ఉండటం ప్రతకడం కష్టం" అని

మొత్తంమీద మా అమ్మ విసుగు మొలాపుస్తా ప్రొద్దుట కొన్న ఆరణాల సబ్బు అమాంతం మాయమవడం ఆశ్చర్యంగానే వుంది నేనుకూడ వుండబట్టలేక అమ్మతో ఇల్లు వెదకడం మొదలెట్టాను మా అమ్మ తనుకూడ మాకు తోడ్పడింది పోనీ, పనిమనిషికేమైనా

★ టాయిలెట్ సోప్ ★

తెలుసేమో ననుకుంటే, అది వెళ్ళి పోయిన తరువాతనే బిళ్ళను పెట్టెలో పెట్టింది. చీకటిపడ్డాకగాని మళ్ళీ రాదు అంట్లు తోమడానికి

“అసలు ఈ కిష్టిగాడు ఎక్కడ చచ్చాడ్రా?” కేకవేసింది అమ్మ

“ఇందాక చెప్పేనుగా, ప్రక్కింటికి ఆడుకోడానికి వెళ్ళారని” జ్ఞాపకం చేసింది అక్కయ్య

వాళ్ళకు కూడ నాలుగు పెడితేనేగాని తృప్తి కలుగదుగా అమ్మకు వెంటనే పిలుచుకురమ్మని నన్ను పంపింది

అక్కడ ఎవరూ కనిపించక, “ఏమిటి బాబూ, మీ యింటినుండి కేకలు వినబడుతున్నయ్!” అన్న ప్రక్కింటావిడ ప్రశ్నకు “మరేం లేదు పిన్నిగారు! సినిమా ప్రయాణం” అంటూ, తిరిగివచ్చి లేరని అమ్మకు చెప్పాను

ఇల్లంతా వెదికాం వాళ్ళకోసం ఎక్కడా కనుపించలేదు మా అమ్మకు ఏదో జ్ఞాపకం వచ్చి అలాగే కూలబడిపోయి, “అయ్యో కృష్ణా, అయ్యో పార్వతీ మిమ్మెల్నెవరు తీసుకు పోయార్రోయ్” అంటూ ఒకటే శోకాలు మొదలెట్టింది

కారణమేమంటే, నిన్నప్రొద్దుటి నుండీ మా ఎదురింటివాళ్ళ మోహన్ కనిపించడంలేదు ఎవరో తీసుకు పోయారని వదంతి బయలుదేరింది మా అమ్మస్థితిచూచి మా అక్కా, నేను కూడ దిగాలుపడిపోయాం కాని పైకిమాత్రం,

“ఛఛ! ఏమిటా పిచ్చిఆలోచన. ఎక్కడో ఆడుకోడానికి పోయి వుంటారు లేకపోతే, ఒకవేళ నాన్నగారి ఆఫీసు కెళ్లారేమో, యివాళ సినిమాప్రోగ్రాం వుందిగా వెళ్ళి చూచి వస్తాను” అని నేను అటు పరుగెత్తాను

కాని నేను వెళ్ళేటప్పటికే, ఆఫీసు మూసేశారు తిరిగి కాళ్ళీడ్చుకుంటూ యింటికి చేరుకునేసరికి, మరోదారిన నాన్నగారు అప్పటికే వచ్చేసి వున్నారు అమ్మ వెక్కిళ్లు యింకా తగ్గనేలేదు

ముందు మా నాన్నగారు మా అమ్మను చూచి గాబరా పడిపోయారు (ఏ చావు కబురైనా వచ్చిందేమోనని) సంగతి విన్నతరువాత తేరుకొని “ఛీ! అదేం భయం మన వాళ్ళ నెవరెత్తుకుపోతా రీరోజుల్లో ఏమూలనో ఆడుకుంటూ వుంటారు; వారే వస్తారు అదీగాక వాళ్ళ మోహన్నుకూడ ఎవరూ తీసుకు పోలేదు ఆ ముందురోజున ఒంటరిగా సినిమాకెళ్లతానంటే బాగా కేకలువేయడంవల్ల, వాళ్ళ మావయ్యగారింటికి పారిపోయాడట మర్నాడు వాళ్ల మావయ్య ‘భయపడకండి సుఖంగానే వున్నాడని’ ఉత్తరం వ్రాశాడు. ఇందాకనే మోహన్ నాన్నగారు నాకు దారిలో కనిపించిచెప్పారు ఎందుకూభయం? ఇప్పుడే వస్తారు,” అని సముదాయించారు

ఇంకా బాగా చీకటి పడలేదు. సినిమా ప్రయాణం ఏం చేదామని నాన్నగారు (మాత్రమే!) ఆలోచిస్తున్నారు అంత తెలివైన అక్కయ్యకూడ గోడకు చేరబడిపోయి పరాకులో పడింది

చటుక్కున నా బుర్రలో ఓ ఆలోచన మెరసింది! మా సినిమా ప్రయాణం సఫలమవాలంటే నా ఆలోచన నిజమైతే సరి!

నెమ్మదిగా లేచి వెళ్లిపోయి దొడ్లోచూచివచ్చి, యిల్లంతా (నాకు కావలసిన వస్తువులకోసం) వెదకడం మొదలుపెట్టాను ప్రతి గది పరిశీలించుకుంటూ పోయే సరికి ఆఖరుకు మేడమీద కొట్టు గదిలో (దీన్ని సాధారణంగా మేం దేనికీ వుపయోగించం) నాక్కావలసిన సామగ్రి (!) కనుపించింది

పదిమంది కూర్చున్న గుంపులో ఒకతను కర్ణకఠోరంగా పాడుతున్నాడు అందులో ఒకడు ఉండబట్టలేక “ఏమండీ! కాస్త ఊరుకుంటారా, లేకపోతే గాడిదలు వస్తాయేమో నని భయంగావుంది” అన్నాడు

“అబ్బే, ఫర్వాలేదండి, ఇక్కడున్నవి చాలు” అన్నాడు నవ్వుతూ గాయకుడు

—జి సూర్యనారాయణమూర్తి, విశాఖపట్టణం

* * *

తండ్రి · “ఏంరా? ఏంజరిగిందీ – మొఖం అలా వాచిపోయిందేం?”

కొడుకు “మీఆవిడ నన్ను కొట్టింది!”

—రామారావు (మద్రాసు)

ఏముంది?...నా ఆలోచన నిజమే అయింది.

ప్రక్కనే సబ్బు కేపర్ పడి వుంది గ్లాసెడు నీళ్లలోనూ సబ్బు పాకమయింది గదంతా విడిపోయిన చీపురకట్టపుల్లలతో గజిబిజిగా తయారయింది ఇంచుమించు వంటినిండా నురుగుతో కిట్టిగాడూ,-పార్వతీ చిల్లులున్న చీపురుపుల్లలను నోట్లో పెట్టుకొని సబ్బు బుడగలు ఊదుతున్నారు. ★

మా తెలివి

క్రిందటి డిశెంబరులో ఇచ్చిన శలవులలో ఒక్క తమాషా చేశాం. ఇప్పటికీ దానిని తల్చుకొని 'మా తెలివికి' మేము గర్విస్తూ వుంటాం. దీన్ని చదివి చెప్పండి- మేం చేసిన పని గర్వపడదగినదో కాదో

శలవుల్లో ఏమీ తోచటంలేదు. ఎనిమిదిగంటలకి కాఫీ, టిఫిను ముగించుకుని నేనూ, 6 V సుబ్బారావు (అంటే అది వాడి 'నిక్ నేమ్' లెండి. అసలుపేరు V వీర వెంకట వేణుగోపాల సుబ్బారావు మేము మిగిలిన రెండు 'V'లు చేర్చి, V వీర వెంకట వెర్రివెధవ వేణుగోపాల సుబ్బారావు అని పిలిచేవాళ్లం) V S భయ్యా (V సుబ్బయ్య) సూర్యారావు, నలుగురమూ రెండు సైకిళ్ళమీద, డబుల్సు రైడింగుచేస్తూ, అంటే శాసనోల్లంఘనం చేస్తూ, బయల్దేరాం తిరిగి, తిరిగి అలిసిపోయి, ఇంటికి వచ్చేస్తున్నాం మెయిన్ రోడ్డుమీదకి వచ్చేసరికి విజిల్ మోత వినిపించింది వెనక్కి-చూచేసరికి ఒక ఎర్రబుట్ట తలాడిస్తూ నిల్చుంది. మా ప్రాణాలు ఎగిరిపోయాయి "ఏదో కాలేజీలో చదువుతున్నాం కదా! పిలిస్తే వెళ్ళకపోవటం మర్యాదలక్షణం కాదు కాలేజీ పేరుకి అప్రతిష్ట" అనుకుని వెళ్లాం మా భయ్యా "ఒరే! తప్పుపేర్లు చెపుదాంరా!" అన్నాడు సుబ్బారావు (వీడువీలుగావుంటే పౌరశిక్షణనే తన అభిమానసబ్జక్టుగా తీసు

కె. వి. ఎస్. ఎం. శర్మ

కొని వుండేవాడు) "తప్పు చేసిన తర్వాత తప్పుపేర్లు చెప్పడం మరో తప్పు మన స్వతంత్ర భారతదేశంలోని విద్యార్థుల మనస్తత్వం యిట్లా వున్నదంటే చాలా విచారించదగిన . . " అని ఇంకా ఏమో చెప్పకుని పోతున్నాడు నేను "కాస్త గుర్రాన్ని కట్టెయ్యరా బాబూ" అన్నాను సూర్యారావుకి ముఖంలో నెత్తురు చుక్కలేదు

ఇంతలో పోలీసు నిలబడివున్న గొడుగుని సమీపించాం వికటంగా సెల్యూట్ చేసి "మీపేర్లు చెప్పండి సార్స్" అన్నాడు. బింకంగా పేర్లు, అడ్రస్‌లు చెప్పాం. ఆ తర్వాత బతిమలాడటం మొదలెట్టాం కాఫీ నీళ్లు ఆశచూపాం "నన్ను వూరికే మొహమాట పెట్టకండి" అన్నాడు ఆ క్రితంరోజున వాళ్ళకి కేసులేవీ పట్టుకోలేదని రిమార్కులు రాశారట అందువల్ల రోడ్డుకి అడ్డంగా నడిచేవాళ్ళమీదకూడా కేసు రిజిస్టరు చేస్తున్నాడట ఆఖరికి బతిమాలగా బతిమాలగా ఒక్కడ్ని వదిలాడు మా తాతలు దిగివచ్చారు. సరే అని అతిభయంగా వున్న సూర్యారావుని వెళ్ళిపొమ్మన్నాం. వాడు అన్నదే తడవుగా వెళ్ళిపోయాడు మేం ముగ్గురం సైకిల్లు నడిపించుకుంటూ, పోలీస్‌తో సహా పోలీసుస్టేషన్కి నడుస్తున్నాం

ఇంతలోకి నాకొక ఐడియా తట్టింది అది మాభయ్యాకి రహస్యంగా చెప్పా "భలే! చాలా బాగుందిరా" అన్నాడు ఆ పోలీసుతో "ఏమండీ! మేంవున్నది ముగ్గురమే కదా? మా దగ్గరవున్నవి రెండే సైకిల్లు మేం ముగ్గురం రెండు సైకిళ్ళమీద డబుల్సు రైడింగు చేశామని కేసు రిజిస్టరుచేయటం అసమంజసంగా వుంటుందేమో! ఒకడ్ని వదిలేశామని చెప్పటం మీకే ప్రమాదకరమేమో ఆలోచించుకోండి" అన్నాను "మీరు మాట్లాడకుండా నాతో రండి" అన్నాడు "మన ప్లాను సాగలేదురా" అని విచారపడుతూ కొంతదూరం నడిచేసరికి ఆ పోలీసు కోపంగా "మీలో ఎవరో ఒకరు వెళ్లిపోవచ్చు" అన్నాడు సుబ్బారావుతో "మా కొక ప్లానుందిరా! నీ సైకిలుని వదిలేసి వెళ్లిపో" అన్నాను వాడు వెళ్లిపోయాడు

పోలీసు మా కేసి కోపంగా

చూస్తూ నడుస్తున్నాడు మాలోమేం నవ్వుకుంటూంటే ఆ పోలీసుకి కోపం మరీ ఎక్కువైంది ఇంతలో పోలీసుస్టేషను వచ్చింది లోపలికి వెళ్లాం. అతను సబ్ ఇనస్పెక్టరుదగ్గరకి వెళ్ళి మామీద డబుల్సురైడింగ్ కేసు వున్నదని చెప్పాడు. ఆయన నవ్వుతూ "ఏమయ్యా నిజమేనా?" అన్నాడు ఆయన మా కాలేజీకి గేమ్సు, స్పోర్ట్సు జరపటానికి వస్తూవుంటాడు అందువలన కొంచెం పరిచయం వుంది నేను నవ్వుతూ "సరేలెండి! మాదగ్గిర యిప్పుడువున్న సైకిళ్లెన్నో కనుక్కోండి" అన్నాను ఆ పోలీసు తడుముకోకుండా "రెండు" అన్నాడు మా సుబ్బారావు ఫకాలుమని నవ్వాడు నేను "ఏమండీ ఇనస్పెక్టరుగారూ! మా దగ్గరవున్నవి రెండుసైకిళ్లు మేము వున్నది యిద్దరం మేమిద్దరం ఆ రెండుసైకిళ్లమీదా డబుల్ రైడింగ్ చేశామంటే ఎంత absurd గా వుందీ! ఈపోలీస్ మామీదవున్న grudge తో ఈ కేసు పెట్టాడు" అన్నాను ఆ పోలీసు ముఖాన కత్తివాటేస్తే నెత్తురుచుక్కలేదు. ఏదో చెబుదామనుకుంటున్నాడు మాట రావటంలేదు. బహుశా యిద్దర్ని వదిలేశినట్లు చెప్పబోయి అట్లాచెస్తే తనకి ప్రమాదం కలుగుతుందని ఆ చెప్పే ప్రయత్నం విరమించుకున్నట్లున్నాడు

ఆ ఇనస్పెక్టరు కొంచెం సేపు ఆలోచించి మేము చేసినపని గ్రహించినట్లున్నాడు మావేపు తిరిగి నవ్వాడు. తర్వాత పోలీసుతో "ఏమయ్యా! ఇంత తెలివి తక్కువ కేసుపెట్టావు? ఇట్లాంటి కేసు ఇంకెప్పుడూ పట్టకు. నీవు చేసినపని నాకు తెలుసులే. మిగిలిన ఇద్దర్ని వదిలేస్తే వాళ్లీసైకిళ్ళు వదిలేసి వెళ్లిపోయారు కదూ! ఇంకెప్పుడూ ఇట్లా చేయకు. ఇంకా నీవు కొత్తకాబట్టి, మొదటి తడవ కాబట్టి నీకు వార్నింగు మాత్రమే యిస్తున్నా" అని మాతో "మీరువెళ్ళండి"అన్నాడు Thanks చెప్పి తిరిగివచ్చేస్తున్నాం. ఆపోలీసుకూడా తలకాయ వంచుకుని వచ్చేస్తున్నాడు. మేము నవ్వుకున్నాం అతను "థాంక్సండీ" అన్నాడు

ఇక అప్పటినుంచీ ఆపోలీసు మాకు ఫ్రండ్ అయ్యాడు ఎప్పుడు కనిపించినా ఒకచిరునవ్వుతో greet చేస్తూ వుంటాం

అన్నట్లు చెప్పటం మరిచా ఆ రోజున మావల్ల, ఆపోలీసుకి కాఫీ నీళ్లు మస్తుగా టిఫిను, గిట్టాయింలెంగి ★

★ మంచీ-చెడూ ★


(18- వ పేజీ తరువాయి)

విచారకమైన బాహ్యస్థితిలోకి ఆమెలోని ప్రతి అణువూ విపరీతమైన వుద్రేకంతో కొట్టుకొన్నది ఘోరున ఏడుస్తూ ఆమె భాస్కరం పట్టు వొదిలించుకుని అతని కాళ్ళమీద పడింది ఆమె నోటివెంబడి ప్రవాహంలా మాటలు రాసాగాయి, "నేను దిక్కులేనిదాన్నయిపోయాను భాస్కరం! అమ్మ నాన్న—దరిద్రంలో కొట్టుకులాడుతున్నారు—అటు పుట్టిల్లుపోయింది—ఇటు మెట్టినిల్లూ బుగ్గయిపోయింది నాకు—నేనింక ఎక్కడికిపోను భాస్కరం! నన్ను మీ నాయనతోపాటే తగలేశెయ్ నాకు భూమ్మీద ఇంకే ఆశ లేదు భాస్కరం" అంటూ ఆమె బిగ్గరగా ఏడవ నారంభించింది

ఈ దృశ్యం చూసీ చూడనట్లు పాండురంగ దహన సంస్కారానికి కావల్సిన ఏర్పాట్లు చేస్తున్నాడు తూర్పున దట్టమైన నల్లని మేఘాల్ని చీల్చుకుని సూర్యకిరణాలు అర్ధచంద్రాకృతిలో ఆకాశాంతరాళంలోకి విస్తరిస్తున్నాయి. పశ్చిమాన ఇంద్రధనుస్సు వెలిసింది సుందర మాత్రం పదుతోనే వుంది

భాస్కర్రావు పద్మను లేవదీసి, "ఏడవకు పద్మ నీకు దిక్కులేకపోతే నేనులేనా! నా ప్రాణం వున్నంతవరకు నీకేం భయంలేదు," అని వాత్సల్యంతో ఆమె తల నిమిరాడు ఆ క్షణాన వాళ్లిద్దరికీ ఏంతో శాంతి లభించింది

[ఇంకా వుంది]



అందాలరాణి—1954

ఫొటో : వీరవల్లి సటుంబరావు (మద్రాసు)

★ కర్పూర ద్వీప యాత్ర ★

నావ వచ్చినప్పుడు అక్కడి పిల్లలు అందులో చాలామంది ఎక్కివచ్చారు కూడా! వాళ్లలో ఎనిమిదిమంది కథేగా ఇంతవరకూ మనము చెప్పుకుంటూవచ్చింది! మరి మిగిలినవాళ్లో?

వాళ్లూ ఈ లోకంలో ఎన్నో పుణ్యకార్యాలు చేశారు. కొద్దిగా పాపమంటే నరకం చూసుకొని స్వర్గానికి వెళ్లారు. ఇప్పుడు వాళ్లకు స్వర్గసుఖం చాలలేదనిపిస్తున్నది. ఎందుకంటే మళ్ళీ కర్పూరద్వీపము కొంచెం కొంచెమే జ్ఞాపకానికి వస్తున్నది స్వర్గంలో ప్రభుత్వము చేసే ఇంద్రుణ్ణీ ఇంద్రాణినీ చూడగా చూడగా వాళ్ళలో కర్పూరద్వీపంలో తమ అమ్మానాన్న పోలిక కొంత పొడకట్టింది.

వెంటనే వాళ్లు ఆ లోకపు తండ్రికీ తల్లికీ ప్రదక్షిణం చేసి మొక్కి— ఉత్సవంలో పారిపడ్డ పిల్లవాడు దగ్గరకు తీసిన ధర్మాత్ములైన దంపతులను వేడుకొన్నట్లు— మా అమ్మా నాన్నా దగ్గరికి పంపండని ప్రార్థించారు.

ఇంద్రుడూ ఇంద్రాణీ వాళ్లను బుజ్జగించి ఇట్లా అన్నారు!

“నాయనలారా, అమ్మాయిల్లారా, మీకు కర్పూరద్వీపానికి తిరిగి పోవాలెనని బుద్ధిపుట్టినందువల్ల ధన్యులైనారు. ఇక్కడినుంచి కర్పూరద్వీపానికి సరాసరి దారిలేదు. ఆ భూలోకంలో పుణ్యాత్ములైన అమ్మా, నాన్నల కడుపునపుట్టి లోకాన్ని ఉద్ధరించి జాగ్రత్తగా ప్రవర్తిస్తే, కొన్నాళ్లకు మీకే అక్కడినుంచి కర్పూర ద్వీపానికి రెండే రెండు దారులు కనబడతై. మీకు ఇష్టమున్న దారిన చేరుకోవచ్చు!”



ఏ వి ఎమ్ వారి "సంఘం" తెలుగు చిత్రంలో బాలచందర్, ఎన్ టి రామారావు

★

రేవతీ స్టూడియోలో "మా గోపి" సెట్టుమీద వర్కింగ్ స్టిల్—దర్శకుడు బి ఎస్ రంగా, నాగయ్య, ఇ ఎస్ ఎన్ మూర్తి మున్నగువారు



సినీ టెక్నీషియన్ల హక్కుల రక్షణ

బొంబాయి సమావేశ విశేషాలు

మే నెల 15, 16 తేదీలలో బొంబాయిలో జరిగిన అఖిలభారత సినీ టెక్నీషియన్ల మూడవ వార్షిక సమావేశం అతి ముఖ్యమైన కొన్ని తీర్మానాలు చేసింది. టెక్నీషియన్ల హక్కులకు సంబంధించిన తీర్మానాలూ, ఫిలిం పరిశ్రమ సమస్యలను పరిష్కరించడానికి భారత ఫిలిం ఫెడరేషన్‌కు టెక్నీషియన్లు సర్వసహాయమూ చేస్తారనే ఒక తీర్మానమూ, మోషన్ పిక్చర్ ఎకాడమీ స్థాపన ముఖ్యంగా పరిగణించదగినవి.

బొంబాయి సమావేశానికి మద్రాసునుండి 55 మంది, కలకత్తానుండి 30 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

15 తేదీ మధ్యాహ్నం 3 30 గంటలకి జహంగీర్ ఆర్ట్ గాలరీలో సమావేశం ప్రారంభమైంది. హాలంతా ప్రతినిధులతోను, ప్రేక్షకులతోను నిండిపోయింది. ప్రసిద్ధ మహారాష్ట్ర సంగీత దర్శకుడు వసంత్ దేశాయి తన బృందంతో "వందేమాతరం" ప్రార్థన గీతం పాడారు. అఖిల భారత సినీ టెక్నీషియన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఎన్ కృష్ణస్వామి వార్షిక నివేదిక చదివి సభ్యులకు సమర్పించారు. సుమారు 4 30 కు బొంబాయి గవర్నరు గిరిజాశంకర్ బాజ్‌పాయ్ సమావేశానికి వచ్చారు.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు వి. ఎమ్. తాతా (రాజ్ కమల్ కళామందిర్‌లో రికార్డింగ్ ఇంజనీరు) ప్రతినిధులందరినీ ఆహ్వానిస్తూ మాట్లాడారు.

తరువాత గవర్నరు బాజ్‌పాయ్ గారు సభ ప్రారంభించారు. "ఇప్పటి చలనచిత్రాల్లో టెక్నికల్ నైపుణ్యం ఏటేటా అభివృద్ధి పొందుతున్నది. మనదేశపు చిత్రాల్లో కూడా ఈ అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా ఫొటోగ్రఫీ, ఎడిటింగ్ చాలా పురోగమించాయి. అయితే మన నిర్మాతలు టెక్నికల్ అభివృద్ధిపై చూపినంత శ్రద్ధ కళ విషయంలో చూపడం లేదని నా అనుమానం.

నాకు సినిమాలనుగూర్చి ఎక్కువ తెలియదనీ, నేను 'ఫిల్మ్‌ఫాన్'ను కాననీ ఒప్పుకుంటున్నాను. అందుచేత ఈ సభలో మాట్లాడడానికి అర్హుణ్ణి కానని మొదట్లో భావించాను. కాని శ్రీ ఎస్ కె పాటిల్ గారి కోరికననుసరించి, ఇటువంటి సభల్లో మాట్లాడడం గవర్నరు విధుల్లో ఒకటి గనకా నేను మాట్లాడ్డానికి అంగీకరించాను.

సినిమాలకు సంబంధించిన చిన్న అనుభవం ఒకటి నాకు కలిగింది. న్యూథియేటర్సువారు చాలకాలం క్రితం తమ చిత్రం ఒకదాన్ని ప్రత్యేకంగా చూపించగా, అందులో పాత్రలు వగైరా లేవని కొందరు ఆక్షేపించారు. ఇది నాకు చాల ఆశ్చర్యం కలిగించింది. సినిమా కళను ఇటువంటి కొలబద్దలతో పరిశీలించడం విచారకరమైన సంగతి. షేక్స్‌పియర్ వ్రాసిన "హామ్లెట్" "మాక్బెత్" నాటకాల్లో పాత్రలుంటే అర్థముందిగాని "ఏజ్ యూ లైక్ ఇట్"లో పాత్రలకు స్థానం లేదు. కళాదృష్ట్యా మనం పురోగమించాలంటే కళావిశిష్టతకే ప్రాధాన్యం ఇవ్వాలి. టెక్నికల్ ప్రతిభకంటె ఒక చిత్రంయొక్క విజయానికి కథ, డ్రామా ఎక్కువ తోడ్పడుతాయని జ్ఞాపకముంచుకోవాలి.

మన దేశంలోనూ, విదేశాల్లోనూ సారస్వత సంపద పుష్కలంగా ఉన్నది. దీనిని సినిమాలకు పూర్తిగా వినియోగించుకోవాలి. ముఖ్యంగా చిన్నకథలు సినిమాలకు బాగా పనికివస్తాయి," అని బాజ్‌పాయ్ గారు చెప్పారు.

అధ్యక్షోపన్యాసం

1954–55 సంవత్సరానికి అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన పశుపతి ఛటర్జీ (బెంగాల్) అధ్యక్షోపన్యాసం చేస్తూ చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడారు. ఆయన ఉపన్యాసంలోని అనేక అంశాలు ఇతర ఉపన్యాసకులచేత కూడా పదేపదే తెలపబడినవి.

సినీ టెక్నీషియన్లు ట్రేడ్ యూనియన్ పద్ధతిలో సంఘటితులై, తమ ఇబ్బందులను తొలగించుకోడానికి ప్రయత్నించాలని ఆయన ఉద్బోధించారు.


"టెక్నీషియన్లు తమ శ్రమ మూలంగా ఇతరులకు లాభాలు చేకూర్చి పెడుతున్నారు. తామమాత్రం నిరంతర దారిద్ర్యంలో మునిగి వుంటున్నారు. ఆర్థికంగా బాగుపడిన టెక్నీషియన్లు లేకపోలేదు. వారు చాలా కొద్దిమంది. వేలకొలది సినీ కార్మికుల ముఖాలు చూడమని మిమ్మల్ని కోరుతున్నాను. అందరి ముఖాల్లోనూ దారిద్ర్యం నటిస్తూవుంటుంది. వారి శ్రమకి తగిన ఫలితం దక్కడం లేదు. వారి న్యాయమైన కోర్కెలను వినే నాథుడు కనిపించడం లేదు. కోర్టుద్వారా తమ డబ్బు రాబట్టుకోకూడదా అని కొందరు సలహా చెబుతారు. కాని తిండికి లేనప్పుడు కోర్టులకెక్కడమెలా? అంతేకాక ఒకసారి కోర్టుకెక్కిన టెక్నీషియన్‌ను నిర్మాతలు వెలివేసినట్టు చూస్తారు.

కాని టెక్నీషియన్లు ఎన్ని యిబ్బందుల మధ్య ఉన్నా, తమ పనిమీద వారికున్న శ్రద్ధాభక్తులవల్ల, పనివిషయంలో మాత్రం చప్పు ఉండదు. సెట్స్‌మీద ఉన్నప్పుడు ఏ టెక్నీషియనూ డబ్బునుగూర్చి ఆలోచించడు, పనిలోనే మునిగిఉంటాడు. ఈ సంగతి తెలిసే నిర్మాతలు మనను తమకు లాభసాటిగా ఉపయోగించుకుంటున్నారు.

నిర్మాతలు తమకు చిత్రాలమీద రాబడి తగ్గిపోయిందనీ, అందుచేత జీతాలు సరిగా ఇవ్వలేకపోతున్నామనీ అంటారు. ఇది హాస్యాస్పదం. తాతా ఐరన్ వర్క్సువారు 'మాకు నష్టం వస్తోంది గనుక మీకు జీతాలివ్వలేము'అని అంటున్నారా? అనడం లేదు. సినిమాపరిశ్రమ కూడా మిగతా పరిశ్రమల వంటిదే. ఈ పరిశ్రమలో జూదపు మనస్తత్వం కలిగినవాళ్ళకు తావుండగూడదు. ఒక చిత్రానికి నష్టం వస్తే నిర్మాతలు టెక్నీషియనను, నటీనటులను నిందించడానికి వీల్లేదు. తమకు సినిమాకళ, సినిమా వ్యాపారం తెలియనందుకు నిర్మాత తన్ను తానే నిందించుకోవాలి. మనం మోషన్ పిక్చర్ ఎకాడమీ స్థాపించబోతున్నాం కనుక అందులో నిర్మాతలకు కూడా ట్రెయినింగ్ ఇప్పిస్తే బాగుంటుందేమో."

టెక్నీషియన్ల ఇబ్బందులను తొలగించడానికి పశుపతి ఛటర్జీ కొన్ని సూచనలు చేశారు: "టెక్నీషియన్లకు ఇవ్వవలసిన డబ్బు పూర్తిగా ఇవ్వనిదే చిత్రాన్ని


బి.ఏ.యస్. ప్రొడక్షన్స్ వారి...
రాజు పేద
ప్రొడ్యూసర్-డైరెక్టర్
బి.ఏ. సుబ్బారావు
లక్ష్మీరాజ్యం అమ్మాజీ
యస్ వి రంగారావు యన్ టి రామారావు రేలంగి
సుధాకర్
మ్యూజిక్ రాజేశ్వరరావు



అ భా సినీ టెక్నీషియన్ల కౌన్సిల్ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తున్న పశుపతి ఛటర్జీ, ఆయన పక్కన బొంబాయి గవర్నరు [illegible] ఎస్ కె పాటిల్ గార్లు

బొంబాయి సమావేశ విశేషాలు

సెన్సార్ చెయ్యకూడదని ప్రభుత్వం శాసనం చెయ్యాలి, సినిమా పరిశ్రమలోని కార్మికులందరికీ ఫ్యాక్టరీల చట్టం వర్తించాలి; సినీ టెక్నీషియన్లు ట్రేడ్ యూనియనుగా ఏర్పడాలి." అని ఆయన అన్నారు.

టెక్నీషియన్లు తమ తమ అనుభవంవల్ల సంపాదించిన నిపుణత కావలసినంత ఉందని సంతృప్తిపడరాదనీ, 'థియరీ' లో కూడా వారు నిష్ణాతులై ఉండాలనీ, అప్పుడే వారు సృజనాత్మకమైన అభ్యుదయం సాధించగలరనీ ఆయన ఉద్బోధించారు. "ఈ ఉద్దేశంతోనే మోషన్ పిక్చర్ ఎకాడమీని అతిశీఘ్రంగా స్థాపించాలని నిశ్చయించాము. ఈ ఎకాడమీలో థియరీ నేర్చుకొని స్టూడియోలలోను, లాబొరేటరీలలోనూ ప్రాక్టికల్ విజ్ఞానం సంపాదించాలి. ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన టెక్నీషియను మనకు సహాయపడాలి. అంతేకాక రిసెర్చి విషయాల్లో మనకు తోడ్పడవలసిందని సైంటిస్టులను మనం కోరాలి. యూనివర్సిటీలు సినిమటోగ్రఫీ, సౌండుశాఖల్లో తర్ఫీదు ఇవ్వాలని మనం ఒత్తిడి చేయాలి."


మనదేశం ముడిఫిలింకోసం, యంత్ర సామగ్రి రసాయన పదార్థాలకోసం ఇతర దేశాలమీద ఆధారపడవలసివస్తోందనీ, వీటిని స్వదేశంలోనే ఉత్పత్తి చేయించడానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలనీ మన రాజకీయ నాయకులు, మంత్రులు సినిమా

లను ఊరికే నిందించడంమాని నిర్మాణాత్మకమైన సూచనలు, సహాయం చేయాలని ఛటర్జీ కోరారు


ప్రధాన కార్యదర్శి ఎన్ కృష్ణస్వామి (మద్రాసు) మాట్లాడుతూ ప్లానింగ్ లేకపోవడం స్క్రిప్టు పూర్తికాకుండా చిత్రం మొదలుపెట్టడ తీసిన దృశ్యాలే తిరిగి తీయడం టెక్నీషియన్లను నటులను మధ్యలో మార్చడం మొదలైనవాటివల్ల ఆలస్యం, ధననష్టం జరుగుతోందని, వీటిని నివారించడం కోసం నిర్మాతలు టెక్నీషియన్లతో ముందుగా సమాలోచించితే చాలా లాభం ఉంటుందనీ అన్నారు జీతాలు సరిగా ఇవ్వాలనీ టెక్నీషియన్లకు సరియైన సౌకర్యాలు కలిగించాలనీ ముఖ్యంగా 8 గంటలకంటె ఎక్కువ పనిచేయించకూడదనీ, అందువల్ల పని సక్రమంగాను సమగ్రంగాను జరుగుతుందనీ ఆయన అన్నారు

ఆ తరువాత జహాంగీర్ ఆర్ట్ గాలరీలోని మరొక భాగంలో ఏర్పాటు చేయబడిన ఎగ్జిబిషన్‌ను ప్రసిద్ధ దర్శకుడు వి శాంతారాం ప్రారంభించారు ఇండియాలోని టెక్నీషియన్లు ఇండియాలో తయారైన పరికరాలనే ఎక్కువగా ఉపయోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


(52–వ పేజీ చూడండి)



సమావేశానికి హాజరైన టెక్నీషియన్ ప్రతినిధులు



ఆర్ కె స్టూడియోలో "శ్రీ 420" ఔట్ డోర్ షూటింగ్ చూడ్డానికి వెళ్ళిన మద్రాసు ప్రతినిధులు




మద్రాస్ యూనిట్ కు నర్గీస్ ఆతిథ్య మిచ్చినప్పటి ఫోటో



"అన్నదాత"లో కుటుంబరావు, చలం, ఎస్ వి రంగారావు

★

బొంబాయి మెహబూబ్ స్టూడియోస్‌లో "మొఘల్ ఇ ఆజం" సెట్‌పై మద్రాసు జర్నలిస్టులకు విందు.





[illegible]

[illegible]

మోషన్ పిక్చర్ ఎకాడమీ

(49-వ పేజీ తరువాయి)

మర్నాడు, అనగా, 16 వ తేదీ ఉదయం హోటల్ మెజెస్టిక్‌లో విషయ నిర్ణయసభ జరిగింది మధ్యాహ్నం సభలో ఎస్ కె పాటిల్ గారు మోషన్ పిక్చర్ ఎకాడమి కి ప్రారంభోత్సవం చేశారు ఫిలిం పరిశ్రమ యెడల ప్రభుత్వం యింతవరకూ అనుసరించిన విధానం అనుచితంగా, అవివేకంగా ఉందని ఆయన తీవ్రంగా ఖండించారు సెన్సార్ విధానం పూర్తిగా మార్పు చేయాలనీ, సినిమాలపై సానుభూతిలేనివారిని సెన్సార్ అధికారులుగా నియమించరాదనీ, ఆయన అన్నారు సినిమా పరిశ్రమనుండి వసూలు చేసే పన్నులలో కనీసం నూటికి పాతిక వంతులైనా తిరిగి సినిమా పరిశ్రమకే వినియోగించాలనీ, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే మన చిత్ర నిర్మాతలు ప్రపంచ సినిమా మార్కెట్ లో పోటీకి నిలబడ్డానికి కూడా వెనుదీయరనీ పాటిల్ గారన్నారు

చిత్ర నిర్మాణంలోని వివిధములైన టెక్నికల్ శాఖలను ప్రోత్సహించేందుకు అఖిల భారత సినీ టెక్నీషియన్ల సంఘంవారు మోషన్ పిక్చర్ ఎకాడమి స్థాపించారు దీని ఆశయాలివి:

(1) చలనచిత్రాలకు సంబంధించిన కళలను, సైన్సులను అభివృద్ధి చెయ్యడం

(2) ఉత్తమమైన ప్రతిభ కనబరచిన వారికి ఏటేటా బహుమతు లివ్వడం, తద్వారా ఉత్తమచిత్రాలపట్ల ప్రజాభిరుచి పెంపొందించడం

(3) టెక్నికల్ రిసెర్చి జరపడం

(4) ఒకే విధమైన టెక్నికల్ ప్రమాణాలను ఏర్పరచడం

(5) చిత్రపరిశ్రమలోని ఈదిగువ శాఖలనుండి సభ్యులను చేర్చుకోవడం —ఆర్టు, ఫొటోగ్రఫీ, పబ్లిసిటీ నిపుణులు, డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ లు, ఫిలింఎడిటర్లు, లాబొరేటరీ టెక్నీషియన్సు, మ్యూజిక్ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, ప్రొజెక్షనిస్టులు, సౌండు ఇంజినీర్లు, రికార్డిస్టులు, సినిమా రచయితలు

ఈ ఎకాడమీ ముఖ్యోద్దేశ్యాలలో ఒకటి, సినిమా టెక్నిక్‌లో ప్రవేశం ఉన్న వారికి 'రిఫ్రెషర్' కోర్సులు నడిపించడం

ఎకాడమీనిర్వహణకు ఒక సంఘం త్వరలో నియమించ బడుతుంది

తీర్మానాలు

సభవారు మొత్తం 9 తీర్మానాలు చేశారు

(1) ఫొటోగ్రఫీ, ఎడిటింగ్ మొదలైన వివిధశాఖల టెక్నీషియన్లు శాఖలవారీగా సంఘాలు ఏర్పరచుకొని అఖిలభారత సినీ టెక్నీషియన్ల కౌన్సిల్‌కు వాటిని అనుబంధించాలి

(2) ఇంకా పూర్తికాని చిత్రంలో పని చేసి మానివేసినవారికి బకాయిలు తీర్చనిదే, కొత్తగా ఏ టెక్నీషియనూ ఆ చిత్రంలో పనిచేయడానికి ఒప్పుకోగూడదు

(3) విదేశీయ చిత్రాలను కాపీకొట్టి భారతీయ నిర్మాతలు చిత్రాలు తీయడం నీతివిరుద్ధం, న్యాయ విరుద్ధం దీనివల్ల ఈ దేశంలో స్వతంత్ర కౌశలం గలవారికి అన్యాయం జరుగుతోంది అందుచేత నిర్మాతలు, రచయితలు కాపీకొట్టే పద్ధతి మానివేసి మనదేశపు ప్రాచీన, ఆధునిక జీవితం, సాహిత్యంనుండి కథావస్తువులు సేకరించాలి

(4) ఫిలిమ్ కళతోను, టెక్నిక్‌తోను బాగా పరిచయం ఉన్నవాళ్లనే సెన్సార్ అధికారులుగా కేంద్రప్రభుత్వం నియమించాలి

(5) ఒక చిత్రంమీద వచ్చే మొత్తం డబ్బులో నూటికి 18 వంతులు మాత్రమే నిర్మాతకు దక్కుతుందట ఈ అన్యాయాన్ని నివారించేందుకు ఫిలిం ఫెడరేషన్ చేసే ప్రయత్నాలకు టెక్నీషియన్లు మనస్ఫూర్తిగా సహకరిస్తారు

(6) సినిమాలపై వినోదంపన్ను వసూలు చేసే అధికారం కేంద్రప్రభుత్వమే తీసుకుని, వినోదంపన్ను రేట్లు దేశమంతటా నూటికి 10 వంతులు మాత్రమే ఉండేట్లు చేయాలి

(7) పూర్తిఅయిన ఒక చిత్రాన్ని సెన్సార్ వారు పరిశీలించేముందు, ఆ చిత్రంలో పని చేసినవారందరికీ డబ్బు పూర్తిగా ముట్టిందనే సర్టిఫికేట్టు అ భా సినీ టెక్నీషియన్ల కౌన్సిల్ వారు ఇస్తేనే గాని, సెన్సారింగ్ కు అనుమతించ గూడదు

(8) చిత్రానికి ప్రాణతుల్యమైనది స్క్రిప్టు కనుక సినిమ కథారచయితల, స్క్రీన్ ప్లే, డైలాగ్, సినేరియో, పాటల రచయితల హక్కులు కాపాడబడాలి

(9) సినిమాపరిశ్రమను రెండవ పంచవర్ష ప్రణాళికలో చేర్చాలి

ఫొటోగ్రఫీ బహుమతులు

1953 వ సంవత్సరంలో ఫొటోగ్రఫీలో మద్రాసుకు ఎ రహమాన్ ("నా యిల్లు" చిత్రానికి), బొంబాయికి ద్వారక దివేచా ("దిల్ ఇ నాదన్" చిత్రానికి), బెంగాల్‌కు [illegible] కె మెహతా ("షెషేర్ కబితా' చిత్రానికి) గార్లు ఉత్తములని నిర్ణయించబడ్డారు [illegible]రిలో తిరిగి ఉత్తములని నిర్ణయించబడినవారికి అఖిలభారత బహుమతి ఇవ్వబడుతుంది ఆర్టు, సౌండు, సంగీతం, స్క్రీన్ ప్లే, ప్రోసెసింగ్ మొదలైనశాఖలలో కూడా ఫలితాలు త్వరలో తెలుపబడతాయి

1954–55 వ సంవత్సరానికి అ భా సినీ టెక్నీషియన్ల కౌన్సిల్ కార్యకర్తలుగా ఈ దిగువవారు ఎన్నిక అయ్యారు

అధ్యక్షుడు: పశుపతి ఛటర్జీ ఉపాధ్యక్షులు హరిబాబు (మద్రాసు) కృష్ణగోపాల్ (బొంబాయి) ప్రధాన కార్యదర్శి ఎస్ కృష్ణస్వామి జాయింటు కార్యదర్శులు: రజనీకాంత్ పాండ్య (బొంబాయి) రజనీకాంత్ (మద్రాసు) మగుసిల్ (బెంగాల్)

బొంబాయినుండి తిరిగివచ్చినతర్వాత మొన్న 25 వ తేదీన ఎస్ కృష్ణస్వామి గారు పాత వుడ్‌లాండ్స్‌లో పత్రికా ప్రతినిధులసమావేశం ఏర్పాటు చేశారు కేంద్ర ప్రభుత్వం మోషన్ పిక్చర్ ఎకాడమీ ఒకటి స్థాపిస్తామని ప్రకటించిందికదా, దానికీ మీ ఎకాడమీకి పోటీలు రావా అని ఆయనను ప్రశ్నించగా ఈ విషయమై ఆలోచిస్తున్నామన్నారు

ప్రభుత్వంవారు ఒక ఫిలిం ఇన్స్టిట్యూట్ ఏర్పాటుచేసి అందులో వివిధ టెక్నికల్ శాఖల్లో కొత్తవారికి తర్ఫీదు ఇవ్వడానికి నిశ్చయించింది ఈ నిర్ణయంవల్ల లాభం లేకపోగా ప్రస్తుత క్లిష్టస్థితిలో నష్టం ఉందని కొందరంటున్నారు సినిమా పరిశ్రమలో మాంద్యం ఏర్పడింది టెక్నీషియనులో నూటికి 50 మంది నిరుద్యోగులైఉన్నారు వీరికి పని దొరకడంలేదు వీరికే పనిదొరక్కనప్పుడు కొత్తవారిని తర్ఫీదుచేసి దేశంమీదికి వదలడంవల్ల ప్రయోజనం ఏమిటని అభిజ్ఞులంటున్నారు కాని "ప్రభుత్వం ఫిలిం విచారణసంఘం వేదికపై ఒక నిర్ణయానికి రావడానికి మూడేళ్లు పట్టింది ఇప్పుడు చేసిన నిర్ణయాన్ని అమలు చేయడానికి మరొక మూడేళ్లు పట్టదని నమ్మకమేమిటి? కనుక మరేమీ భయపడక్కర్లేదు" అని మరికొందరు అంటున్నారు ★

మా బొంబాయి ప్రయాణం

బొంబేలో జరిగిన ఆలిండియా సినీ టెక్నిషియన్ల 3 వ సమావేశానికి మేమంతా ఒక జట్టుగా బయలుదేరాం. మా జట్టులో డైరెక్టర్ ప్రసాద్, హరిబాబు (మేకప్), డైరెక్టర్ యోగానంద్, తంబు (కెమెరా), రామస్వామి (కెమెరా), రాధాకృష్ణ (అసోసియేట్ ఫిలిమ్స్), కోటేశ్వరరావు (భరణి), ఎస్. కృష్ణస్వామి, రజనీకాంత్ ముఖ్యులుగా ఉన్నారు. అప్పటికే మద్రాసులోని ముఖ్యులు ఎంతోమంది వెళ్ళిపోయారు. మేం 12 వ తేదీ రాత్రి బయలుదేరిన మేము 14 వ తేదీ ఉదయం బొంబే చేరాం. చేరగానే రాజ్ కమల్ వారి వాన్ లలో మెజెస్టిక్ హోటల్ లో దిగాం. ఖర్చుకు వెనుదీయకుండా బొంబేవారు మంచి వసతులు కల్గి పెద్దదైన మెజెస్టిక్ హోటల్ కు మద్రాసు, కలకత్తా డెలిగేట్లకు వసతికై ఏర్పాటు చేశారు.

వెళ్ళిన రోజు సాయంకాలమే, అనగా 14 వ తేదీ సాయంకాలం అంధేరిలోని మోహన్ స్టూడియోస్ కు తీసుకెళ్ళారు... అక్కడ "మొఘల్ - ఇ - ఆజం" చిత్ర నిర్మాత, దర్శకుడు కె. ఆసిఫ్ అందరికీ ఒక పార్టీ ఇచ్చారు. ఆ చిత్రంకోసం నిర్మింపబడ్డ ఒక పెద్దసెట్టు చూశాం. కొన్ని గజాల పొడుగున దాదాపు ఐదు లక్షల రూపాయల ఖర్చుతో వేయబడింది ఆ సెట్టు. పార్టీ తర్వాత, ఇంగ్లీషు హిందీ భాషలలో నిర్మింపబడుతున్న ఆ చిత్రం తాలూకు రషెస్ చూపించారు. దిలీప్ కుమార్, మధుబాలలతో అనార్కలి విషాదగాథతో ఆ చిత్రం తయారవుతోంది. దిలీప్ కుమార్ తల్లిగా దుర్గాఖోటే, తండ్రి అక్బర్ గా పృథ్వీరాజ్ నటిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత మెహబూబ్ "అమర్" ని అందరికీ ప్రదర్శించారు... రాత్రి 8 గంటలకి ఇళ్ళ చేరాం.

15 వ తేదీ ఉదయం అందరూ వారి వారి ఇష్టానుసారం వెళ్ళారు... హోటల్ సమీపంలోని "గేట్ వే ఆఫ్ ఇండియా"ను కొందరు, నగరంలోని సినిమాలను, వింతలను చూడ్డానికి కొందరు వెళ్ళారు. ఆరోజు 8 గంటలకు జహంగీర్ ఆర్ట్ గాలరీలో సమావేశం ప్రారంభం. బొంబే గవర్నర్ శ్రీ జి. యస్. బాజ్ పాయ్ ప్రారంభం చేశారు.

16 వ తేదీ రాత్రి క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో విందు. బొంబే పరిశ్రమలోని చాలామంది ఈ పార్టీకి హాజరయ్యారు. శాంతారాం, జయశ్రీ, సొహ్రాబ్ మోడీ, మెహబూబ్, అవధూత్, బి. యన్. రెడ్డి, నితిన్ బోస్, జయంత్ దేశాయ్ మొదలగు ప్రముఖులు ఎంతోమంది హాజరయ్యారు. ఖలీల్ బాయ్, పశుపతి చటర్జీ, డేవిడ్, కృష్ణస్వామి, శ్రీకృష్ణగోపాల్ ప్రసంగించారు. అంతటితో ఆల్ ఇండియా సినీ టెక్నిషియన్ల మూడవ సమావేశం సమాప్తి.

17 వ తేదీ ఉదయం ఎ. జె. పటేల్ యొక్క ఫిల్మ్ సెంటర్ కు అందరం వెళ్ళాం. వారి గెవాకలర్ లాబొరేటరీ చూశాం. తరువాత అక్కడే అందరికీ భోజనం. పటేల్ గారు టెక్నిషియన్లను, వారి స్టూడియో అతిథుల్లాకాక వారి కుటుంబ అతిథుల్లాగా చూశారు. వారి కుటుంబం అంతా బంధువులకు పార్టీ చేస్తున్నట్టుగా ఆదరించారు. పటేల్ గారు గెవా కలర్ లాబొరేటరీ స్థాపించి పరిశోధనలకై ఎంతో వ్యయం చేసి, ఇప్పుడు ఎన్నో చిత్రాల ప్రోసెసింగ్ అక్కడే చేస్తున్నారు. ఇటీవల తయారైన "పాంపోష్" (వారి స్వంత చిత్రం), ప్రేమలేఖలులోని కలర్ దృశ్యాలు, మయూర్ పంఖ్, మెహబూబా, ప్రిజనర్ ఆఫ్ గోల్కొండ, అక్కడ ప్రోసెస్ చెయ్యబడ్డవే... జయ్ మహాదేవ్, రాధాకృష్ణ మొదలగు నిర్మాణంలో ఉన్న చిత్రాల ప్రోసెసింగ్ అక్కడే జరుగుతూంది.

ఫిల్మ్ సెంటర్ లో ఉన్నప్పుడే మద్రాసు వర్కర్లు ఆరోజు వెళ్ళటానికి రైల్వే రిజర్వేషన్ దొరకలేకపోయిందని, మరుసటిరోజు ప్రయాణం అవుతున్నామని తెలిపారు.

తర్వాత మినర్వా మూవీటోన్ వెళ్ళాం. సొహ్రాబ్ మోడీ అందరినీ ఎంతో సంతోషంగా ఆదరించారు... వారి సౌండ్ ఇంజనీర్ శ్రీ ఎడిల్ అందరినీ స్టూడియో చుట్టూ తీసుకెళ్ళారు. "ఝాన్సీకీ రాణీ"కై ప్రత్యేకంగా తెప్పించబడ్డ 250 కిలోవాట్ల జెనరేటర్ స్టార్ట్ చేసి అందరికీ చూపారు. వారు ప్రస్తుతం నితిన్ బోస్ దర్శకత్వంలో నిర్మిస్తున్న "వారిస్" యొక్క అవుటు సెట్టు చూశాం. వారి ఆర్ట్ డైరెక్టర్ 'రుసీ బ్యాంకర్'ను అందరికీ పరిచయం చేశారు.

హరినారాయణ్

అప్పటనుంచి చెంబూర్ లోని ఆర్. కె. స్టూడియోస్ వెళ్ళాం. రాజ్ కపూర్ "శ్రీ 420" చిత్రం తాలూకు ఔట్ డోర్ షూటింగ్ కు ఏర్పాటు చేస్తూండినారు. వారి స్టూడియోలోని వివిధ డిపార్ట్ మెంట్లూ చూశాం. నర్గిస్ స్వయంగా అందరికీ టీ ఏర్పాటు చేయించి, అందరూ వెళ్ళేంత వరకూ దగ్గర వుండింది.

అప్పటనుంచి శ్రీకాంత్ స్టూడియోస్ ద్వారా జాగృతి స్టూడియో వెళ్ళాం... భగవాన్ ను కలిశాం... అప్పటనుంచి నేరుగా మహాలక్ష్మిలోని ఫేమస్ సినీ లాబొరేటరీస్ అండ్ స్టూడియోస్ వెళ్ళాం. సౌండ్ ఇంజనీర్ ముకుల్ బోస్ వారి రికార్డింగ్ యొక్క వివరాలను సౌండ్ ఇంజనీర్లకు వివరించారు.

బొంబే స్టూడియోలు చూసిన తర్వాత ఏర్పడ్డ అభిప్రాయాల్లో ముఖ్యమైంది అచ్చట స్టూడియోలవారు అనుసరిస్తున్న మార్గం. స్టూడియోమీద జాస్తి వ్యయం చేయకుండా "ఎక్విప్ మెంట్" మీద జాస్తి ఖర్చుచేస్తూ సాధ్యమైనంత త్వరలో సాంకేతికంగా మంచి చిత్రాలను నిర్మించడం వారి ముఖ్యాశయంలా కనిపిస్తుంది. మినర్వా మూవీటోన్ స్టూడియో చూస్తే "ఝాన్సీకీ రాణీ" చిత్రం నిర్మించింది ఇక్కడేనా అని ఆశ్చర్యపడతాం. ఆర్. కె. స్టూడియో చూస్తే "ఆవారా" చిత్రం నిర్మించింది ఇక్కడేనా అని ఆశ్చర్యపడతాం. ఆ రెండు స్టూడియోల్లోని ఒకే ఒక్క ఫ్లోర నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కాని ఆ రెండు స్టూడియోల్లో పెద్దపెద్ద జెనరేటర్లూ ఆర్కు లాంపులూ ఉన్నాయి. అక్కడే ఝాన్సీకీ రాణీ, ఆవారాలాంటి చిత్రాలు తీశారు. ఝాన్సీకీ రాణీలో నష్టపడ్డారనుకున్న మినర్వామూవీటోన్ వారు ఒక చిత్రం పూర్తి చేస్తున్నారు. మరో చిత్రం మొదటి సెట్టు వేసి వున్నారు.

బొంబాయి ప్రయాణంవల్ల అచ్చటి టెక్నిషియన్లతో పరిచయం కలిగింది.

మొత్తంమీద బొంబే ప్రయాణం ఎంతో సంతోషకరంగా జరిగింది.

వచ్చే సంవత్సరం మద్రాసులో జరగనున్న 4 వ సమావేశం ఇంతకంటే ఎంతో గొప్పగా, జరిపే బాధ్యత మన సినీ టెక్నిషియన్స్ అసోసియేషన్ మీదా, తద్వారా ప్రతి టెక్నిషియన్ మీదా వుంది. ★

విజ్ఞానవధులు

"డాక్టర్"

చిత్రప్రశ్నలకు జవాబులు

ఎ. వి. రంగయ్యగారు, సెయ్యదాపురము.

—మా 'డాక్టరు,' మందులను ఇచ్చే, లేకపోతే రోగ-చికిత్సను తెలిపే, పని పెట్టుకోలేదు. ఆపని మీ కుటుంబ డాక్టరుగారే చెయ్య సమర్థులు. విజ్ఞానానికి సంబంధించే సంగతులు వివరించడానికే మా 'డాక్టరు' దక్షుడు. అసలు రహస్యము ఇది. వ్యాసుడు అన్న పదమువలెనే 'డాక్టరు' అన్న పదమూ సమూహానికి పేరు. మీమీ సందేహములను నివృత్తి చేసే ఉపాధ్యాయ, పరిశోధక బృందానికి డాక్టరు అని పేరు పెట్టినాము మేము.

—రంగులు ఏడు. అన్ని రంగులూ చేరితే తెలుపు ఏర్పడుతుంది. నలుపు అన్నది రంగు కాదు. రంగు లేకపోవడమే నలుపు. నలుపు రంగు కిరణాలు లేనేలేవు. నలుపు రంగు కాదనుట కదే నిరూపణ.

* * *

బెహరా భాస్కరరావుగారు, ఆమదాలవలస.

—టెలివిజన్‌లో మనిషిబింబం ఎట్లాగ కనిపిస్తుందంటారా? అంతక్లిష్టమైన తాంత్రిక యంత్రములో జరిగే పనిని ఇంత చిన్న చోట్లో చెప్పడము సాధ్యమా? చిక్కులు లేని సరళమైనవివరణ చేస్తాను. చదవండి... సినిమాలో తెరమీద పొడిచే బొమ్మకి ఆధారమైన ఫిల్ము చూచి వుంటారు మీరు. ఆ ఫిల్మును నిలువుగానూ అడ్డముగానూ గీట్లు గీసి వేయిభాగాలు చేశారనుకోండి. తరవాత తెరమీద ఒకమూలవుండే భాగాన్ని మాత్రం ప్రసరించారనుకోండి. మీకు ఆ బొమ్మయొక్క ఒక్క తునకమాత్రం కనపడుతుంది. తరవాత వెంటనే రెండో తునకా, మూడో తునకా, అలాగ వేయితునకలూ ఒక్క క్షణ కాలంలో ప్రసరించారనుకోండి తెరమీదికి. అప్పుడు మీకు బొమ్మఅంతా కనపడుతుంది. ఈ ప్రసారమంతా సెకనులో పదోవంతు కాలములో జరిగిపోతే ఆ బొమ్మని తునకలు తునకలుగా ప్రసారించారనే గుర్తు కంటికి ఉండదు.

టెలివిజను కేంద్రంలో జరిగే కార్యక్రమము - పడవ నడపడపు పోటీయో, డ్యాన్సు కార్యక్రమమో - ఏదో సినిమా తీసినట్టు తీస్తూ, ప్రతీ బొమ్మనీ కొన్ని భాగాలుగా విభజించుకుని ఈ భాగాల గుణాల్ని - అంటే వెల్తురు నీడలని - రేడియోలో శబ్దములను వలెనే, ప్రసారము చేస్తారు. ఈ తునకలన్నీ సెకనులో పదవవంతు కాలానికి తక్కువ కాలంలో రిసీవింగు సెట్టుకి అంది, దాని తెరమీద ఒకదాని పక్కని మరొకటి పడి బొమ్మ కట్టుతాయి. తరవాత సినిమాలాగే కనపడుతుంది టెలివిజను కార్యక్రమము.

* * *

గాడె ప్రభాకర గుప్త, విజయవాడ.

—దూరపు కొండల ఆకారమును పట్టుకొని వచ్చే వెల్తురు కిరణాలతో, ఆ కొండకీ మన కంటికీ నడుమగల సూక్ష్మములగు గాలి కణములు విరజిమ్మే నీలి కిరణాలు చేరివచ్చి మనకంటికి అందుటవల్ల దూరపుకొండలు నీలముగా కనబడతాయి.

మూడు కోలతల సినీమాలు చూచుటకు ధరించే సులోచనముతో చూచినప్పుడు, ఈ నీలి కిరణాలు వాటిలోనుంచి ప్రసరించలేక ఆగిపోతాయి. అప్పుడు దూరపు కొండలు నీలముగా కనపడవు

...బతికున్న మనిషి చచ్చిపోయినప్పుడు బరువు ఎక్కువ అవదు. చుట్టగిడస చేపతో సోదా చూడవచ్చును. అది పట్టిన చాలాసేపటివరకూ ప్రాణముతో వుంటుంది.

—మూరులోనుంచి చీకటిగదిలో ప్రవేశించే సూర్యకిరణాన్ని మూడు పలకగాజు పట్టకములోంచి పోయేటట్టు పట్టకాన్ని పట్టుకోండి. గోడమీద రంగుల చిత్రము పడుతుంది. కంటికి కనబడకపోయినా ఎరుపురంగుకి ఇటూ, నీలపురంగుకి అటూ సూర్యకిరణాలు వచ్చుతూనే ఉంటాయి. ఫొటోగ్రాఫు ప్లేటు పెట్టి బొమ్మ తీస్తే రంగులమధ్య దాటి నీలపు రంగుకి ఇవతల కూడా 'బొమ్మ' పడుతుంది. ఈ 'బొమ్మ' అల్ట్రావయొలెట్ కిరణాలవల్ల పడినది. ఇవే అతి నీలలోహిత కిరణా లంటాము.

ఇక ఎరుపునకు అవతలపడే యిన్‌ఫ్రారెడ్డు కిరణాలను పట్టుటకు మసిపూసిన థర్మామీటరు బల్బును, ఆ ప్రదేశములో పెట్టి పట్టుకోవాలి. పట్టి కంటికి వెల్తురు పడుతూన్నట్లు తెలియకపోయినా థర్మామీటరు పట్టుకుంటుంది ఆ కిరణాల వేడిని.

* * *

దొప్పలపూడి సాంబశివరావుగారు, తెనాలి.

శ్రీనాథుడు సర్వజ్ఞ సింగమనీని కాలములో ఉండెననుటకు శ్రీనాథుని చాటుపద్యము "సర్వజ్ఞ నామధేయము శర్వునికే, రావు సింగజనపాలునికే యుర్వింజెల్లును" అన్నది సాక్ష్యము.

పోతన కాలములోని సర్వజ్ఞసింగడు పైన చెప్పిన సింగభూపాలుడో అతని మనుమడో నిర్ణయించడానికి ప్రస్తుతము మాకడ సాధన సంపత్తి లేదు. మీ ఉపాధ్యాయులు ఎరిగియుందురు. అడగండి.

* * *

వేమూరి ప్రకాశరావుగారు, విశాఖపట్టణము.

—ఒక జాతి ప్రాణినుండి ఆ జాతి ప్రాణులే ఉద్భవించునన్నది మొత్తముమీద నిజమే. ఐతే, ఏ సంబంధమూ లేనప్పుడు అక్కమూతురే దిక్కైనట్లు విషమ పరిస్థితులలో ఒక జాతికి చెందిన రెండు వేరు వేరు ప్రాణుల సంకరము జరుగవచ్చును. తోడేలూ, నక్కా, దుమ్ముల గొండీ, చిందువా కుక్కా - ఇట్టి సంకరము వల్ల ఏర్పడిన ప్రాణులే అని జంతు శాస్త్రజ్ఞుల నమ్మకము. సంకరము వలన పుట్టిన ప్రాణియొక్క అంగబలము దాని మనికికి తోడ్పడునట్టిదిగా ఉన్నచో ఆ ప్రాణి ఈ కొత్త గుణములతోనే వృద్ధిపొందును. అట్లు కానిచో ఆ సంకర ప్రాణిజాతి క్షీణించిపోయి నశించును.

శ్వాన మార్జాలములూ, వ్యాఘ్ర సింహములూ, ప్రపంచములో తప్పిజారి ఎక్కడనైన పుట్టినా వృద్ధిమాత్రము కాలేకపోయినవి.

ప్రాణియొక్క జీవితమునకు సాయపడనీ, లేదా అక్కరలేని అంగములు లోపించిపోవుటవల్లకూడా జీవపరిణామము జరుగవచ్చును. ఒక రకపు పురాతనపు చేపలకు కాళ్ళు లోపించి పోవుటా, పెంగ్విన్ పిట్టలకు రెక్కలు పూర్తిగా చర్మమయము లైపోవుటా ఈరీతి పరిణామము వలన జరిగినవే!

ఇటీవలన X—కిరణములు ప్రసరించిన విత్తనములనుండి బయలుదేరు మొక్కలలో మార్పులు వచ్చినట్లు శాస్త్రజ్ఞులు [illegible] న్నారు. దీనినిబట్టి ఊహించుచో అనాదినుండి సూర్యకిరణాలవల్ల మొక్కలలో మార్పులు మాటాత్తుగా పైకి కనబడక పోయినా జరుగుతూనే వుండవచ్చునని [illegible] ఫలితంగా పరిణామముకూడా సాగు[illegible] వుండి వుండవచ్చునని ఊహించవచ్చును. ★

న్యూస్ రీల్

(3-వ పేజీ తరువాయి)

సోమవారం, మే 24:

—సింహళంలోని భారతీయులను గురించి సింహళ ప్రభుత్వం భారత ప్రభుత్వంతో సంప్రదించకుండానే నిర్ణయాలు చేసిందనీ, ఆ తరువాత సింహళ ప్రభుత్వం తమ నిర్ణయాలను లాంఛనప్రాయంగా తెలియపరిచిందనీ కొలంబోలోని భారత ప్రతినిధి ఒకరు ప్రకటించారు.

—రేడియమ్‌చిహ్నలు గల వర్షం సిడ్నీలో కురిసిందని సిడ్నీ వార్త. (జపాన్‌లో రెండుమూడు ప్రాంతాల ఇటువంటి వర్షం పడిందని ఇదివరలో వార్తలు వచ్చాయి)

—అమెరికా దక్షిణ రాష్ట్రాల విద్యాసంస్థలలో నీగ్రోలకు సమానహక్కు లివ్వాలనీ, ఇందుకు విరుద్ధమైన తీర్పులను రద్దు పరుచుకోవాలనీ సుప్రీంకోర్టు రాష్ట్ర సుప్రీంకోర్టులకు ఉత్తరువు ఇచ్చింది. [అమెరికన్ విద్యాసంస్థలలో తెల్లవారితో పాటు నీగ్రోలనుకూడా చేర్చుకోవాలనీ, ప్రత్యేక సౌకర్యాల ఏర్పాటు చెయ్యడం రాజ్యాంగ విరుద్ధమనీ అమెరికన్ సుప్రీంకోర్టు సోమవారం మే 17 వ తేదీని తీర్పు ఇచ్చింది.]

—యానాంలో దౌర్జన్యాలను గురించి భారత ప్రభుత్వం ఫ్రెంచి ప్రభుత్వానికి అధిక్షేపణ తెలియపరిచింది.

—పంచవర్ష ప్రణాళికకోసం ప్రభుత్వపు ఋణాలకుగాను బంగారాన్ని నగలనూ ఇవ్వడానికి వీలుగా కొన్ని బాంకులతో ఏర్పాటు చెయ్యబడిందని దుర్గాబాయి దేశముఖ్ గారు బొంబాయిలో ప్రకటించారు.

—నూతన ప్రాథమిక విద్యావిధానాన్ని (రాజాజీ 1953 లో ప్రవేశపెట్టిన విధానం) రద్దుపరచాలని ఆంధ్రప్రభుత్వం నియమించిన కమిటీ నివేదించింది.

—ఆంధ్రరాష్ట్ర శాసనసభ దేవాలయ ధర్మాదాయ సవరణ శాసనాన్ని ఆమోదించింది.

—ప్రభుత్వం సమకూర్చిన క్రొత్త ఇరిగేషన్ సౌకర్యాలకుగాను బెటర్మెంట్ లెవీ విధిస్తూ ఒక బిల్లును మంత్రి కోటిరెడ్డిగారు ఆంధ్ర శాసనసభలో ప్రవేశపెట్టారు.

— జనీవా సమావేశం కోరినట్లయితే ఇండోచీనాలో శాంతి సంరక్షణ నిమిత్తం ఐక్యరాజ్యసమితి కమిషన్ ఒకటి పంపడానికి అమెరికా సుముఖంగా ఉంటుందని అమెరికన్ విదేశాంగమంత్రి డల్లెస్ వాషింగ్టన్‌లో ప్రకటించారు

మంగళవారం, మే 25:

—జనీవా సమావేశం కోరినట్లయితే ఇండోచీనాలో శాంతి సంరక్షణ నిమిత్తం ఐక్యరాజ్యసమితి కమిషన్ ఒకటి పంపడానికి అమెరికా సుముఖంగా ఉంటుందని అమెరికన్ విదేశాంగ మంత్రి డల్లెస్ వాషింగ్టన్‌లో ప్రకటించారు.

—జనీవా సమావేశం ముగిసేవరకు ఆగ్నేయాసియాలో తీసుకోవలసిన చర్యలను గురించి బ్రిటిష్ ప్రభుత్వం ఎలాటి నిర్ణయాలకూ రాబోదని సర్ విన్స్టన్ చర్చిల్ పార్లమెంట్‌లో ప్రకటించారు.

—కొరియాలో తటస్థరాజ్యాల పర్యవేక్షణసంఘాన్ని రద్దుపరచడానికి అమెరికా పట్టు పడుతున్నదని జనీవాలో ఉత్తరకొరియా ప్రతినిధి ఆరోపించారు.

—తూర్పు బెంగాల్ ప్రత్యేక ప్రతిపత్తిని గురించి ముఖ్యమంత్రి ఫజ్లుల్ హక్ తమ అభిప్రాయాన్ని కరాచీలో వివరించారు.

—"ఆజాద్ కాశ్మీర్"లో మంత్రివర్గాన్ని తొలగించి పాకిస్తాన్ అధికారుల నిరంకుశత్వాన్ని అరికట్టాలని "ఆజాద్ కాశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్" నాయకులు ముగ్గురు ప్రకటించారు.

—సింహళంలో భారతీయులపట్ల సింహళ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం వల్ల నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలీ వ్యాపించగలవనీ, ఇందుకు సింహళ ప్రభుత్వమే పూర్తిబాధ్యత వహించవలసి ఉంటుందనీ కొలంబోలో భారత హైకమిషనర్ ఒక ప్రకటన చేశారు.

—అమెరికన్ 'ఫారెన్ ఆపరేషన్స్ ఎడ్మినిస్ట్రేషన్'తో కలిసి బ్రిటిష్, అమెరికన్, ఇండియన్ పెట్టుబడిదారులు మూడున్నర కోట్ల డాలర్ల నిధిని భారతదేశంలో పరిశ్రమల అభివృద్ధికిగాను స్థాపించగలరని వాషింగ్టన్ వార్త.

—భారత పార్లమెంటు ఉభయ సభల సమావేశం ముగిసిందని రాష్ట్రపతి ప్రకటించారు.

—కాంగ్రెస్ కేంద్రకార్యవర్గం నియమించిన పంచాయతీ సబ్ కమిటీ పంచాయతీలనుగురించి రాష్ట్ర ముఖ్యమంత్రు లందరి అభిప్రాయం తెలుసుకోవాలని నిర్ణయించింది.

—కమ్యూనిటీ ప్రాజెక్టులు సాధించిన అభివృద్ధినిగురించి ప్రాజెక్టుల కేంద్ర సంస్థ నివేదిక ప్రకటించింది.

—ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో గృహనిర్మాణం ప్రధాన సమస్యగా పరిగణింపబడుతుందని భారత ఆర్థికమంత్రి దేశముఖ్ బొంబాయిలో సూచించారు.

ఉద్యోగి (యజమానితో): "ఇంటిదగ్గిర మా ఆవిడ తమరిని యింక్రిమెంటుకోసం అడగమని రోజూ నా ప్రాణం తీసేస్తోందండి.

యజమాని: మీ ఆవిడ అడిగిందా?...అయితే యింటిదగ్గిర మా ఆవిణ్ణి అడిగి చెప్తాలే.

* * *

ఒక గుమస్తా (ఇంకొక గుమస్తాతో): పాపం మన తోటి గుమస్తా వెంకట్రావుగారికి అకస్మాత్తుగా చెవుడు వచ్చేసింది. ఉద్యోగంలోనుంచి తీసేస్తారేమో!

రెండో గుమస్తా: ఆ భయం ఏమీ అక్కరలేదులే. వెంటనే 'కంప్లెయింట్లు' శాఖకి బదిలీ చేసేస్తారు.

—ఆంధ్రదేశంలో ఎలక్ట్రిక్ సప్లై కంపెనీలను ప్రభుత్వాధీనం చేసుకునే బిల్లు, భవనాలను స్వాధీనం చేసుకునే బిల్లు ఆంధ్ర శాసనసభ ఆమోదం పొందాయి ★

నాగరికత

(11-వ పేజీ తరువాయి)

అందంగా, తిన్నగా, ఆకాశంపొడుగునా కాలిపోని గట్టితనంతో.

ప్ర. నీ: పరిహాసా లకిది సమయం కాదు.

భా. నీ: నేనేం పరిహాసం చేయటం లేదే మిత్రులిద్దరికీ! భవంతుల్లో, పట్టు పరుపుల్లో, చల్లనిగదుల్లో తిరిగే మనకి ఒక చిన్న గూడు కట్టుకోవడం రాదంటే నవ్వురాదూ విన్నవారి కెవరికైనా?

కా. నీ: నాన్సెన్స్! ఇళ్ళుకట్టడం మన పనికాదు: ఇంజనీర్లది, తాపీమేస్త్రీలది.


భా. నీ: అయితే పంటలు పండించేది రైతులని ఒప్పుకుంటావన్నమాట.

కా. నీ: [illegible] పంటలు రైతులే పండించాలి.

భా. నీ: [illegible] నాగరిక సమాజ జీవితం అవుతుందా?

కా. నీ. [illegible]

రేడియో ద్వారా భరతనాట్యం



నాగరికత

భా. నీ: దాన్నే సమిష్టిసాధన ఫలితం అనిన్నీ, నాగరికత అనిన్నీ వ్యవహరిస్తారు.

కొ. నీ: ఆ నిర్వచనం మా పుస్తకంలో కూడా వుంది

భా. నీ: పుస్తకాల్లో ఎన్నో వుంటాయి; కాని మన మన స్తత్వాలమీద ఒకటీ పని చెయ్యవు. అష్టవంకర్లతో నైనా చిన్న కొంప కట్టుకోలేని మనిషి, తను స్వయంగా యిన్ని మెతుకుల్ని సృష్టించి కడుపు గొడవ చల్లార్చుకోలేని మనిషి సమిష్టి జీవితంలో కొందర్ని అసహ్యించుకోవడంలో యేం గొప్పతనం వుంది?

ప్ర. ప్ర. నీ: ఇక ఆగు - నన్నింక బాధించకు. (నిష్క్రమణ)

[స్టేజిమీది దీపం క్రమంగా ఫేడౌట్ అవుతుంది. కొంతసేపు అలానే వుంటుంది విరామాన్ని సూచించేట్టు. తర్వాత క్రమేపీ వెలిగేసరికి ఒక మంచం, అందుమీద కొడుకునీడ, ప్రక్క ప్రజాప్రతినిధి, అతని భార్యా కూచుని వుంటారు]

కొ. నీ: (బాధపడుతూ) అమ్మా! తల నొప్పితో చచ్చిపోతున్నానే.. ఇక నేను బ్రతకలేను నాన్నా.. మందూ, మాకూ లేకండా ఇలా నన్ను చిత్రవధ చేసేబదులు ఒక్కసారే చంపెయ్యండి నాన్నా.

భా నీ: అలా అనకు బాబు మీనాన్న గారికి వైద్యం చేతకాదు చలిజ్వరానికి యింజక్షను తీసకోవాలి కాని మన కా మందులగొడవ తెలీదు బాబు.

ప్ర ప్ర నీ: ఇలాంటి సమయంలో కూడా హాస్యమేనా ?

భా. నీ. హాస్యం హాస్యమని మిమ్మల్ని మీర స్తమానం ఎందుకు సమర్థించుకో చూస్తారు?

ప్ర ప్ర.నీ: నాది సమర్థన కాదు; అపును నిజమే: నాకు యిల్లు కట్టుకోవడం చేత కాదు, పంటలు పండించడం తెలీదు, వైద్యం రాదు - అందుకని న న్నెందుకు అస్తమానం దెప్పుతుంటాలి?

భా నీ: అయితే మీకు స్వతః తెలిసిన దేమిటి?

ప్ర. ప్ర. నీ: నాకు చాలా తెలుసు - కాని వాటి ఉపయోగం యిక్కడేం పని కొస్తుంది?

భా. నీ: ఎందుకు పనికిరాదు? మీకు ఉపన్యసించడం వచ్చు; శాసనాలు చెయ్యడం వచ్చు; దండించడం వచ్చు; వధించడం వచ్చు - ఉపన్యసించండి, వధించండి—

కొ. నీ: అమ్మా - తల ఎగిరిపోతోందే!

భా. నీ: నాన్నగారు అశక్తులు బాబు. మనదేశంలో అయితే ఈపాటికి లక్షమంది వైద్యులు వచ్చివుండేవారు. నువ్వింత బాధ పడే అవసరం లేకపోను. ఆ సమిష్టి జీవితంలో మీ నాన్నగారు, మీ నాన్నగారి లాంటివాళ్లు మానవజాతికి కావలసిన ప్రతి చిన్న అవసరాన్నీ, విలువనీ అధికారంతో పాదాక్రాంతం చేసుకున్నారే గాని, అది తనవరకు వచ్చేసరికి మానవుడు ఒంటరిగా ఏ విలువనీ ఒక్కసారిగా సాధించలేడనే సత్యాన్ని నమ్మలేకపోయారు

కొ. నీ: (బాధగా) అ—మ్మా—

ప్ర ప్ర. నీ: బాబూ, బాబూ, అదేమిటి-అదేమిటి - అలా కళ్ళు తేలేశావేం? బాబూ!

భా నీ: (ఏడుస్తూ) బాబూ... నేను... చూడు నాన్నా...అమ్మని...

కొ. నీ: నా.. న్న. అ మ్......

[ప్రజాప్రతినిధీ, భార్యా ఏడుస్తారు. కల్లోలంగా సంగీతం శృతి హెచ్చుతుంది. వెనక పెద్దలైటు మెల్లగా ఫేడౌట్ అయి పూర్తిగా ఆరిపోతుంది మొదట కనిపించిన బెడ్ లైట్ వెలుగుతుంది. తెల్ల తెర లేస్తుంది ఛప్పున పరుపుమీది ప్రజాప్రతినిధి కంగారుగా లేచిపోతాడు.]

ప్ర ప్ర: (కంగారుగా) ఏమిటిదంతా! కలా!.. ని.. న్నిజంగా జరిగినట్టే.. — ఎవరక్కడ (ఛప్పున లేస్తాడు స్టేజిమీద దీపాలు ఒక్కొక్కటే వెలుగుతాయి)

అ కం: (ప్రవేశించి) చిత్తం - యువర్ ఎక్సలెన్సీ.

ప్ర ప్ర: ప్రొద్దుట నినాదాలు చేసినవాళ్ళవరో తెలుసా?

అ కం: తెలుసు యువర్ ఎక్సలెన్సీ... వాళ్లలీడర్ ఫైరింగ్ లో చనిపోయాడు.

ప్ర ప్ర: చనిపోయాడా! అరె! ఎంత పనయింది! సరె, మిగిలినవాళ్ళనే నేను పిలుస్తున్నానని ఛప్పున పిలుచుకరా

అ. కం: వాళ్ళు భయపడుతున్నారు యువర్ ఎక్సలెన్సీ.

ప్ర.ప్ర: వెళ్ళవోయ్ - వాళ్ళకి మనతో బాటు పూర్తి స్వాతంత్ర్యం యిస్తున్నామని ప్రకటించు పత్రికల్లోగూడా ప్రకటించు. మన ప్రతినిధులందరికీ తెలియచెయ్యి: సమానత్వం దేశంలో సర్వత్రా వర్ధిల్లాలని.

అ కం: చిత్తం యువర్ ఎక్సలెన్సీ (నిష్క్రమణ.)

(తెర) ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madraas




గగనమంటిన గడ్డిమొంక ౮౨.

అమ్మకమునకు సిద్ధముగా వున్నది!

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు

విక్టర్ హ్యూగో రచించిన



నవలకు పుస్తకరూపంలో తెనుగు అనువాదం

అనువాదకులు: సూరంపూడి సీతారాం

(ఆంధ్రపత్రిక - సచిత్ర వారపత్రిక నుండి పునర్ముద్రితం)

వెల: రూ. 1-8-0 ★ **పోస్టుఖర్చులు ప్రత్యేకం.**

మీ కాపీకై నేడే వ్రాయండి.

ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు-1.